www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

రాజ్‌భవన్‌లో మార్ఫింగ్ రచ్చ!

మార్ఫింగ్ ఫొటోలతో తోటి ఉద్యోగినిని బెదిరించిన ఓ ఉద్యోగి.. అరెస్టు, సస్పెన్షన్
బెయిల్‌పై విడుదలై రాజ్‌భవన్‌కు వచ్చి హార్డ్‌డిస్క్‌ల చోరీ
మార్ఫింగ్ ఫొటోలు బయటికిరాకూడదని దొంగతనం
సిబ్బంది ఫిర్యాదుతో మరోసారి అరెస్టు

14

రాజ్‌భవన్‌లో కీలక ఫైళ్లు మాయం అంటూ జోరుగా ప్రచారం
అసలు విషయం బయటపెట్టిన పోలీసులు



బుధవారం | 21-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 35

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: నవమి తె.3.22 తదుపరి దశమి; నక్షత్రం: శతభిషం రా.6.58 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా.1.03-2.34; దుర్ముహూర్తం: ఉ.11.46-12.37; అమృతఘడియలు: ఉ.11.56-1.29; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.38

హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కేసీఆర్‌కు పిలుపు

జూన్ 5న విచారణకు రమ్మన్న కాళేశ్వరం కమిషన్



- హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకూ పిలుపు
- వ్యక్తిగతంగా, రిజిస్టర్డ్ పోస్టులో ముగ్గురికి సమన్లు
- కాళేశ్వరం నిర్మాణ పర్యవేక్షణపై కేసీఆర్, హరీశ్‌లకు..
- నిధుల విడుదలపై నాటి ఆర్థిక మంత్రి ఈటలకు..





హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విచారణకు రావాలని కోరింది. ఈ మేరకు ఆయనకు సమన్లు పంపింది. కమిషన్ ముందు జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది. ఆయనతో పాటు బ్యారేజీల నిర్మాణ కాలంలో నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావుకు, ఆర్థిక మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్‌కు కూడా సమన్లు జారీ చేశారు. హరీశ్‌ను జూన్ 6న, ఈటలను జూన్ 9న హాజరవ్వాలని కోరారు. మూడు పేజీల సమన్లను ముగ్గురికీ నేరుగా వ్యక్తిగతంగా పంపడమే కాకుండా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా కూడా కమిషన్ పంపింది. కమిషన్ గడువు ఈ నెలాఖరుతో ముగుస్తుండగా అనూహ్యంగా గడువును రెండు నెలల పాటు పొడిగిస్తూ సోమవారం ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. 2016లో కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణం ప్రారంభమైంది. 2019 మేలో పూర్తయింది. 2016 నుంచి 2018 సెప్టెంబరు 6 వరకు నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్‌రావు ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై విధాన నిర్ణయం కేసీఆర్ తీసుకున్నారు. బ్యారేజీల స్థలాల

మిగతా 13వ పేజీలో...

కిం కర్తవ్యం?

కాళేశ్వరం కమిషన్ జారీ చేసిన నోటీసులపై ఏం చేద్దాం?
విచారణకు హాజరు కావాలా.. వద్దా?.. కేసీఆర్ సమాలోచనలు
ఎర్రవల్లిలో ఆయనతో హరీశ్ భేటీ
న్యాయనిపుణుల సలహాతో 2-3 రోజుల్లో నిర్ణయం!

13

కేసీఆర్ చట్టాన్ని గౌరవిస్తారని భావిస్తున్నా

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

13

కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్

రాజకీయ కక్షతోనే కేసీఆర్‌కు నోటీసులు
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

13

నోటీసులు అందాక స్పందిస్తా

నోటీసులు చూడకుండా ఏమీ మాట్లాడలేను: ఎంపీ ఈటల



సీఎం రేవంత్‌రెడ్డితో రష్యా కాన్సుల్ జనరల్ వాలెరీ ఖోద్జాయేవ్

లోటుపాట్లు సరిదిద్దుకోండి!

నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువగా ఉండండి
ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు రాకుండా చూసుకోండి
స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయండి

13

నాగర్ కర్నూల్, మల్కాజిగిరి, మెదక్ పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రేవంత్ దిశానిర్దేశం
పనితీరు నివేదికల ఆధారంగా ఎమ్మెల్యేలతో సీఎం ముఖాముఖి

గీత దాటొద్దు

హుందాతనం మరవద్దు

విధులకు కట్టుబడి ఉండండి.. క్రమశిక్షణ పాటించండి
సర్వీసు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోండి
బహిరంగ సభల్లో మితిమీరి జోక్యం చేసుకోవద్దు
అత్యుత్సాహం ప్రదర్శించి ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చొద్దు
అఖిలభారత సర్వీసు అధికారులకు ప్రభుత్వం హెచ్చరిక
ఇటీవల చోటుచేసుకున్న ఉదంతాల నేపథ్యంలో ఉత్తర్వులు

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సర్వీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో కొందరు.. పరిధి దాటి ప్రవరిస్తుండడం, హద్దులను మరిచి అత్యుత్సాహం ప్రదర్శిస్తుండడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. వారు తమ విధులకు కట్టుబడి ఉండాలని, సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా నడచుకోవాలని సూచించింది. బహిరంగ సభల్లో మితిమీరిన జోక్యం చేసుకోవద్దని, హుందాగా వ్యవహరించాలని హెచ్చరించింది. సమూహాలు, బహిరంగ సభల్లో పాల్గొనడంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు

మిగతా 13వ పేజీలో...

నాలుగైదు రోజుల్లోనే కేరళకు నైరుతి

సాధారణం కంటే వారం ముందే రాక
రాష్ట్రంలో నేడు, రేపు అక్కడక్కడా వర్షాలు!
మంగళవారం అశ్వాపురంలో అత్యధికంగా 5.9 సెంటీమీటర్ల వర్షం

14

పెంచిన టికెట్ ధర 10% తగ్గింపు

హైదరాబాద్ మెట్రో నిర్ణయం
ఈ నెల 24 నుంచి చార్జీలు అమలులోకి

పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు 'ఫీల్డ్ మార్షల్' ర్యాంక్

భారత్‌తో పోరు నేపథ్యంలో పదోన్నతి


2

పాక్ దాడులు.. స్వర్ణ దేవాలయంలో ఏడీ గన్స్ మోహరించాం

ప్రధాన పూజారి అందుకు మాకు అనుమతిచ్చారు
శత్రు డ్రోన్ల గుర్తింపునకు దీపాలూ ఆర్పేశారు
ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ డీజీ సుమేర్ ఇవాన్
ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆర్మీ ప్రకటన



ఎంఆర్ శ్రీనివాసన్



జయంత్ నార్లీకర్

ఎంఆర్ శ్రీనివాసన్, నార్లీకర్ కన్నుమూత

ఒకేరోజు ఇద్దరు సీనియర్ శాస్త్రవేత్తల మృతి
ఎంఆర్ శ్రీనివాసన్ అణు శక్తి కమిషన్ మాజీ చైర్మన్.. అణు విద్యుత్తు ప్రాజెక్టుల్లో కీలక పాత్ర
భారత ఖగోళ శాస్త్ర రంగంలో శిఖర సమానుడు జయంత్ నార్లీకర్

2

మోదీ, రేవంత్ సహా పలువురి సంతాపం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం

పెళ్లింట విషాదం

రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని ఢీకొట్టిన పెళ్లి బస్సు
వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ వద్ద ప్రమాదం
బస్సులోని వారిలో నలుగురి మృతి
14 మందికి తీవ్రగాయాలు
పెళ్లి విందుకు వెళ్లి వస్తుండగా ఘటన.. వధూవరులు క్షేమం
ప్రమాదంపై సీఎం రేవంత్, స్పీకర్, మంత్రి దామోదర విచారం

పరిగి, వికారాబాద్, హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లి వేడుక ముగిసి.. అంతే ఘనంగా విందు కార్యక్రమం నిర్వహించిన కొద్దిసేపటికే వధువు తరఫువారికి చేదు వార్త చెవిన పడింది. వరుడి తరఫువారు ప్రయాణిస్తున్న ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురైందని.. కొందరు దుర్మరణం పాలయ్యారని.. ఇంకొందరు గాయపడ్డారని! ఫలితంగా అప్పటిదాకా ఆనందం వెల్లివిరిసిన ఆ పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ గ్రామ శివారులోని హైదరాబాద్-బీజాపూర్

మిగతా 3వ పేజీలో...

న్యాయ వ్యవస్థలో తిమింగలాలు!

జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్‌కు ఎన్నాళ్లు?
నేర న్యాయవ్యవస్థ సామాన్యులకేనా?
అంతర్గత విచారణలో పారదర్శకత ఏదీ?
నివేదికను బయటు పెట్టాలి
ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



న్యూఢిల్లీ, మే 20: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మరోసారి న్యాయవ్యవస్థ మీద విరుచుకుపడ్డారు. అధికార నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు దాచారని ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ మీద ఎందుకు ఇంతవరకు పోలీస్ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ప్రశ్నించారు. ముగ్గురు న్యాయమూర్తులతో జరిపించిన విచారణకు ఎలాంటి చట్టబద్ధత లేదని వ్యాఖ్యానించారు. దేశంలోని ప్రతీ ఒక్కరూ ఈ కేసులో ఎలాంటి చర్యలు లేకుండా మూసేస్తారని భావిస్తున్నారని చెప్పారు. సోమవారం రాత్రి ఆయన ఢిల్లీలో ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. "మన ముందు ఒక చేదు నిజం

మిగతా 10వ పేజీలో...

ఇప్పటికి వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధమే

స్టే ఇవ్వాలంటే బలమైన కారణం చూపాల్సిందే
సుప్రీంకోర్టు స్పష్టీకరణ
ఆస్తులను లాక్కోవడమే చట్టం ఉద్దేశం: సిబల్
పారదర్శకత కోసమే బోర్డులో ఇతర మతస్థులు
ప్రభుత్వ న్యాయవాది

10



తల్లిదండ్రులతో చాడ నిఖిల్‌రెడ్డి

ఐఎఫ్ఎస్ టాప్-50లో ముగ్గురు మనోళ్లు

చాడ నిఖిల్‌రెడ్డి 11వ ర్యాంకు, జి.ప్రశాంత్ 25వ ర్యాంక్
చెరుకు అవినాశ్‌రెడ్డికి 40వ ర్యాంకు
తుది ఫలితాలు ప్రకటించిన యూపీఎస్సీ
దేశవ్యాప్తంగా 143 మంది ఎంపిక.. వీరిలో 80 మంది అదనపు డీజీపీ మహేశ్ భగవత్ గైడెన్స్ తీసుకున్న వారే

హైదరాబాద్/మిర్యాలగూడ అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్-2024లో తెలంగాణ అభ్యర్థులు మెరిశారు. దేశవ్యాప్తంగా అడవుల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే ఈ సర్వీస్ అధికారుల కోసం నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) తాజాగా విడుదల చేసింది. ఫారెస్ట్ సర్వీస్‌కు దేశవ్యాప్తంగా మొత్తం 143 మంది

మిగతా 14వ పేజీలో...

మాతృభాషతో.. మరింత అందంగా..!

సొంత భాషలో ప్రసంగించిన.. మిస్‌వరల్డ్ సుందరీమణులు
ప్రత్యేక అనువాదకులతో టీ-హబ్‌లో కార్యక్రమం
'నమస్తే ఇండియా' అంటూ తొలి పలుకు.. కిమ్స్ ఆస్పత్రి సందర్శన
నేడు శిల్పారామంలో సందడి
'ఎలిమినేషన్' ప్రక్రియ ప్రారంభం
6 విభాగాల్లో పోటీలు
ప్రతిభ ఆధారంగా 1 నుంచి 107 వరకు ర్యాంకులు
టాప్ 40లో ఉన్నవారు చివరి వరకు పోటీలో..
మిగతావారు ఔట్

మిస్ చైనా



మిస్ అర్జెంటీనా



హైదరాబాద్/సికింద్రాబాద్/హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులు కొందరు తమ మాతృభాషలో అందంగా ప్రసంగించారు. అందరికీ తెలిసిన ఇంగ్లీష్ కాదని.. కొద్దిమందే మాట్లాడే తమ సొంత భాషలో మాట్లాడి ఆకట్టుకున్నారు. పోటీదారుల్లో ప్రతిభను గుర్తించేందుకు ఉద్దేశించిన 'హెడ్ 2 హెడ్' పోటీలు

మిగతా 11వ పేజీలో...



అహ్మదాబాద్-ముంబై మధ్య నిర్మితమవుతున్న వంతెన

బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో 300 కి.మీ వంతెన పూర్తి

అహ్మదాబాద్-ముంబై మధ్య 518 కిలోమీటర్ల కారిడార్

న్యూఢిల్లీ, మే 20: అహ్మదాబాద్-ముంబై మధ్య బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వంతెనలో 300 కి.మీ. పూర్తైందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ మేరకు ఓ వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ రైలు కారిడార్ మొత్తం పొడవు 518.17 కి.మీ.లు. దేశంలోనే మొట్టమొదటి బుల్లెట్ రైలు ప్రాజెక్టు ఇది. దీని విలువ రూ.1.08 లక్షల కోట్లు. 2017లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2021లో పనులు ప్రారంభమయ్యాయి. ఈ రైలు అందుబాటులోకి వస్తే అహ్మదాబాద్ నుంచి ముంబైకి 3 గంటల్లోనే చేరుకోవచ్చు. తొలి ట్రయల్‌ను 2026లో చేపట్టనున్నారు. ఈ రైలు గంటకు గరిష్ఠంగా 320 కి.మీ. వేగంతో ప్రయాణించగలదు.



ఆరోగ్యానికి ఉద్యోగుల వాటా ఎంత?

ఒకటా, ఒకటిన్నర శాతమా?
రెండు రకాల ప్రతిపాదనలు సిద్ధం
'ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం'పై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
ఇతర రాష్ట్రాల్లోనూ అమలుపై అధ్యయనం
తమ వాటా ఒక శాతానికి మించి ఇవ్వలేమంటున్న ఉద్యోగ సంఘాలు

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం (న్యూఈహెచ్ఎస్)పై ప్రభుత్వం ఇంకా ఒక స్పష్టతకు రాలేకపోతోంది. తాజాగా దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. కొత్త ఈహెచ్ఎస్‌లో ఉద్యోగుల వాటా ఎంత ఉండాలన్న దానిపై వైద్య ఆరోగ్యశాఖ రెండు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మొదటి ప్రతిపాదన కింద ఉద్యోగుల మూలవేతనం నుంచి ఒక శాతం


మిగతా 3వ పేజీలో...



ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త

జయంత్ నార్లీకర్ మృతి

మోదీ, రేవంత్ సంతాపం



పుణె, హైదరాబాద్, మే 20 : ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త జయంత్ విష్ణు నార్లీకర్(86) మంగళవారం పుణెలో మృతి చెందారు. భారత శాస్త్ర రంగంలో శిఖర సమానుడైన ఆయన ఖగోళ శాస్త్ర రంగానికి ఎన్నో సేవలు అందించారు. దేశంలో పలు పరిశోధన సంస్థల ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించారు. ఆయన అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ ప్రకటించారు. ఉన్నత విద్యను ఇంగ్లాండులోని కేంబ్రిడ్జి యూనివర్సిటీలో పూర్తి చేసిన నార్లికర్ 1972లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చిలో చేరి 1989 వరకు పనిచేశారు. 1998లో యూజీసీ ఆయన్ను 'ఇంటర్-యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్'(ఐయూసీఏఏ)ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరి.. దానికి స్థాపక డైరెక్టర్‌గా నియమించింది. ఖగోళ భౌతికశాస్త్రంలో ఆయన చేసిన సేవలను గుర్తించి 1996లో యునెస్కో కళింగ అవార్డు ప్రదానం చేసింది. 1965లో కేవలం 26 ఏళ్లకే నార్లికర్ పద్మ భూషణ్ అవార్డు అందుకోవడం విశేషం. 2004లో పద్మ విభూషణ్ అందుకున్నారు. ఆయన మృతితో దేశం ఒక దూరదృష్టిగల ఖగోళ భౌతిక శాస్త్రవేత్తను కోల్పోయిందని ఇస్రో మాజీ ఛైర్మన్ సోమ్‌నాథ్ అన్నారు. నార్లికర్ మృతి పట్ల ప్రధాని మోదీ, సీఎం రేవంత్ సంతాపం ప్రకటించారు.

అణు శక్తి కమిషన్ మాజీ ఛైర్మన్

శ్రీనివాసన్ కన్నుమూత



న్యూఢిల్లీ, చెన్నై, మే 20: ప్రముఖ అణు శాస్త్రవేత్త, అణు శక్తి కమిషన్ మాజీ ఛైర్మన్ పద్మ విభూషణ్ ఎంఆర్. శ్రీనివాసన్(95) తమిళనాడులోని ఉదగ మండలం(ఊటీ)లో మంగళవారం కన్నుమూశారు. బెంగళూరులో జన్మించిన శ్రీనివాసన్ 1955లో భారత అణు శక్తి విభాగంలో చేరారు. దేశంలో తొలి అణు పరిశోధన రియాక్టర్ అప్సర అభివృద్ధిలో ప్రముఖ శాస్త్రవేత్త హోమీ బాబాతో కలిసి పనిచేశారు. 1974లో అణుశక్తి శాఖలో అణు విద్యుత్తు ప్రాజెక్టుల ఇంజనీరింగ్ విభాగానికి డైరెక్టర్ అయ్యారు. 1984లో న్యూక్లియర్ పవర్ బోర్డు ఛైర్మన్ అయ్యారు. ఆ సమయంలో దేశ వ్యాప్తంగా పలు అణు విద్యుత్తు ప్రాజెక్టుల రూపకల్పన, అభివృద్ధి, నిర్వహణలో కీలక పాత్ర వహించారు. శ్రీనివాసన్ నాయకత్వంలో దేశంలో 18 అణు విద్యుత్తు యూనిట్లకు రూపకల్పన జరగడం విశేషం. ప్రస్తుతం వాటిలో ఏడు పని చేస్తున్నాయి. 1987లో అణు శక్తి కమిషన్ ఛైర్మన్‌గా, అలాగే అణు శక్తి శాఖకు కార్యదర్శిగా నియమితులయ్యారు. దేశ అణు శక్తి కార్యక్రమానికి శ్రీనివాసన్ చేసిన సేవలకు గుర్తింపుగా 2015లో కేంద్రం పద్మ విభూషణ్ అవార్డు ప్రదానం చేసింది. ఆయన మృతికి ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

న్యాయాధికారి పోస్టులకు

మూడేళ్ల లా ప్రాక్టీసు తప్పనిసరి

» డిగ్రీ ఉంటే చాలన్న నిబంధన ఎత్తివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 20: న్యాయాధికారిగా పదవులు చేపట్టాలంటే తొలుత న్యాయవాదిగా పనిచేసిన అనుభవం తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జ్యుడీషియల్ సర్వీసెస్‌లో ప్రారంభ పదవి అని మున్సిఫ్ మేజిస్ట్రేటుగా చేరాలంటే లాయర్‌గా కనీసం మూడేళ్ల ప్రాక్టీసు చేసి ఉండాలని తెలిపింది. న్యాయ కళాశాలల నుంచి పట్టాలు పొందిన వారు ఎలాంటి ప్రాక్టీసు లేకుండానే నేరుగా మున్సిఫ్ మేజిస్ట్రేటు పదవులు చేపట్టవచ్చంటూ 2002లో ఇచ్చిన ఆదేశాలను పక్కనపెట్టింది. ఈ మేరకు ధర్మాసనం మంగళవారం తీర్పు చెప్పింది. న్యాయ శాస్త్ర పట్టభద్రులు ఎలాంటి అనుభవం లేకుండా నేరుగా జ్యుడీషియల్ సర్వీసెస్‌లో చేరడం వల్ల చాలా సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపింది. అందువల్ల మున్సిఫ్ మేజిస్ట్రేటు, సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టులకు కనీసం మూడేళ్ల ప్రాక్టీసును తప్పనిసరి చేస్తున్నట్టు పేర్కొంది. ఈ మేరకు నిబంధనలను సవరించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అభ్యర్థికి మూడేళ్ల అనుభవం ఉన్నట్టు 10 ఏళ్ల పాటు ప్రాక్టీస్ చేస్తున్న లాయర్ ధ్రువపత్రం ఇవ్వాల్సి ఉంటుంది. లా క్లర్క్‌గా పనిచేసిన అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటారు.

జైల్లో ఏడాది ఉంటేనే బెయిల్ అన్న రూల్ లేదు

న్యూఢిల్లీ, మే 20: మనీలాండరింగ్ కేసుల్లో నిందితుడు ఏడాది పాటు జైలులో ఉంటేనే బెయిల్ ఇవ్వాలన్న నిబంధనేమీ లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రూ.2,000 కోట్ల మద్యం కుంభకోణంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వ్యాపారవేత్త అన్వర్ దేబర్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. గతేడాది ఆగస్టులో అరెస్టయిన అన్వర్ గత తొమ్మిది నెలలుగా జైలు ఉండడం, ఈ నేరం రుజువయితే ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్న విషయాలను పరిగణనలోకి తీసుకొంది. విచారణ ఇప్పట్లో ప్రారంభమయ్యే అవకాశాలు లేవని కూడా తెలిపింది. ఈ కారణాల దృష్ట్యా బెయిల్ మంజూరు చేసింది. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఏడాదిపాటు కస్టడీలో ఉన్న ప్రామాణికాన్ని సుప్రీంకోర్టే అమలు చేస్తోందని, అందువల్ల బెయిల్ ఇవ్వకూడదని కోరారు.

గాజాలో మృత్యుముఖాన 14వేల చిన్నారులు

టెల్అవివ్, మే 20: బాంబు దాడులతో గాజాను ఇజ్రాయెల్ దిగ్బంధనం చేయడంతో భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. గాజాలో ఒకే రోజున 70 మంది ప్రాణాలు కోల్పోయారు. అన్నింటికన్నా ముఖ్యంగా ఆహార సరఫరా వ్యవస్థలు నిలిచిపోవడంతో చిన్నారుల పరిస్థితి దారుణంగా తయారయింది. 48 గంటల్లోగా ఆహారం అందకపోతే దాదాపు 14వేల మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఐరాస మానవతా సాయం విభాగాధిపతి ఫ్లెచర్ హెచ్చరించారు. బేబీఫుడ్ లోడులతో వేలాది లారీలు సరిహద్దులో ఉన్నాయని, వాటికి ఇజ్రాయెల్ అనుమతించాల్సి ఉంటుందని చెప్పారు. మరోవైపు, గాజాకు ఎలాంటి సాయం అందకుండా 11 వారాల పాటు దిగ్బంధించడంపై బ్రిటన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది క్రూరత్వమని, ఇందుకు నిరసనగా ఇజ్రాయెల్‌తో వాణిజ్య ఒప్పంద చర్చలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

అనధికార వైద్య కాలేజీల్లో చేరొద్దు: ఎన్‌ఎంసీ


న్యూఢిల్లీ, మే 20: వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు.. ఎలాంటి గుర్తింపు లేని, లేదా నకిలీ గుర్తింపుతో నడుస్తున్న అనధికార కాలేజీల్లో చేరొద్దని జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) హెచ్చరించింది. దేశంలో కొన్ని కళాశాలలు ఎలాంటి గుర్తింపు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపింది. ఎంబీబీఎస్‌లో చేరగోరు విద్యార్థులు ఎన్‌ఎంసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మెడికల్ వర్సిటీలను పరిశీలించి ఎంచుకోవాలని సూచించింది. ఇక, విదేశాల్లో ఏ యూనివర్సిటీని ఎంచుకున్నా అక్కడే కనీసం 54 నెలల పాటు కోర్సు చేయాలని, 12 నెలల పాటు అదే దేశంలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలని పేర్కొంది. వారికి మాత్రమే ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ లైసెన్స్(ఎఫ్‌ఎంజీఎల్) లభిస్తుందని వివరించింది.

పాక్ దాడులను ముందే ఊహించి

స్వర్ణ దేవాలయంలో ఏడీ గన్స్!

మోహరించామని ఏఎన్‌ఐ ఇంటర్వ్యూలో తెలిపిన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ డీజీ సుమేర్ ఇవాన్

» ఆలయ ప్రధాన పూజారి అందుకు అనుమతిచ్చారని వెల్లడి
» అలాంటిదేమీ లేదని ఆర్మీ ప్రకటన



ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ డీజీ సుమేర్ ఇవాన్

న్యూఢిల్లీ, మే 19: ఆపరేషన్ సిందూర్ దరివిలా భారత్‌లోని పలు ప్రాంతాలపై దాడులకు పాక్ ప్రయత్నించిన వేళ.. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో ఆయుధాల మోహరింపునకు ఆలయ యాజమాన్యం అంగీకరించిందని ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ డీజీ, లెఫ్టినెంట్ జనరల్ సుమేర్ ఇవాన్ ఏఎన్‌ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు! అంతేకాదు.. శత్రుదేశ డ్రోన్లు, క్షిపణులను గుర్తించేందుకు వీలుగా తొలిసారి స్వర్ణ దేవాలయంలో విద్యుద్దీపాలన్నీ ఆర్పివేసినట్టు ఆయన వెల్లడించారు. దీనివల్ల శత్రు డ్రోన్లను గుర్తించి, వాటిని నిర్వీర్యం చేయడం భారత సైన్యానికి సులువైందని వివరించారు. "పాక్ మన ప్రజలను, మన దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతుందని మేం ముందే ఊహించాం. ఆ సమయంలో స్వర్ణ దేవాలయ ప్రధాన గ్రంధి (ప్రధాన పూజారి) ఎయిర్ డిఫెన్స్ గన్స్‌ను ఆలయంలో మోహరించడానికి అనుమతించారు. ఆలయానికి పొంచి ఉన్న ముప్పు గురించి మేం చెప్పినప్పుడు ఆ విషయాన్ని ఆలయ యాజమాన్యం అర్థం చేసుకుంది. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన, నిత్యం వందలు, వేలాది మంది సందర్శించే జాతీయ కట్టడాన్ని పరిరక్షించడం కోసం ఏడీ గన్స్‌ను మోహరించడానికి ఆమోదం తెలిపింది. దీంతో అక్కడ వాటిని మోహరించాం. అలాగే.. స్వర్ణదేవాలయంలో ఎన్నో ఏళ్లుగా వెలుగుతున్న దీపాలను బహుశా తొలిసారి ఆర్పివేశారు. దాంతో మేం ఆ దిశగా వచ్చే శత్రు డ్రోన్లను స్పష్టంగా చూడగలిగాం." అని ఆయన ఏఎన్‌ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరంగా వెల్లడించారు. పాకిస్థాన్‌లోని ఏ ప్రాంతంపై అయినా దాడి చేయగల సత్తా తమకు ఉందని, భారత్ పూర్తిస్థాయిలో దాడి చేస్తే కలుగులో దాక్కోవడం తప్ప దాయాది దేశానికి మరో మార్గం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

అలాంటిదేం లేదు..

స్వర్ణ దేవాలయంలో ఎయిర్ డిఫెన్స్ గన్స్‌ను మోహరించినట్టు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ డీజీ సుమేర్ ఇవాన్ చెబుతున్న వీడియో క్లిప్ ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నప్పటికీ.. ఆర్మీ దాన్ని కొట్టిపారేసింది. స్వర్ణదేవాలయంలో ఎలాంటి ఆయుధాలనూ మోహరించలేదని ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. "స్వర్ణదేవాలయంలో ఎయిర్‌డిఫెన్స్ గన్స్ మోహరింపునకు సంబంధించి కొన్ని కథనాలు మీడియాలో వస్తున్నాయి. కానీ.. శ్రీ దర్బార్ సాహిబ్ అమృత్‌సర్ (స్వర్ణదేవాలయం)లో ఏడీ గన్స్‌నుగానీ, మరే ఇతర ఆయుధాలనుగానీ మోహరించలేదని స్పష్టం చేస్తున్నాం" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. గోల్డెన్ టెంపుల్ ప్రధాన పూజారి.. సింగ్ సాహిబ్ జ్ఞానీ రఘుబీర్ సింగ్ సైతం ఆయుధాల మోహరింపు కథనాలను కొట్టిపారేశారు. "భారత సైన్యం సంప్రదింపుల గురించి నాకు ఎలాంటి సమాచారం లేదు. ఆ సమయంలో నేను సెలవులో ఉన్నా. వేరే దేశానికి వెళ్తున్నా. దీనిపై లోతైన విచారణ జరపాలి. దీని వెనుక భారత సైన్యం అసలు ఉద్దేశం ఏంటో తెలియాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఆలయ అదనపు ప్రధాన పూజారి జ్ఞానీ అమర్జీత్ సింగ్ కూడా.. ఆలయంలో ఆయుధాల మోహరింపునకు అనుమతిచ్చామనడం అసత్యమన్నారు. అధికారుల ఆదేశాల మేరకు బ్లాకవుట్ సమయంలో ఆలయం బయట, పైభాగంలో ఉన్న దీపాలను ఆర్పేశామని.. లోపలిభాగంలో తప్పనిసరిగా దీపాలు వెలుగుతూ ఉండాల్సిన చోట ఆర్పకుండా అలాగే ఉంచామని వెల్లడించారు. స్వర్ణదేవాలయ పవిత్రతను పూర్తిస్థాయిలో కాపాడామని ఆయన పేర్కొన్నారు.


భారత్, పాక్ సరిహద్దుల్లో ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నిలిచిపోయిన బీటింగ్ రిట్రీట్ సైనిక కవాతును మంగళవారం పునరుద్ధరించారు. పంజాబ్‌లోని 3 సరిహద్దు చెక్‌పోస్టుల్లో(అట్టారీ, హుస్సేనీవాలా, సద్కీ) బీటింగ్ రిట్రీట్ జరిగింది.



'ఆపరేషన్ సిందూర్'లో భారత్‌ను ఎదుర్కొనేందుకు పాకిస్థాన్‌కు క్షిపణులు, డ్రోన్లను తుర్కియే అందించగా.. ఇప్పుడు బంగ్లాదేశ్ కేంద్రంగా తుర్కియే కనుసన్నల్లో నడిచే ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా భారత్‌పై కుట్రలు చేస్తోంది. ఆ ఎన్‌జీవో తాజాగా బంగ్లాదేశ్ రాజ్యం పేరుతో మ్యాపును విడుదల చేసింది. ఆ మ్యాపులో భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలతో పాటు.. బిహార్, ఝార్ఖండ్, ఒడిసా, మయన్మార్‌లోని అరాకన్ రాష్ట్రం బంగ్లాదేశ్‌లో ఉన్నట్లు చూపించింది.

పంజాబ్‌లో ఖలిస్తానీ ఉగ్రవాదుల ముఠా అరెస్ట్

చండీగఢ్, మే 20: పాకిస్థాన్ ఐఎస్‌ఐ మద్దతుతో పనిచేస్తోన్న నిషేధిత బబ్బర్ ఖల్సా ఇంటర్‌నేషనల్ టెర్రర్ (బీకేఐ) ఉగ్రవాదుల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో ఆరుగురు ఉగ్రవాదుల్ని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. వీరంతా ఖలిస్తానీ తీవ్రవాదులని తమ విచారణలో తేలిందని పంజాబ్ డీజీపీ గౌరవ్ తెలిపారు. రెండు రోజుల క్రితం బటాలాలోని ఓ మద్యం దుకాణంపై జరిగిన గ్రెనేడ్ దాడి కూడా వీరి పనేనని ఆయన తెలిపారు. అరెస్టయిన వారు పోర్చుగల్ లో నివసించే విదేశీ హ్యాండర్ల ఆదేశాలతో పని చేస్తున్నారని అన్నారు.

పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు


'ఫీల్డ్ మార్షల్' ర్యాంక్



న్యూఢిల్లీ, మే 20: భారత్‌తో పోరులో 'అద్భుత పనితీరు' కనబర్చారంటూ పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిం మునీర్‌కు పాక్ ప్రభుత్వం పదోన్నతి కల్పించింది!! భారత్‌తో యుద్ధవాతావరణ నెలకొన్న సమయంలో ఎవరికీ కనిపించకుండా పోయిన మునీర్‌కు అత్యున్నతమైన 'ఫీల్డ్ మార్షల్' ర్యాంకును పాక్ సర్కారు కట్టబెట్టింది! ప్రధాని షెహబాజ్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం మునీర్‌కు పదోన్నతి ఇవ్వడానికి ఆమోదించిందంటూ పాక్ పీఎంవో ఓ ప్రకటనలో తెలిపినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ మంగళవారం వెల్లడించింది.

ఆపరేషన్ సిందూర్ 'చిన్న యుద్ధం'

» 'పహల్గాం' గురించి ప్రధానికి ముందే తెలుసు: ఖర్గే



బెంగళూరు/బళ్లారి, మే 20(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకుల ప్రాణాలను రక్షించడంలో కేంద్రం విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. ఆపరేషన్ సిందూర్‌ను 'చిన్న యుద్ధం'గా ఆయన అభివర్ణించారు. పహల్గాం దాడి గురించి ప్రధాని మోదీకి ముందే సమాచారం ఉందని, అందుకే జమ్మూకశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆరోపించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పాలన రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హోస్పేటలో మంగళవారం నిర్వహించిన సమర్పణ సంకల్ప ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉగ్రదాడిలో 26 మంది చనిపోతే ప్రధాని మోదీ బిహార్‌లో ఎన్నికల ర్యాలీలు చేశారని, రెండుసార్లు జరిగిన అఖిలపక్ష సమావేశాలకు కూడా హాజరుకాలేదని ఖర్గే విమర్శించారు. 'మేం గనుక ఈ భేటీలకు గైర్హాజరై ఉంటే.. మమ్మల్ని దేశద్రోహులుగా పిలిచేవారు' అని ఖర్గే అన్నారు. కాగా, ఆపరేషన్ సిందూర్ చిన్న యుద్ధమన్న ఖర్గే వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది.

భారత అండర్‌కవర్ ఏజెంట్ల వివరాలపై..

జ్యోతి ద్వారా పాక్ ఆరా



న్యూఢిల్లీ, మే 20: భారతదేశానికి చెందిన అండర్ కవర్ ఏజెంట్లను గుర్తించేందుకు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ.. యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను ఉపయోగించుకున్నట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. గూఢచర్యం కేసులో అరెస్టయి ఐదురోజుల పోలీసు కస్టడీలో ఉన్న జ్యోతి మల్హోత్రాను.. ఎన్ఐఏ, ఐబీ, హరియాణా పోలీసు అధికారులు విచారిస్తున్నారు. అందులో భాగంగా ఆమె ఫోన్‌లో వాట్సాప్ చాట్లను పరిశీలించగా... భారతదేశం నిర్వహించే అండర్‌కవర్ ఆపరేషన్లపై ఆమె అలీ హసన్ అనే ఐఎస్ఐ హ్యాండ్లర్‌తో సంకేత భాషలో చాట్ చేసినట్టు వెల్లడైంది. ఆమె అట్టారీ సరిహద్దు సందర్శనకు వెళ్లినప్పుడు.. "అక్కడ ఎవరైనా అండర్ కవర్ ఏజెంట్లకు ప్రత్యేక ప్రోటోకాల్ అమలుచేస్తున్నట్టు గమనించావా?" అని అలీ హసన్ ఒక చాట్‌లో ఆమెను ప్రశ్నించినట్టు, అలాంటిదేదీ తాను గమనించలేదని ఆమె సమాధానమిచ్చినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. కాగా.. దర్యాప్తులో భాగంగా తాము అడుగుతున్న ప్రశ్నలకు ఆమె సమాధానం ఇవ్వకుండా దాటవేస్తోందని, తమను తప్పుదోవ పట్టించే ప్రయత్నం కూడా చేస్తోందని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. కాగా, 2014 మే 17న వైశాఖీ పండుగకు పాకిస్థాన్ వెళ్లిన జ్యోతి.. 10రోజుల వేడుకలు ముగిశాక కూడా మరో 20 రోజులపాటు అక్కడే ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 2023 ఏప్రిల్‌లో మరోసారి.. 2024లో మూడోసారి ఆమె పాకిస్థాన్‌లో పర్యటించింది. అక్కడి నుంచి భారత్‌కు తిరిగొచ్చాక ఆమె చైనా వెళ్లింది. ఆ ట్రిప్‌ను కూడా పాకిస్థానీ అధికారులే ఏర్పాటు చేశారా అనే అంశంపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. ఆమె డైరీలో 11 పేజీల్లో ఆమె పాక్ పర్యటనల గురించి రాసుకున్నట్లు అధికారులు గుర్తించారు.

యూసుఫ్ పఠాన్ స్థానంలో అభిషేక్ బెనర్జీ

» అఖిలపక్ష బృందం కోసం టీఎంసీ ఎంపిక

న్యూఢిల్లీ, మే 20: భారత్‌పై విషం చిమ్ముతున్న పాకిస్థాన్ వైఖరిని ఎండగట్టేందుకు వివిధ దేశాలకు పంపేందుకు ఎంపిక చేసిన అఖిలపక్ష బృందాల్లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తమ ప్రతినిధిగా అభిషేక్ బెనర్జీని ఎంపిక చేసినట్లు మంగళవారం ప్రకటించింది. అంతకుముందు కేంద్రప్రభుత్వం తృణమూల్ ఎంపీ, మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్‌ను ఎంపిక చేసింది. అయితే, తనకు సమాచారం ఇవ్వకుండానే కేంద్రప్రభుత్వం తమ ఎంపీ యూసఫ్‌ను అఖిలపక్ష బృందం కోసం ఎంపిక చేసిందని టీఎంసీ అధ్యక్షురాలు మమత ఆరోపించారు. ఈ నేపథ్యంలో అఖిలపక్ష బృందం నుంచి తప్పుకుంటున్నట్లు యూసుఫ్ పఠాన్ సోమవారం ప్రకటించారు. తర్వాత అభిషేక్ బెనర్జీని ఎంపిక చేసినట్లు తృణమూల్ కాంగ్రెస్ మంగళవారం 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. సోమవారం అభిషేక్ ఈ విషయమై స్పందిస్తూ.. 'ఉగ్రవాదంపై పోరు విషయంలో కేంద్రంతో కలిసి భుజం భుజం కలిపి పోరాడుతుంది. కానీ, పాక్‌పై దౌత్య యుద్ధానికి మా పార్టీలో ఎవరిని ఎంపిక చేయాలో ఏకపక్షంగా కేంద్రం నిర్ణయించజాలదు' అని తెలిపారు. ఇక విదేశాలకు పంపే అఖిలపక్ష బృందాలకు కేంద్రం.. కాంగ్రెస్ పార్టీ సూచించిన నేతల పేర్లు పక్కన బెట్టి, ఆ పార్టీకే చెందిన ఎంపీ శశి థరూర్‌ను ఎంపిక చేసింది. దీనిపై హస్తం పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది.

అఖిలపక్ష బృందాలతో విక్రం మిస్రీ భేటి

విదేశాలకు వెళ్లి అక్కడి నేతలకు పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలను వివరించడానికి ఉద్దేశించిన అఖిలపక్ష బృందాలతో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి విక్రం మిస్రీ మంగళవారం భేటీ అయ్యారు. ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ఏ విధంగా ప్రోత్సహిస్తోందీ, భారత్ వాటిని ఏ రూపంలో తిప్పికొడుతోందన్న విషయాలను ఏ పద్ధతిలో చెప్పాలనేదానిని వారికి వివరించారు. ఈ బృందాలు బుధవారం పర్యటనలకు బయలుదేరనున్న నేపథ్యంలో పలు సూచనలు ఇచ్చారు.




అంజన్నకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి

ఘనంగా కొండగట్టు అంజన్న పెద్ద జయంత్యుత్సవాలు

» భద్రాచలం రాములోరి పట్టువస్త్రాల సమర్పణ

మల్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అంజన్నకు ప్రభుత్వం తరఫున చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, భద్రాచలం సీతారాముల దేవస్థానం తరఫున ఆలయ ఈవో రమాదేవి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కళాకారులతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఉత్సవమూర్తులకు పూజలు చేసి యాగశాల ప్రవేశం చేశారు. ఈ వేడుకలకు సుమారు రెండు లక్షల మంది దీక్షాపరులు తరలిరానున్నారు.

నలుగురు రోహింగ్యాల అరెస్టు

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అక్రమంగా ఉంటున్న నలుగురు రోహింగ్యాలను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ ఎస్‌వోటీ, హయత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. మయన్మార్‌కు చెందిన మహ్మద్ అర్మాన్ అలియాస్ సయ్యద్-ఉల్-అమిన్(32), అతని భార్య మహమ్మద్ రుమానా అక్తర్ అలియాస్ ముస్తఖున్నీసా(26) 2011లో అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఇక్కడి హఫీజ్‌బాబానగర్‌లోని జామియా సరియా మదర్సాలో టీచర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ హారిస్ అలియాస్ మహమ్మద్ రిజ్వాన్(మయన్మార్‌కు చెందినవాడు), రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆగపల్లికి చెందిన మదర్సా టీచర్ అయాజ్‌తో వీరికి పరిచయం ఏర్పడింది. మదర్సా టీచర్లిద్దరూ అర్మాన్‌కు నకిలీ ధ్రువపత్రాలను సమకూర్చారు. వాటి ఆధారంగా మంచాలలోని మీసేవ కేంద్రం ద్వారా అర్మాన్ తొలుత ఆధార్ కార్డును తీసుకున్నాడు. నకిలీ నిఖా సర్టిఫికెట్‌తో రుమానాకు కూడా ఆధార్ ఇప్పించాడు. అర్మాన్ సోదరుడు మహమ్మద్ నయీం అలియాస్ హైరుల్ అమిన్(20) కూడా 2016లో మయన్మార్ నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఇతనికి బాలాపూర్‌లో ఉండే షోయబ్‌మాలిక్ అనే మయన్మార్ జాతీయుడు నకిలీ పత్రాలు సమకూర్చి, ఆధార్‌కార్డు ఇప్పించాడు. అర్మాన్ కుటుంబం ఆధార్ సాయంతో పాన్‌కార్డులు, ఓటర్ ఐడీలు, డ్రైవింగ్‌లైసెన్సులు తీసుకున్నారు. పలు బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. వీరి వ్యవహారంపై ఉప్పందుకున్న ఎల్బీనగర్ ఎస్‌వోటీ, హయత్‌నగర్ పోలీసులు మంగళవారం అర్మాన్, రుమానా, నయీం, మదర్సా టీచర్ హారిస్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి 5 ఆధార్‌కార్డులు, 2 పాన్‌కార్డులు, 5 ఓటర్ ఐడీలు, డ్రైవింగ్ లైసెన్స్, 2ఎల్ఐసీ పాలసీలు, 3 ఏటీఎం కార్డులు, గ్యాస్ బుక్, 4 బ్యాంకు పాస్ పుస్తకాలు, నాలుగు జనన ధ్రువీకరణ పత్రాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అయాజ్, షోయబ్ మాలిక్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరోగ్యానికి ఉద్యోగుల వాటా ఎంత?

(మొదటిపేజీ తరువాయి)



తీసుకుంటారు. ఒక శాతం తీసుకుంటే ప్రతీనెలా సుమారు రూ.29.19 కోట్ల చొప్పున ఏడాదికి రూ.350 కోట్లు జమ అవుతాయి. ఈ మొత్తానికి ప్రభుత్వం మరో రూ.250 కోట్లు జమ చేస్తే... మొత్తంగా రూ.600 కోట్లు అవుతుందని అంచనా వేశారు. రెండో ప్రతిపాదన కింద ఉద్యోగుల మూల వేతనం నుంచి 1.5 శాతం తీసుకుంటే నెలకు రూ.43.79 కోట్ల చొప్పున ఏడాదికి రూ.525 కోట్లు జమవుతాయని లెక్కగట్టారు. ఈ మొత్తానికి సర్కారు రూ.75 కోట్లు జమచేస్తే రూ.600 కోట్లు అవుతాయని పేర్కొన్నారు. కాగా, 2021-22 నుంచి 2024-25 మధ్య కాలంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్, నగదురహిత వైద్యం కింద ప్రభుత్వం రూ.2298 కోట్లు ఖర్చుపెట్టింది. అంటే ఏడాదికి నగటున మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద రూ.409 కోట్లు, నగదు రహిత వైద్యం కింద రూ.166 కోట్ల చొప్పున మొత్తం రూ.575 కోట్లు వెచ్చించినట్లు వైద్యఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. దాన్ని ప్రాతిపదికగా తీసుకుని కొత్త ఈహెచ్‌ఎస్ కింద ఏడాదికి రూ.600 కోట్లు ఖర్చుపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గట్లుగా నిధుల సమీకరణ ఎలా చేయాలన్న దానిపై కసరత్తు చేస్తోంది.

దాదాపు 6లక్షల ఉద్యోగులు, పింఛనుదార్లు

ప్రభుత్వ గణాంకాల మేరకు ఉద్యోగులు 2,67,874 మంది, పెన్షనర్లు 2,56,556మంది, పోలీసులు 70,018 మంది కలిపి మొత్తం 5,94,448మంది ఉన్నారు. వారి కుటుంబ సభ్యులు మరో 14,18,768 మంది ఉన్నారు. కొత్త ఈహెచ్‌ఎస్‌పై ప్రభుత్వం వైద్యశాఖ నుంచే వివరాలు సేకరించింది. ఇంకా ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపలేదు. గతంలో ఉద్యోగ సంఘాలు తమ వాటా కింద 1 శాతం ఇస్తామని సర్కారుకు లేఖలు రాశాయి. కాగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, రాజస్థాన్‌లలో ఈహెచ్‌ఎస్ అమలు విధానాన్ని ప్రభుత్వం అధ్యయనం చేసింది. ఏపీలో 2016లో ఉద్యోగుల వాటా మొదలైంది. 4వ తరగతి ఉద్యోగుల నుంచి ప్రతీనెలా రూ.225, గెజిటెడ్‌ల నుంచి రూ.300 కాంట్రిబ్యూషన్ తీసుకుంటున్నారు. వైద్య సేవలపై పరిమితి లేదు. ప్రస్తుతం తెలంగాణలో నగదురహిత వైద్యం కింద ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుండగా, ఉద్యోగుల నుంచి కాంట్రిబ్యూషన్ తీసుకోవడం లేదు.

ఒక శాతం మించి ఇవ్వలేం: ఏలూరి శ్రీనివాసరావు, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు

ఉద్యోగుల మూల వేతనం నుంచి ఆరోగ్య పథకానికి ఎంత చెల్లిస్తారో, అంత మొత్తాన్ని సర్కారు తమ వంతు వాటా కింద చెల్లించాలి. మూల వేతనం నుంచి ఒక శాతం మాత్రమే చెల్లించేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు అపరిమిత, నగదురహిత వైద్య సేవలందించాలని డిమాండ్ చేస్తున్నాం. ఐకేపీ, ఆశా, అంగన్వాడీ టీచర్లు, సెర్ప్‌తో పాటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరో 3 లక్షల మంది సైతం వాటా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. వారినీ కలుపుకోని పోవాలి. కొత్త ఈహెచ్‌ఎస్ విధివిధానాలపై ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, వెంటనే అమలు చేయాలని కోరుతున్నాం.

టీజీఎండీసీ ఎండీగా భవేశ్ మిశ్రా

» గనుల శాఖ ఓఎస్‌డీగా సుశీల్‌కుమార్


భవేశ్ మిశ్రా

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సమాచార సాంకేతిక శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రాకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ పోస్టులో ఉన్న రిటైర్డ్ అధికారి బీఆర్‌వీ సుశీల్ కుమార్‌ను రిలీవ్ చేసింది. ఆయనను గనులు, భూగర్భ వనరుల శాఖ ఓఎస్‌డీగా నియమించింది.

పెళ్లింట విషాదం

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటాక ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని ఓ పెళ్లి బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 14మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. మరో 17మంది స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతులు, క్షతగాత్రులంతా రంగారెడ్డి జిల్లావాసులే.. అంతా వరుడి తరఫువారే! వధూవరులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లికి చెందిన సతీష్ కుమార్, పరిగి పట్టణానికి చెందిన మల్లీశ్వరికి నాలుగు రోజుల క్రితం పెళ్లయింది. సోమవారం రాత్రి పరిగిలో విందు జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు చందనవెల్లి నుంచి వరుడి తండ్రి రామస్వామి.. 45 మంది బంధువులతో కలిసి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకు పరిగి వెళ్లారు. అక్కడ విందు పూర్తయ్యాక అర్ధరాత్రి దాటాక 1:40 గంటలకు అంతా కలిసి అదే బస్సులో పరిగి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. రంగాపూర్ శివారులో ఈ బస్సు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న వాహనం లైట్ల వెలుతురుకు ఏమీ కనిపించకపోవడంతో రోడ్డు పక్కన సిమెంట్ బస్తాల లోడుతో నిలిపి ఉన్న లారీని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ఎడమవైపు భాగం పూర్తిగా దెబ్బతింది. బస్సులో ఉన్నవారిలో షాబాద్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన మంగలి మల్లేశ్ (35), సోలిపేట్ గ్రామానికి చెందిన మంగలి బాలమ్మ (60) చేవెళ్ల మండలం రావులపల్లి గ్రామానికి చెందిన మంగలి హేమలత (35), ఫరూక్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన సందీప్


మంగలి బాలమ్మ(ఫైల్)


హేమలత(ఫైల్)


సందీప్ (ఫైల్)


ముత్యాల మల్లేశ్ (ఫైల్)

(28) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. 31 మందికి గాయాలయ్యాయి. వధువు మల్లీశ్వరి, వరుడు సతీశ్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రేవంత్ విచారం

రంగాపూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స, తక్షణ సహాయక చర్యలు అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రమాద ఘటనపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి దామోదర విచారం వ్యక్తం చేశారు.

తల్లి మృతి.. కూతురు చావుబతుకుల్లో



మృతులంతా వరుడికి సమీపబంధువులే. మల్లేశ్ వరుడికి సొంతబావ, హేమలత చిన్నమ్మ, బాలమ్మ అమ్మమ్మ, సందీప్ మేనబావ అవుతారు. మృతురాలు హేమలత కూతురు మోక్షిత(6)కు తీవ్రగాయాలు కాగా, నిలోఫర్‌లో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన వారిలో కొందరిని వికారాబాద్‌లోని ఆస్పత్రికి, హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారికి పరిగి అస్పత్రిలోనే చికిత్స అందించి ఇంటికి పంపించి వేశారు.

ఆరో రోజూ అదే రద్దీ

» సరస్వతీ పుష్కరాలకు తరలివస్తున్న భక్తులు

» ఇతర ముఖ్య ఆలయాలకూ భక్తుల తాకిడి


నదిలో పుష్కర స్నానం చేస్తున్న భక్తులు

భూపాలపల్లి/హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నది పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆరో రోజైన మంగళవారం దాదాపు 50 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. గురువారం నుంచి భక్తుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం.. భక్తులకు ఎండ వేడి నుంచి రక్షణ కలిగించేలా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. గోదావరిలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అధికార యంత్రాంగం ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి బృందాలను, గజ ఈతగాళ్లను మోహరించింది. మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజన, ఇంటెలిజెన్స్ బ్యూరో ఐజీ తరుణ్ జోషి తదితరులు నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు కాళేశ్వరంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రఖ్యాత ఆలయాలను కూడా సందర్శిస్తున్నారు. పుష్కరాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న నవరత్నమాల హారతి ఘట్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంగళవారం నుంచి ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు.

దేశసేవకు వెళ్లి.. విగతజీవిగా ఇంటికి..

» కశ్మీర్‌లో నర్సంపేటకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ ఆత్మహత్య

» స్వగ్రామానికి భౌతికకాయం


నాగరాజు (ఫైల్)

నర్సంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): దేశసేవ కోసం సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్)లో చేరిన యువకుడు.. విగతజీవిగా ఇంటికి చేరాడు. కశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లో జవాన్‌గా పనిచేస్తున్న అతను సర్వీసు తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ సంపంగి నాగరాజు (28) 2016లో బీఎస్ఎఫ్‌లో చేరాడు. మూడేళ్లుగా కశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లో పని చేస్తున్నాడు. మూడు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం అధికారులు నాగరాజు భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో నర్సంపేట పాకాల రోడ్డులోని ఆయన నివాసానికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాగరాజు భౌతికకాయాన్ని చూసి అతని భార్య, తల్లిదండ్రులు మల్లయ్య, విజయ గుండెలవిసేలా రోదించారు. మల్లయ్య, విజయ దంపతుల ముగ్గురు కుమారుల్లో నాగరాజు చిన్నవాడు. మానసిక ఒత్తిడితో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మూడు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడితే ఆర్మీ అధికారులు వెంటనే సమాచారం ఇవ్వకపోవడంపై కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

కాటేసిన కరెంటు తీగలు!

» విద్యుదాఘాతాలకు నలుగురు రైతుల బలి

» అప్పులు తీర్చలేక ఓ రైతు ఆత్మహత్య

పిట్లం, మిరుదొడ్డి, జఫర్‌గఢ్, జగదేవ్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): పొలంలో బోరుకు మరమ్మతులు చేస్తుండగా ఇద్దరు అన్నదాతలు, పడివున్న తీగలు తగలడంతో మరో ఇద్దరు రైతులు విద్యుదాఘాతాలకు గురై మృతి చెందారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కంబాపూర్‌కు చెందిన రామయ్య (32), ఎర్ర హన్మయ్య (52)లు పొలంలో బోరు మోటారు చెడిపోవడంతో మంగళవారం మరమ్మతులు చేయడం కోసం పైపులను పైకి లేపుతున్న క్రమంలో.. పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు పైపులు తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. అలాగే, సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మోతే గ్రామానికి చెందిన రైతు మంగోరి కృష్ణహరి(60), ఇదే జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లిలో రైతు మహమ్మద్ షాదుల్(25)లు పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. కాగా, జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూరుకు చెందిన రైతు రాజిరెడ్డి (32) అప్పుల బాధతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రపంచాన్ని కకావికలు చేసిన కరోనామహమ్మారి హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి కొన్ని ఆసియా దేశాల్లో మళ్ళీ ప్రభావం చూపుతున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. ఈదేశాల్లో వందలాది కేసులు నమోదవుతున్నాయని, చైనాలో వ్యాప్తి ఉధృతంగా ఉంటూ, కేసులు వేలసంఖ్యలో ఉంటున్నాయని, ఆస్పత్రుల్లో చేరికలు కూడా హెచ్చుతున్నాయని వింటున్నాం. ఈ వేరియంట్ ప్రమాదకారి కాదని, ఆందోళన అక్కరలేదని ఆయా దేశాలు ప్రకటిస్తున్నాయి. భారతదేశంలోనూ మూడునాలుగు రాష్ట్రాల్లో కేసులు నమోదవుతూండటంతో కేంద్రప్రభుత్వం రంగంలోకి దిగి, దేశవ్యాప్తంగా 257యాక్టివ్ కేసులు మాత్రమే ఉన్నాయని, పరిస్థితి పూర్తినియంత్రణలో ఉన్నదంటూ ఒక ప్రకటన విడుదల చేసింది.

కరోనా బాగా బలహీనపడిందని, దగ్గు, జలుబుకు పరిమితమైపోయిందని, వేరియంట్లు, మ్యుటేషన్లు ఇత్యాది పదజాలానికి గతంలో మాదిరిగా వొణికిపోనక్కరలేదని నిపుణులు ధైర్యం చెబుతూనే ఉన్నారు. కానీ, ఏటా వచ్చిపోతున్నప్పుడల్లా అది కాస్తంత ఆందోళనని కలిగిస్తూనే ఉంది. ఐదేళ్ళక్రితం యావత్ ప్రపంచం స్తంభించిపోయిన దృశ్యం సులువుగా చెరిగిపోయేది కాదు. 2020మార్చి పదకొండున ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని మహమ్మారిగా ప్రకటిస్తే, అదేనెల 24న భారత ప్రభుత్వం దేశవ్యాప్త లాక్‌డౌన్ ప్రకటించి, బహుశా ప్రపంచంలోనే అత్యంత కఠినంగా దానిని అమలుచేసింది. వ్యాపారాలు స్తంభించిపోయాయి, చిన్నాచితకా చితికిపోయారు, ఎక్కడివారక్కడ ఇరుక్కుపోయారు. అంతిమంగా ఎన్ని అడ్డుగోడలు కట్టినా మహమ్మారి వ్యాప్తినీ, ప్రభావాన్ని నిలువరించలేకపోయాం. ఆ ఏడాది దాదాపు లక్షన్నర మరణాలు నమోదైనాయి. ఇక, డెల్టావేవ్ రూపంలో అత్యంత ప్రమాదకరమైన దాని రెండవ రాకడ మన ఆరోగ్యవ్యవస్థలను కుప్పకూల్చింది. ఆక్సిజన్ కోసం, ప్రాణాధారమైన మందులకోసం జనం గగ్గోలెత్తిపోయారు. ఆత్మీయుల

కరోనా మరణాల గుట్టు

ప్రాణాలు కాపాడుకోవడం కోసం ఆస్తిపాస్తులన్నీ అమ్ముకున్నారు, ప్రైవేటు ఆస్పత్రుల నిలువుదోపిడీకి గురైనారు. ఆ డెల్టావేవ్‌లో మృతుల సంఖ్య 3.32లక్షలని ప్రభుత్వం ప్రకటించింది.

కొవిడ్ మరణాలపై, అప్పటి క్షేత్రస్థాయి వాస్తవాలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దాపరికం పాటించాయన్నది కాదనలేని నిజం. భారతదేశంలో 47లక్షలమంది కరోనాతో మరణించారని మూడేళ్ళక్రితం ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొన్నప్పుడు ఆ లెక్కలను ఖండించి, ఆ సంస్థ అనుసరించిన విధానాన్ని మన ప్రభుత్వం తప్పుబట్టింది. మునుపటి సంవత్సరాలతో పోలుస్తూ, ప్రస్తుత ఏడాదిలో అదనంగా సంభవించిన మరణాల ఆధారంగా కరోనా మరణాలెన్నో చెప్పడం సరికాదనుకున్నప్పటికీ, మహమ్మారి స్థాయిని, అధికశాతం మరణాలను ఇది పట్టిస్తుందన్న మాట నిజం. కానీ, 2020 జనవరి 1నుంచి 2021 డిసెంబరు 31వరకూ 4.81లక్షలమంది మరణించినట్టు భారత ప్రభుత్వం అధికారికంగా చెబుతూంటే, ఈ నివేదికలో మరణాల సంఖ్య అంతకు పదింతలు ఉండటం, ప్రపంచవ్యాప్త కరోనా మరణాల్లో 80శాతం ఒక్క భారతదేశంలోనే చోటుచేసుకున్నాయని అనడం మనకు నచ్చలేదు. లాన్సెట్ సహా దాదాపు నాలుగు స్వతంత్ర, గ్లోబల్ స్థాయి అధ్యయనాలు ప్రభుత్వ అధికారిక లెక్కలకంటే ఏడునుంచి పదిరెట్ల కరోనా మరణాలను ప్రకటించిప్పుడల్లా ప్రభుత్వం ఖండిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో, సివిల్ రిజిస్ట్రేషన్ డేటా ఆధారంగా ఇటీవల వెలుగుచూసిన మరణాల లెక్కల్లో డెల్టావైరస్ కాలంలో 21. 5లక్షలు అదనంగా ఉన్నట్లుగా తేలడం ఆశ్చర్యం కలిగించడం లేదు. మరణాలను తక్కువగా చూపడంలో గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు తొలిస్థానాల్లో ఉన్నాయి. మహమ్మారిపై మహాయుద్ధం చేశామని చెప్పుకోవడానికి కేంద్రరాష్ట్రాలు దాచిపెట్టిన రహస్యం ఇది.

రోగవిస్తృతి, ప్రభావం ఇత్యాది అంశాల్లో దాపరికం పాటిస్తే, ఆ రోగం మీదే కాదు, భవిష్యత్తులో వచ్చిపడే ఆ తరహా మహమ్మారులమీద సైతం యుద్ధం చేయలేం. ఏ దేశమూ ఒంటరిగా ఉండలేని ఈ ఆధునిక కాలంలో సరికొత్త వాక్సీన్ల తయారీ సహా ప్రపంచస్థాయి ఉమ్మడి పోరాటం విజయవంతం కావాలంటే ప్రతి దేశమూ నిజాయితీగా వ్యవహరించాల్సిందే. ప్రమాదం లేదు, ప్రశాంతంగా ఉండండి అని సామాన్యుడికి భరోసా ఇవ్వడం అవసరమే. కానీ, పాలకులు వాస్తవాలు దాస్తున్నారని వారికి తెలిసినప్పుడు మరింత భయం కలుగుతుంది, అనుమానాలు పెరుగుతాయి.

సమతాభావం సాకారమయ్యేదెన్నడు?



▪ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్


'మీరు షెడ్యూల్డు కులానికి చెందిన వ్యక్తి అయినందుకు మిమ్మల్ని గౌరవించడం లేదు. మీరు దళితుడైనందువల్ల ఈ పదవి మీకు లభించలేదు. ప్రజాజీవనంలో ఎంతో అనుభవమున్న మీకున్న ప్రతిభ వల్లే మీకీ పదవి వచ్చింది' అని 1998లో తొలి దళిత స్పీకర్ అయిన జీఎంసి బాలయోగిని అభినందిస్తూ రిపబ్లికన్ పార్టీ వ్యవస్థాపకుడు రామకృష్ణ సూర్యభాను గవాయి లోక్‌సభలో చేసిన ప్రసంగం చరిత్రలో నిలిచిపోదగ్గది. గత వారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఆయన కుమారుడు జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) పదవికి పూర్తి అర్హుడు. తండ్రి వారసత్వంలో బౌద్ధమతస్తుడుగా కొనసాగుతున్న జస్టిస్ గవాయి జస్టిస్ కెజి బాలకృష్ణన్ తర్వాత 18 సంవత్సరాలకు సీజేఐ అయిన రెండో దళితుడు. తనకు అర్హతలు ఉన్నప్పటికీ దళితుడినైనందువల్లే ఈ పదవి దక్కిందని జస్టిస్ బీఆర్ గవాయి 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపికైనప్పుడు అంగీకరించారంటే దేశంలో దళితులకు ప్రతి 10 ఏళ్లకో, 15 ఏళ్లకో ఏదో ఒక ఉన్నత పదవి ఇచ్చి కన్నీరు తుడవడం మన దేశంలో సాధారణమయిందని అర్థం చేసుకోవచ్చు.

'భారతదేశంలో ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే కాదు, ఒకే విలువ ఉండాలి' అని బాబాసాహెబ్ అంబేడ్కర్ చేసిన వ్యాఖ్యలు ఎప్పటికైనా నిజం అవుతాయని ఆర్ఎస్ గవాయి కలలు కన్నారు. కాని ఈ మాటలు ఇప్పట్లో నిజమయ్యే అవకాశాలు లేవని ఆయన కుమారుడు జస్టిస్ గవాయికి ఆదివారం నాడు మహారాష్ట్ర బార్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం జరిగిన తీరును బట్టి అర్థమైంది. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ముంబై పోలీసు కమిషనర్ వంటి ఉన్నతాధికారులే హాజరు కాలేదు. 'మహారాష్ట్రకు చెందిన ఒక వ్యక్తి సీజేఐ వంటి ఉన్నత పదవికి ఎంపికైన తర్వాత రాష్ట్రానికి తొలిసారి వచ్చినప్పుడు ప్రోటోకాల్ ప్రకారం వారు ఈ కార్యక్రమానికి హాజరు కావాలి. నేను నాకు లభించాల్సిన గౌరవం గురించి మాట్లాడడం లేదు. ఒక రాజ్యాంగ వ్యవస్థ మరో రాజ్యాంగ వ్యవస్థకు ఇవ్వాల్సిన గౌరవం గురించి మాట్లాడుతున్నాను' అని ఆయన స్పష్టంగా చెప్పాల్సి రావడం విషాదకరం. ఇదే మహారాష్ట్రకు చెందిన జస్టిస్ డివై చంద్రచూడ్ సీజేఐ అయిన తర్వాత స్వరాష్ట్రానికి వెళ్లినప్పుడు ఇదే విధంగా ప్రోటోకాల్ ఉల్లంఘన ఎందుకు జరగలేదు?

అత్యంత సంక్లిష్టమైన సమయంలో సీజేగా బాధ్యతలు చేపడుతున్న జస్టిస్ గవాయి కేవలం ఆరు నెలలే ఈ పదవిలో ఉంటున్నప్పటికీ తనదైన ముద్ర వేసే అవకాశాలు ఉన్నాయని ఆయన అనుసరిస్తున్న వైఖరిని బట్టి స్పష్టమవుతోంది. అంబేడ్కర్ అనుయాయుడుగా ఆయనతో పాటు బౌద్ధ మతాన్ని స్వీకరించిన ఆర్ఎస్ గవాయి కుమారుడైన జస్టిస్ గవాయిపై రాజ్యాంగాన్ని, సామాజిక న్యాయాన్ని పరిరక్షించాల్సిన గురుతర బాధ్యత ఉన్నది. ఆయన ఇచ్చే ప్రతి తీర్పును విమర్శకులు ఈ దృష్టితో చూసే అవకాశాలున్నాయి. ఎన్నికల బాండ్లను రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించిన బెంచ్‌లో ఉన్న జస్టిస్ గవాయి ఎస్సీ ఎస్టీ వర్గీకరణను కూడా సమర్థించారు. మానవహక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు బెయిల్ ఇచ్చినా, మోదీపై చేసిన వ్యాఖ్యల ఆధారంగా రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించడం సరైంది కాదని చెప్పినా, మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు ఢిల్లీ మద్యం కేసులో బెయిల్ ప్రసాదించినా, నేరస్తుల ఇళ్లను వారు నేరాలు చేశారన్న కారణంగా కూలగొట్టడం 'రూల్ ఆఫ్ లా' కు వ్యతిరేకమని ప్రకటించినా జస్టిస్ గవాయి తనదైన ప్రజాస్వామిక వైఖరిని ఇప్పటికే తన తీర్పుల ద్వారా స్పష్టం చేశారు.

దేశంలో ప్రధాన న్యాయమూర్తి వంటి ఉన్నత పదవులు నిర్వహించడం అంత సులభం కాదు. ఉన్నత పదవుల్లో ఉన్న వారిని తమకు అనుకూలంగా ఉపయోగించుకోవడం కోసం రకరకాల శక్తులు ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఈ క్రమంలో గత పది సంవత్సరాల్లో జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు ఆయనకు ముందున్నవారిలో కొందరు సీజేఐలు కూడా వివాదాస్పదులయ్యారు. అయినా రాజకీయ నాయకులతో పోలిస్తే న్యాయవ్యవస్థలో వివాదాస్పదులైన వారి సంఖ్య తక్కువే. అత్యంత క్లిష్టమైన సమయంలో భారత ప్రధాన న్యాయమూర్తి అయిన తెలుగువాడు జస్టిస్ రమణ తన పదవిని కత్తిమీద సాములా నిర్వహించినా ఆయనకు లభించినంత ప్రచారం, ఆదరణ మరే సీజేఐకి లభించలేదు. జస్టిస్ రమణకు ఉన్న జనాదరణ చూసిన తర్వాత అంతటి ఆదరణ తనకు లభిస్తుందా అన్న అనుమానం తనకు కలుగుతోందని ఆయన తర్వాత సీజేఐ అయిన జస్టిస్ లలిత్... జస్టిస్ రమణ వీడ్కోలు సందర్భంగా అన్నారు. ఇటీవల జస్టిస్ రమణ పుస్తకం 'నారెటివ్స్ ఆఫ్ బెంచ్ – ఎ జడ్జి స్పీక్స్' అన్న పుస్తకాన్ని జస్టిస్ బీఆర్ గవాయి ఆవిష్కరించినప్పుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తులే కాదు, దేశవ్యాప్తంగా పలు హైకోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో జస్టిస్ రమణ తన ఆదరణను ఏ మాత్రం కోల్పోలేదని అర్థమవుతోంది.

న్యాయమూర్తులు ప్రజలకు దూరంగా ఒంటరిగా జీవించకూడదని, న్యాయవ్యవస్థ సామాన్యులకు అందుబాటులో ఉండాలని జస్టిస్ రమణ ఆశించారని, ఒకరకంగా జస్టిస్ రమణ 'ప్రజల న్యాయమూర్తి' అని జస్టిస్ బీఆర్ గవాయి ప్రశంసించారు. తాను, జస్టిస్ రమణ ఇద్దరం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చామని, కుటుంబంలో ఎవరూ న్యాయవాది కాకపోయినా తాము న్యాయవాద వృత్తి చేపట్టి అంచెలంచెలుగా పైకి ఎదిగామని ఆయన చెప్పారు. న్యాయవ్యవస్థను పటిష్ఠం చేయాలనే దీర్ఘకాలిక దృష్టితో జస్టిస్ రమణ పనిచేశారని, తాను ఆయన మార్గదర్శకత్వంలో నడుస్తానని జస్టిస్ గవాయి చెప్పడం గమనార్హం. జస్టిస్ రమణ హయాంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలకు చెందిన 9మంది న్యాయమూర్తులను నియమించారని, తొలిసారి సుప్రీంలో మూడో వంతు ప్రాతినిధ్యం మహిళలకు కల్పించారని ఆయన గుర్తు చేశారు. నిజానికి జస్టిస్ రమణ కొలీజియంలో ఉన్నప్పుడే ఇద్దరు సీనియర్లను కాదని జస్టిస్ గవాయిను సుప్రీంకోర్టుకు నియమించారు. లేకపోతే ఆయన సీజేఐ అయి ఉండేవారే కాదు. అదే విధంగా జస్టిస్ నాగరత్న వచ్చే ఏడాది భారత తొలి సీజేఐ అవుతున్నారంటే జస్టిస్ రమణ నేతృత్వంలోని కొలీజియం ఆమెను సుప్రీంకోర్టుకు ఎంపిక చేయడమే కారణం. న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కూడా ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. ఈ విషయాలను జస్టిస్ గవాయి స్వయంగా వెల్లడించారు.



'భారత దేశంలో ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే కాదు, ఒకే విలువ ఉండా'లన్న బాబాసాహెబ్ అంబేడ్కర్ మాటలు ఎప్పటికి నిజమవుతాయి? అవి ఇప్పట్లో నిజమయ్యే అవకాశాలు లేవని కొత్త భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయికి మహారాష్ట్ర బార్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం తీరును బట్టి స్పష్టమవుతోంది. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ముంబై పోలీసు కమిషనర్ వంటి ఉన్నతాధికారులే హాజరు కాలేదు!

జస్టిస్ రమణతో పాటు పలు బెంచ్‌ల్లో ఉన్న జస్టిస్ గవాయి బహుశా ఆయన సీజేఐగా అయ్యే క్రమంలో ఎదుర్కొన్న సమస్యల్ని గ్రహించే ఉంటారు. బెంచ్‌లో చేరినప్పటి నుంచీ ఉన్నత స్థానానికి వచ్చేవరకూ తానెన్నో కుట్రపూరితమైన పరీక్షలకు గురయ్యానని, తాను, తన కుటుంబం మౌనంగా ఎంతో వేదనకు గురయ్యామని జస్టిస్ రమణ స్వయంగా వెల్లడించారు. వీడ్కోలు సందర్భంగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఆయన పుస్తకంలో కూడా చోటు చేసుకున్నాయి. ఏమిటా కుట్రలు? జస్టిస్ రమణ స్వయంగా వెల్లడిస్తే కాని అవి దేశానికి తెలిసే అవకాశాలు లేవు. నిజానికి న్యాయమూర్తులు, సీజేఐలు తమ హయాంలో ఎదురైన వ్యక్తిగత అనుభవాలు, ఒత్తిళ్ల గురించి చెప్పుకున్నప్పుడే భారతదేశంలో న్యాయవ్యవస్థ ఏ మార్గంలో పయనిస్తుందో అర్థమవుతుంది.

'ప్రభుత్వ అధికారాల్ని, చర్యల్ని న్యాయవ్యవస్థ సమీక్షించాలంటే అందుకు పూర్తి స్వేచ్ఛ ఉండాలి. న్యాయవ్యవస్థను ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ చట్టసభలు, ప్రభుత్వాలు నియంత్రించలేవు. అలా జరిగితే రూల్ ఆఫ్ లా అనేది భ్రమే అవుతుంది. మనం రూల్ ఆఫ్ లాను గౌరవించే సమాజాన్ని సృష్టించాలి' అని జస్టిస్ రమణ తన పుస్తకంలోని ఒక ప్రసంగ వ్యాసంలో అన్నారు. 'న్యాయానికి అధికారంలో ఉన్నవారు కూడా లొంగి ఉండాల్సిందే' అని అరిస్టాటిల్ అన్న వ్యాఖ్యలను గుర్తు చేశారు. అసలు అలా అనాల్సిన అవసరం ఎందుకు ఏర్పడింది?

'మీ విధేయత రాజ్యాంగానికి, రూల్ ఆఫ్ లా కే కాని, ఏ వ్యక్తికీ కాదు. రాజకీయాధికారం ఉన్నవారు కాలంతో పాటు మారుతూనే ఉంటారని, కాని ఒక వ్యవస్థగా మీరు శాశ్వతంగా ఉంటారు. అందుకే ఎవరికీ లొంగకుండా, స్వతంత్రంగా వ్యవహరించాలి' ఆయన సీబీఐ అధికారుల సమావేశంలోనే చెప్పారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేయడమంటే ప్రతిపక్షాన్ని పటిష్ఠం చేయడం అని కూడా ఆయన మరో సందర్భంలో అన్నారు. కాని అలా జరుగుతోందా? జస్టిస్ రమణ పుస్తకంలో ఇలాంటి కీలక వ్యాఖ్యలు కోకొల్లలుగా ఉన్నాయి. మానవహక్కుల హననం గురించి కూడా ఆయన అనేక సందర్భాల్లో చెప్పారు. న్యాయమూర్తులు పలు సందర్భాల్లో చేసే ప్రసంగాల ద్వారా దేశంలో న్యాయవ్యవస్థ, ప్రభుత్వం నడుస్తున్న తీరుతెన్నులు స్పష్టంగా అర్థమవుతాయి. కాని ఆచరణలో మాత్రం అవి చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లే మారతాయి.

తాను పదవీవిరమణ చేసిన తర్వాత మరే పదవీ చేపట్టబోనని జస్టిస్ గవాయి స్పష్టంగా ప్రకటించారు. తనకు పదవి ఇస్తామని ఎవరూ ప్రలోభపెట్టడానికి ఆస్కారం లేకుండా ఆయన ఈ ప్రకటన చేశారు. గతంలో సీజేఐలు మానవహక్కుల చైర్మన్, గవర్నర్, రాజ్యసభ సభ్యత్వం వంటి పదవులు స్వీకరించారు. జస్టిస్ చంద్రచూడ్‌కు ఏదో ఒక అంతర్జాతీయ పదవి వచ్చే అవకాశాలు ఉన్నాయని చర్చ జరుగుతోంది. జస్టిస్ గవాయిది రాజకీయ కుటుంబం కనుక పదవీ విరమణ తర్వాత తన తండ్రి నియోజకవర్గమైన అమరావతి నుంచి పోటీ చేసే అవకాశాలు లేకపోలేదు. కాని జస్టిస్ రమణ తనకు మొదటి నుంచీ క్రియాశీలక రాజకీయాలపై ఆసక్తి ఉన్నదని, విధి తనను న్యాయవ్యవస్థ దిశగా నడిపించిందని స్పష్టంగా చెప్పారు. సీజేఐగా తనకు లభించిన వీడ్కోలుతో తన క్రియాశీల జీవితం ముగియలేదని మరో అధ్యాయం ప్రారంభం కానున్నదని ఈ పుస్తకంలో ఆయన అన్యాపదేశంగా చెప్పారు. నిరంతరం క్రియాశీలకంగా యోచించేవారు ఖాళీగా ఉండలేరు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

తల్లిభాషను శ్వాసిస్తేనే వెల్గుల జీవితం

'దేశభాషలందు తెలుగు లెస్స' అని కృష్ణదేవరాయలు చెప్పిన మాటలు మనకు ఎప్పటికీ గర్వకారణం. తెలుగు భాషకు అద్భుతమైన చరిత్ర, సంప్రదాయం, సాహిత్యం ఉన్నాయి. కానీ ఆధునిక కాలంలో ఉద్యోగాల వేటలో, విదేశాల బాటలో పరుగులు పెడుతూ మనమే మన భాషను విస్మరిస్తున్నాం. భవిష్యత్తుకు బాటలు వేసే బడి నుంచి తెలుగును నెమ్మదిగా వెలి వేశారు. ప్రైవేటు పాఠశాలల్లో మొదలైన ఈ పోకడ, రానురాను ప్రభుత్వ బడులకు కూడా పాకింది. కాన్వెంట్లలో చదివిన పిల్లలు ఆంగ్లం నేర్చుకొని, ఉన్నత విద్య పూర్తి కాగానే విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్నారన్న భావన సమాజంలో బలపడడంతో పల్లెల్లో కూడా ప్రభుత్వ బడులకు నిరాదరణ ఎదురైంది.

మాతృభాష అంటే కేవలం సంభాషణకు ఉపయోగించే భాష కాదు. అది మన భావోద్వేగాల ప్రతిబింబం, మన సంస్కృతికి మూలాధారం. తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలలో మాతృభాష పరిరక్షణకు ప్రభుత్వాలే కాకుండా ప్రజలు, ప్రజాసంఘాలు కూడా పాటుపడుతున్నాయి. తెలుగు



రాష్ట్రాల్లో మాత్రమే తల్లిభాష పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని చూస్తున్నాం. శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం, మాతృభాషలో పునాది బలంగా ఉన్న విద్యార్థులు ఇతర భాషలను సులభంగా నేర్చుకుంటారు. పైగా మాతృభాషలో విద్యాబోధన వల్ల విద్యార్థులు బాగా అర్థం చేసుకుంటారు. ఇంట్లో మాట్లాడే భాషకు, బడిలో పాఠాలు నేర్చుకునే మాధ్యమానికి పొంతన లేకపోవడం వల్ల పిల్లలపై చిన్నప్పటి నుంచే భారం పడుతున్నది.

సమాజం ఎప్పుడూ పైకి చూస్తుంది. ఉన్నత స్థానాల్లో ఉన్న వాళ్లను అనుసరిస్తుంది, అనుకరిస్తుంది. ఈ వైఖరే తెలుగును ప్రమాదపు అంచుల దాకా తీసుకుపోయింది. దాదాపు మూడు నాలుగు దశాబ్దాల క్రితం పల్లెల్లో డబ్బున్న వాళ్ల తమ పిల్లలను పక్క ఊళ్ళలోని ప్రైవేటు బడులకు పంపించడం, పట్టణాలూ నగరాల్లో పేరున్న విద్యాసంస్థల్లో చేర్పించడం మొదలయింది. అలా చదువుకున్న పిల్లలు మన దేశంలోనో పర దేశంలోనో బాగా డబ్బు సంపాదించి, సొంతూరికి వచ్చినప్పుడు మారిన జీవన శైలితో అందరి దృష్టిలో పడేవాళ్లు. అది చాపకింద నీరులా ఇంటింటికీ పాకింది. అప్పోసప్పో చేసైనా తమ పిల్లలను ప్రైవేటు బడులలో ఇంగ్లీషు మీడియం చదివించాలన్న భావన పల్లెల్లో బలపడింది.

తెలుగు భాష ప్రమాదంలో పడిందని భాషాభిమానులు గ్రహించే లోగానే పరిస్థితి దాదాపు చేతులు దాటిపోయింది. మాతృభాషలో చదువుల ఆవశ్యకతను తెలియజేస్తూ కాళ్లకు బలపాలు కట్టుకొని ఊళ్లు పట్టుకొని తిరుగుతున్న వాళ్లకు ప్రోత్సాహం లభించకపోగా, ప్రతిఘటన ఎదురయింది. వీళ్లంతా తమ పిల్లలను ఇంగ్లీషు మీడియంలో చదివించి, విదేశాలకు పంపించి, ఇప్పుడిప్పుడే బలపాలు పట్టుకున్న నిరుపేదల పిల్లలను ఎదగకుండా చేసేందుకే తెలుగుభాషా పరిరక్షణ పేరుతో వీధుల్లోకి వస్తున్నారనే వాదన తెరమీదికి వచ్చింది. తెలుగును కాపాడుకోవాలని పిలుపునిస్తున్న అధిక శాతం ప్రముఖుల పిల్లలుగానీ, వాళ్ల పిల్లలుగానీ తెలుగు మాధ్యమంలో చదవడం లేదు.

ఒక భాష మనుగడ కోల్పోతే, ఆ భాషతో పాటు ఆ సంస్కృతి, ఆ చరిత్ర కూడా అంతరించిపోతుంది. ఐక్యరాజ్యసమితి విద్యా విజ్ఞాన సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా నెలకు సగటున రెండు భాషలు అంతరించిపోతున్నాయి. తెలుగు భాషకు అలాంటి ప్రమాదం ఇప్పుడే లేదు అనుకున్నా, మన నిర్లక్ష్య ధోరణి కొనసాగితే అది సమీప భవిష్యత్తులో విపత్తుగా మారవచ్చు. ఎంట్రెన్సుల కోసం విద్యార్థులను తోమీతోమీ ఆప్షనల్ సబ్జెక్టులను బట్టీ పట్టించే ప్రైవేటు విద్యాసంస్థలు దీనికి ఒక అడ్డదారి కనుగొన్నాయి. తెలుగుకు బదులుగా సంస్కృతాన్ని ద్వితీయ భాషగా తీసుకుంటే పెద్దగా కష్టపడకుండానే నూటికి నూరు మార్కులు తెచ్చుకునే అవకాశం ఉండడంతో అందరినీ సంస్కృతం వైపు నడిపించాయి. ఇది తెలుగు భాషకు పెద్ద ప్రమాదంగా పరిణమించింది. చదువు జనం భాషలో ఉన్నపుడే చదువుకున్నవాళ్లకూ సామాన్యులకూ మధ్య వారధిగా ఉంటుందన్న విషయాన్ని గుర్తించి ప్రభుత్వాలు ప్రతి విభాగంలోనూ తెలుగును ఆచరణీయమైన భాషగా అమలు చేయాలి.

మాతృభాషా పరిరక్షణ నినాదం ప్రతి ఇంటికీ చేరాలి. ప్రతి వ్యక్తిలోనూ భాషాభిమానం నింపాలి. ప్రతి ఇంట్లోనూ తల్లిదండ్రులు పిల్లలతో తెలుగులోనే మాట్లాడేలా ప్రోత్సహించాలి. కథలు చెప్పాలి, పాటలు పాడాలి. పండగలు, పబ్బాలలో తెలుగుదనం ఉట్టిపడేలా చూడాలి. పదో తరగతి దాకా తెలుగును తప్పనిసరిగా బోధించాలి. తెలుగు మీడియాన్ని ప్రోత్సహించాలి. ఇంగ్లీష్ ప్రాముఖ్యతను కాదనకూడదు కానీ తెలుగును తక్కువ చేయకూడదు; తెలుగు భాషా దినోత్సవాలు, సాహిత్య ఉత్సవాలు నిర్వహించాలి. తెలుగు అభివృద్ధికి బడ్జెట్ కేటాయించాలి. యువ రచయితలకు ప్రోత్సాహం ఇవ్వాలి; మొబైల్ యాప్స్, వెబ్‌సైట్స్, ఆన్‌లైన్ పాఠాలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా తెలుగును సాంకేతికతలోనూ విస్తరించాలి. కృత్రిమ మేధ, అనువాద యంత్రాలు, వాయిస్ అసిస్టెంట్లకు తెలుగును మరింత అనుకూలంగా తీర్చిదిద్దాలి.

30 ఏళ్ల క్రితం తెలుగు భాషోద్యమ సమాఖ్య వాళ్లు ఉద్యమ కరదీపికగా 'తెలుగువాణి' అనే పక్షపత్రికను నిర్వహించేవారు. ఆ పత్రికలో ప్రచురితమైన ఒక వక్కపొడుల సంస్థ ప్రకటనలోని నినాదం నాకింకా గుర్తుంది. 'వక్క పలుకుల రుచి మధురం, తెలుగు పలుకులు మృదుమధురం'. 15వ శతాబ్దంలో ఎక్కడో యూరప్ నుంచి విజయనగర సామ్రాజ్యానికి వచ్చిన నికోల్ డి కంటి అనే భాషా పరిశోధకుడు తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' అని కొనియాడాడు. తెలుగు భాషలో అనేక ప్రత్యేకతలున్నాయి. వేల ఏళ్ల చరిత్ర కలిగిన మన తెలుగును కాపాడుకుందాం. భావి తరాలకు భద్రంగా అందిద్దాం.

▪ పి. వేణుగోపాల్ రెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్

నిరుద్యోగం కోరల్లో యువత

భారతదేశంలో ప్రస్తుతం నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. డిగ్రీలు పుచ్చుకున్న చాలా మంది యువతకు సరైన ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. దేశంలోని మొత్తం జనాభాలో నిరుద్యోగ రేటు 2024 ప్రారంభంలో సగటున 7.5 శాతంగా ఉంది. 15 నుంచి 29 ఏళ్ల మధ్య యువతలో ఇది 16.1 శాతంగా నమోదవడం ఆందోళన కలిగించే అంశం. 2022లో ఈ యువ నిరుద్యోగిత రేటు 23.2 శాతంగా ఉండేది. నగరాల్లో ఈ రేటు 5.1 శాతం కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది 3.4 శాతం. కానీ రాష్ట్రాల వారీగా చూస్తే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది.

విద్యా వ్యవస్థ, నైపుణ్యాల లేమి నిరుద్యోగ సమస్యను మరింత తీవ్రం చేస్తున్నాయి. దేశంలో ప్రతి సంవత్సరం 15 లక్షల మందికి పైగా విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యలో పట్టభద్రులవుతున్నా, వారిలో 80 శాతం మందికి ఆ ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు (Aspiring Minds) లేవని నివేదిక చెబుతోంది. ప్రస్తుతం కృత్రిమ మేధ (AI) కారణంగా చాలామంది ఉద్యోగాలను కోల్పోతున్నారు.

గ్రామీణ భారతంలోనూ ఈ నిరుద్యోగ సమస్య అధికంగానే ఉంది. దేశంలోని సుమారు 45 శాతం మందికి వ్యవసాయ రంగం ఉపాధిని కల్పిస్తున్నా, దేశ జీడీపీలో దాని వాటా కేవలం 16.18 శాతం మాత్రమే! ఈ నిరుద్యోగ సమస్య సామాజికంగానూ తీవ్ర ప్రభావం చూపుతోంది. నిరుద్యోగిత, నేరాల మధ్య స్పష్టమైన సంబంధం ఉంది. NCRB నివేదిక ప్రకారం నిరుద్యోగం అధికంగా ఉన్న రాష్ట్రాల్లో దోపిడీలు, దొంగతనాలు, హత్యల వంటివి అధికంగా కనిపిస్తున్నాయి. ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్న యువత మానసిక ఒత్తిడికిలోనై, అనేక చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. నేరాలకు పాల్పడుతున్నారు. ఇది దేశ భద్రతకే ముప్పుగా మారే ప్రమాదం ఉంది.

MGNREGA ద్వారా గ్రామీణులకు 100 రోజులు ఉపాధి కల్పిస్తున్నా, వారి వాస్తవ జీతం సగటున రోజుకు రూ. 220–240 మాత్రమే! స్కిల్ ఇండియా ద్వారా శిక్షణ పొందినవారి లోనూ కేవలం 15 శాతం మందికే స్థిరమైన ఉద్యోగాలు లభిస్తున్నాయి. స్టార్టప్ ఇండియా ద్వారా 70,000కు పైగా స్టార్టప్‌లు రిజిస్టర్ అయినా, నిధుల కొరత, మానిటరింగ్ లోపాల కారణంగా వాటిలో సుమారు 95 శాతం స్టార్టప్ సంస్థలు ఐదు సంవత్సరాల్లోనే మూతబడ్డాయి. .

ఈ పరిస్థితిని అధిగమించాలంటే తయారీ రంగానికి దేశం అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. MSME లకు ఆర్థిక సాయం అందించాలి. విద్యా విధానాన్ని మార్కెట్ అవసరాలకు అనుగుణంగా, ఉద్యోగాలు కల్పించేలా రూపొందించాలి. సామాజిక భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలి. యువతలో స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి. గ్రామీణ, పట్టణ వ్యత్యాసాలను తగ్గించే విధంగా సమగ్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం వ్యూహరచన చేయాలి.

– మహమ్మద్ ఉబైద్‌ఖాన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

ప్రయోగశాలగా మిగిలిన రెవెన్యూ!

'రోజులు మారాయి' (1955) సినిమాలో కరణాన్ని కలెక్టర్ నిలదీసే సన్నివేశం పేద రైతులను బాగా ఆకట్టుకునేది. కరణం వేసే ఎత్తులు జిత్తులు చూడటం కోసం తండోపతండాలుగా వెళ్లి చూసిన అనుభవం. ప్రస్తుత పరిస్థితి అంతకంటే భిన్నంగా ఏమీ లేదు.

ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టగానే 1984లో పటేల్-పట్వారి వ్యవస్థను రద్దు చేసింది. దాన్నొక విప్లవాత్మక విజయంగా భావించారు. కానీ నిజానికి అది ముందూ-వెనకా ఆలోచించకుండా తీసుకున్న నిర్ణయం. ప్రత్యామ్నాయం ఆలోచించకుండా ఆ వ్యవస్థను రద్దు చేయటం గ్రామీణ పాలనా వ్యవస్థను శూన్యంలోకి నెట్టివేసింది. తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్ఏ, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ల వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ప్రక్రియ మనకు కళ్ళ ముందే ఉంది. నాలుగు దశాబ్దాలుగా ప్రజలకు కావలసింది ఏమిటో వదిలేసి పాలకులు గ్రామ రెవెన్యూ వ్యవస్థలను తమకు నచ్చిన పద్ధతుల్లో మారుస్తున్నారు. 1957–58 నుంచి ముప్పై ఏళ్ళ పాటు రాష్ట్ర భూమి శిస్తు ఆదాయం 29.5 శాతం ఉండేది. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక దేవుడికి ఇచ్చిన భూమికి పన్ను వసూలు ఏమిటంటూ భూమి శిస్తు రద్దు చేసింది. జాతీయ ఆదాయంలో భూమి శిస్తు జమ అయ్యేది 30.5 శాతంగా ఉండేది. అది 1991 నాటికి 1.7 శాతానికి పడిపోయింది. ప్రభుత్వాలకు భూమి శిస్తుతో అవసరం తీరిపోయి ఇది రద్దు అయ్యింది.

గ్రామీణ సమాజమంతా వ్యవసాయ భూమి చుట్టూ అల్లుకుని ఉంటుంది. భూమికి గ్రామ రెవెన్యూ రికార్డులు కీలకం. భూమి బదలాయించాలంటే రిజిస్ట్రేషన్ శాఖకు వెళ్లాలి. అలాగే భూమి మీద ఏదైనా పేచీ ఉంటే న్యాయస్థానాలకు వెళ్లాలి. భూమిపై యాజమాన్యపు బాధ్యతను ప్రభుత్వం తీసుకోదు. కానీ, యాజమాన్యపు హక్కులను నమోదు చేసుకొని పట్టాదారు సమ్మతితోనే ఆ భూమికి హక్కు (టైటిల్) స్థిరీకరించి కాపలాదారుగా (కస్టోడియన్) ఉంటుంది. రెవెన్యూ చట్టాల అమలుకు భూమి హక్కుల రికార్డు కీలకమైంది. ఒక తహశీల్దారుకు జ్యుడీషియల్ అధికారి హోదా ఉంటుంది. గ్రామ రెవెన్యూ వ్యవస్థ నిర్వీర్యమైతే పాలన కుంటుపడుతుంది. చివరికి నష్టపోయేది పేద రైతులే.

1984లో కరణం, పటేల్ వ్యవస్థ రద్దయిన తర్వాత పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్ ఫోర్త్ పరీక్షలు రాసిన అభ్యర్థులను 4,800 మందిని భర్తీ చేసింది. మూడు నెలల ట్రైనింగ్ అనంతరం వీరికి ఐదు నుంచి ఆరు గ్రామాల బాధ్యతలు ఇచ్చారు. వీరంతా పనులు ప్రారంభించినప్పటికీ రికార్డుల నిర్వహణ, రెవెన్యూ పాలన అస్తవ్యస్తమయ్యింది. గ్రామానికి ఉన్న భూమి లెక్కలన్నీ తారుమారయ్యాయి. చివరికి భూ విస్తీర్ణం లెక్కలు చూపించగల జమాబందీ పనుల కోసం తొలగించిన గ్రామ కరణాల మద్దతు తీసుకోవలసి వచ్చింది.

1990లో వీఏఓ లను తీసుకున్నారు. ఇందులో గతకాలపు పటేల్ – పట్వారీలలో పదవ తరగతి పాస్ అయిన వారిని చేర్చుకున్నారు. కొంతలో కొంత వ్యవస్థ గాడిలో పడింది. ఆ కాలంలోనే 12-12-2001 తేదీన జీవో నెం.369 ద్వారా వీఏవో పేరును రద్దు చేసి పంచాయతీ కార్యదర్శిగా మార్చారు. ఎండిఓ అజమాయిషీలో వీరిని పని చేయిస్తూ అటు గ్రామ అభివృద్ధి, ఇటు రెవెన్యూ పనులు అప్పగించారు. ఇందులో మూడోవంతు పార్ట్ టైం అసిస్టెంట్స్‌గా చేరారు. ఇందులో రెవెన్యూ అనుభవం ఉన్నవారు కొందరే. మిగతా వారికి రెవెన్యూ వ్యవహారాల అనుభవం గాని, పరిజ్ఞానం గాని లేదు. ఎండిఓలు వీరి చేత గ్రామ



నాలుగు దశాబ్దాలుగా ప్రజలకు కావలసింది ఏమిటో వదిలేసి పాలకులు గ్రామ రెవెన్యూ వ్యవస్థలను తమకు నచ్చిన పద్ధతుల్లో మారుస్తున్నారు. 1984 నుంచి 2025 వరకు ఎనిమిది సార్లు భూ చట్టాలను మార్పులు, చేర్పులు చేసారు. ఏ ఆదాయ వనరులనూ సమకూర్చని భూ పాలనపై ప్రభుత్వాలకు ఆసక్తి పోయింది. దీనితో రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించి ఇష్టానుసారం భూ చట్టాలతో దాన్ని ప్రయోగశాలగా మార్చేశారు.

అభివృద్ధి పనులు చేయించుకుంటున్నారు. రెవెన్యూ పనుల్ని నిర్లక్ష్యం చేశారు. అంటే ఎమ్మార్వో, ఎండిఓ హోదాలను కలపాలని చూసారు. ఎండిఓలు తమ చేతికి రెవెన్యూ అధికారాలు వస్తాయని తెగ సంబరపడిపోయారు. భూ పరిపాలన మళ్లీ మొదటికి వచ్చింది. 2007లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం జీవో 105 ద్వారా రెవెన్యూ సెక్రెటరీ అనే కొత్త వ్యవస్థను తీసుకొచ్చింది. అప్పటికి ఉన్న విలేజ్ అసిస్టెంట్లతో పాటుగా 2,800 మందిని తీసుకున్నారు. అందులో నుంచి 1219 మందిని సూపర్ న్యూమరీ జూనియర్ అసిస్టెంట్లుగా నియమించారు. ఆ వ్యవస్థ కూడా 2019 వరకు సాగింది.

2014లో రాష్ట్రం విడిపోయాక 2020 వరకు పాత పద్ధతిలోనే వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలు నడిచాయి. కొన్ని పొరపాట్లు ఉన్నప్పటికీ వ్యవస్థలు బాగానే పనిచేశాయి. గత ప్రభుత్వం 2-11-2020లో కంప్యూటరైజ్డ్ ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ లేదా ల్యాండ్ రికార్డు అప్డేషన్ ప్రోగ్రాంగా (LRUP) అన్ని రెవెన్యూ రికార్డులను ధరణి పోర్టల్ పేరుతో చట్టంగా చేసింది. వ్యవసాయ భూములను జాయింట్ రిజిస్ట్రార్ పేరుతో రిజిస్ట్రేషన్ చేసేలా తహశీల్దారుకు అధికారమిచ్చారు. వ్యవసాయేతర భూములను సబ్ రిజిస్ట్రార్‌కు రిజిస్ట్రేషన్ చేసేలా చట్టం చేశారు. ఇప్పటివరకు ఉన్న వీఆర్వోలు అందరూ అవినీతిపరులంటూ 'ధర్మ ఘంట' పేరుతో మీడియా ముందు అవమానించి తొలగించారు. రెవెన్యూ రికార్డులు అన్నీ ధరణి చూసుకుంటుందన్నారు. 4-11-2020న 5301 మంది వీఆర్వో లను, 23,000 మంది వీఆర్ఏ లను ఇతర శాఖలోకి పంపారు. రెవెన్యూ శాఖ మూగదయింది. వీరితోపాటు ఆర్డీవో, జాయింట్ కలెక్టర్లకు అధికారాలు లేకుండా చేసి వ్యవస్థను నాశనం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఎన్నికల వాగ్దానంగా వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలను పునరుద్ధరిస్తామని చెప్పింది. ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని వాగ్దానం చేసింది. ధరణి స్థానంలో వచ్చిన భూ భారతి అనే భూమి హక్కుల చట్టంపై సవాలక్ష సందేహాలు ఉన్నప్పటికీ తెలంగాణ రైతాంగానికి అరచేతిలో స్వర్గంలా దీన్ని చూపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 3-4-2025న జీవో 129తో 10,954 మందిని గ్రామస్థాయిలో అధికారులుగా నియమించాలని నిర్ణయించింది. ఇతర శాఖలోకి బదిలీ కాబడిన వీఆర్ఓలు తిరిగి రెవెన్యూ శాఖలోకి రావడానికి వెసులుబాటు ఇచ్చింది. వీఆర్ఏల పరిస్థితి ఇంకా అనిశ్చితమే. వీరంతా తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి ఒక 'గ్రామ పాలన అధికారి' (GPA) అనే కొత్త పేరుతో కొనసాగబోతారు.

1984 నుంచి 2025 వరకు ఎనిమిది సార్లు భూ చట్టాలను మార్పులు, చేర్పులు చేసారు. ప్రభుత్వానికి ఏ ఆదాయ వనరులనూ సమకూర్చని భూ పాలనపై ప్రభుత్వాలకు ఆసక్తి పోయింది. దీనితో రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించి ఇష్టానుసారం భూ చట్టాలతో దాన్ని ప్రయోగశాలగా మార్చేశారు. ప్రభుత్వాల బాధ్యతలేనితనాన్ని అన్ని రాజకీయ పార్టీలు, హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు గుర్తించి భూమి సమస్యలపై ప్రభుత్వం చేత బాధ్యతగా పని చేయించగలిగేలా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉంది.

○ వి. బాలరాజు
రిటైర్డ్ తాసిల్దారు

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.7 కనిష్ఠం 27.1

కర్రలు.. రాడ్లతో కొట్టి
పందులపై ప్రతాపం
కడుపుతో ఉన్న పందినీ వదల్లేదు.. అడ్డుకున్న మహిళకు బెదిరింపులు.. పోలీసులకు ఫిర్యాదుతో పరార్
6


పనులను పరిశీలిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌసర్ మెహీయుద్దీన్

వర్షాలు వచ్చే లోపు పనులు కావాలి
- సీవర్ నెట్‌వర్క్ పనుల తనిఖీలో ఎండీ

హైదరాబాద్ సిటీ, మే20 (ఆంధ్రజ్యోతి): వర్షాలు వచ్చేలోపు నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టాల్సిన టన్నెల్ పనులను పూర్తి చేయాలని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి అధికారులకు ఆదేశాలిచ్చారు. కోర్ సిటీలో మురుగు నీటి వ్యవస్థ ఆధునికీకరణ కోసం చేపట్టిన జోన్-3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టు పనులను కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహీయుద్దీన్ తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. నిత్యం రద్దీ ఉండే ప్రధాన రహదారిలో పనులు చేపట్టడం అంత సులువు కాదని అంచనా వేశారు. టన్నెలింగ్ పనులు చేపట్టేటప్పుడు జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో అధికారులతో సమన్వయం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు.

పదేళ్లవుతున్నా వినియోగించరా?
షేక్‌పేట్ వాటర్‌బోర్డు కార్యాలయాన్ని ఎండీ సందర్శించారు. అక్కడ పదేళ్ల క్రితం నిర్మించిన 10 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లను ఇప్పటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని వినియోగంలోకి తీసుకుని, ఏయో ప్రాంతాల్లో నీటి సరఫరా చేయవచ్చో సర్వేచేసి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సుదర్శన్, అమరేందర్ రెడ్డి, సీజీఎంలు వినోద్ భార్గవ, రాజేందర్, జీఎంలు శ్రీను నాయక్, కుమార్, అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నకిలీ సామగ్రితో అగ్నికి ఆజ్యం


విద్యుత్ వైర్ల నుంచి ఎంసీబీల వరకు అన్నీ నకిలీవే

- గ్రేటర్ మార్కెట్‌లో 40 శాతానికి పైగానే..
- బ్రాండెడ్ కంపెనీల పేర్లతో విక్రయాలు
- నిర్మాణ రంగంలో పెద్దఎత్తున వినియోగం
- ఐఎస్ఐ ముద్రనే కాదు.. సీఎంఎల్ నంబర్లూ కాపీ
- నకిలీ ఉత్పత్తులను గుర్తించవచ్చు : బీఐఎస్



హైదరాబాద్ సిటీ, మే5 (ఆంధ్రజ్యోతి): నకిలీ విద్యుత్ పరికరాలు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ఏవి అసలైనవో గుర్తించలేనంతగా విద్యుత్ వైర్ల నుంచి ఎంసీబీల వరకు మార్కెట్లో నకిలీవి చెలామణి అవుతున్నాయి. బ్రాండెడ్ కంపెనీల పేర్లతో కూడా నకిలీ సామగ్రిని విక్రయిస్తున్నారు. అలాంటి వాటిని వినియోగించడం వల్ల ప్రమాదాలు సంభవించడమే కాదు.. తీవ్రత పెరుగుతోంది. గ్రేటర్ హైదరాబాద్ మార్కెట్‌లో దొరికే విద్యుత్ పరికరాల ఉత్పత్తులపై ఐఎస్ఐ ముద్రనే కాదు.. సర్టిఫికేషన్ మార్క్స్ లైసెన్స్ (సీఎంఎల్) నంబర్లను కూడా కాపీ చేస్తున్నారు.

క్షణాల్లో మంటలు
మహా నగరంలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలకు విద్యుదాఘాతమే ప్రధాన కారణమవుతోంది. సరఫరాలో (హోల్టేజ్) హెచ్చుతగ్గులు వస్తే వైర్లు కాలిపోతున్నాయి. చిన్న పొగతో ప్రారంభమై నిప్పురవ్వలు ఎగిసిపడుతున్నాయి. ఫాల్ సీలింగ్, కప్ బోర్డులకు, ఇతర వస్తువులకు నిప్పు అంటుకుని క్షణాల్లోనే పెద్దఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. దీంతో ఆస్తి, ప్రాణ నష్టాలు పెరుగుతున్నాయి. 2022 నుంచి ఇప్పటి వరకు జరిగిన భారీ అగ్ని ప్రమాదాల్లో రూ. కోట్లలో ఆస్తి నష్టం జరగగా, 60 మంది వరకు మరణించారు.

అగ్ని ప్రమాదాలకు ఆస్కారం
బ్రాండెడ్ కంపెనీలకు చెందిన విద్యుత్ వైర్లను బ్యూరో ఆఫ్ స్టాండర్డ్ ఇండియా(బీఎస్ఐ) నిబంధనల ప్రకారం తయారు చేస్తారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వచ్చినా అవి తట్టుకోగలుగుతాయి. బ్రాండెడ్ వైర్లలో నిప్పును తట్టుకునే మన్నికైన పదార్థం (ఫ్లేమ్ రికార్డెడ్-ఎఫ్ఆర్) ఉంటుంది. నకిలీ విద్యుత్ వైర్లలో అది ఉండదు. ప్రమాదం జరిగినప్పుడు అవి వెంటనే కాలిపోతాయని ఎలక్ట్రికల్ ఇంజనీర్లు చెబుతున్నారు. వైర్లలో ప్రమాదం తలెత్తితే ఎంసీబీలు పడిపోవాలి. సరఫరా నిలిచిపోవాలి. కానీ నాణ్యత లేని నకిలీ ఎంసీబీల వల్ల అలా జరగడం లేదని పేర్కొంటున్నారు.

నకిలీవి ఇలా గుర్తించాలి

నకిలీ సామగ్రిపై వినియోగదారులు బీఐఎస్ కేర్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. నాణ్యతను కూడా ఇదే యాప్ ద్వారా పరీక్షించుకోవచ్చు. ప్రతీ వస్తువుపై ఐఎస్ఐ మార్కుతో పాటు 7 లేదా 10 అంకెల సీఎంఎల్ (లైసెన్సు) నంబరు ఉంటుంది. యాప్‌లోని వెరిఫై ఐఎస్ఐ మార్కు వద్ద ఆ నంబర్ ఎంటర్ చేస్తే వస్తువు పూర్తి వివరాలు పొందవచ్చు. ప్రమాణాలు తెలుసుకోవచ్చు. నంబరు తప్పు అని తేలినా, వివరాలు రాకపోయినా అక్కడే ఉన్న ఫిర్యాదు ఆప్షన్ ద్వారా బీఐఎస్‌కి సమాచారం చేరవేయవచ్చు. తయారీదారుడితో పాటు నిల్వ ఉంచిన, విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
- కాంతారావు, విద్యుత్ తనిఖీశాఖ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్

అన్నీ నకిలీవే
మహా నగరంలో పెద్దఎత్తున నిర్మాణాలు జరుగుతుంటాయి. పాత నిర్మాణాలను ఆధునీకరిస్తుంటారు. అలాంటి సమయాల్లో విద్యుత్ పరికరాలను విరివిగా వినియోగిస్తుంటారు. వైర్లు, హోల్డర్లు, ప్లగ్గులు, స్విచ్‌లు, ఎంసీబీలు తదితర విద్యుత్ సామగ్రిని ఉత్పత్తి చేసే పేరుగాంచిన కంపెనీలు నగరంలో ఉన్నాయి. ఇదే అదునుగా బ్రాండెడ్‌ను పోలిన పరికరాలను నగరంలో ఉత్పత్తి చేస్తున్నారు. బాక్స్‌పై ఐఏఎస్ ముద్రలతో పాటు సీఎంఎల్ నంబర్ కూడా ఉంటాయి. చాలా వాటికి వాటిని కూడా నకిలీవి సృష్టిస్తున్నారు. రాణిగంజ్, జనరల్ బజార్, ట్రూప్‌బజార్, బాలానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సామగ్రిని ఎక్కువగా విక్రయిస్తున్నారు. సామగ్రిలో 40 శాతం వరకు నకిలీవి వచ్చేశాయని వ్యాపారులే చెబుతుండడం గమనార్హం.

30 ఏళ్ల క్రితం నాటి వైరింగ్‌తో..
నగరంలోని అనే భవనాల్లో ఇష్టానుసారంగా వైరింగ్‌తో కరెంటు వాడేస్తున్నారు. చార్మినార్, గుల్జార్‌హౌజ్,
మిగతా 6వ పేజీలో..


ఘటనా స్థలం వద్ద అధికారులు

చెక్కబోర్డుపై మీటర్లు.. ప్రమాదానికి అదే కారణమా?
- గుల్జార్‌హౌజ్ ఘటనపై విచారణ
- ఘటన జరిగిన భవనంలో 14 ఏసీలు
- సామర్థ్యానికి మించి విద్యుత్‌లోడ్

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): చార్మినార్ గుల్జార్‌హౌజ్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలంటుకున్నాయని ఫైర్ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో విద్యుత్‌శాఖ విచారణ చేస్తోంది. ప్రమాదం జరిగిన భవనంలో చెక్కబోర్డుపై విద్యుత్ మీటర్లు ఉన్నాయని, రాత్రంతా 14 ఏసీలు నడుస్తుండటంతో ఓవర్‌లోడ్ కారణంగా ఆదివారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ జరిగి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏసీలు ఓవర్‌హీట్ కారణంగా కంప్రెషర్ పేలి మంటలు వ్యాపించే అవకాశాలు లేకపోలేదని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. భవనంలోకి ఎవరినీ అనుమతించక పోవడంతో విద్యుత్ శాఖ, సీఈఐజీ అధికారులు మంగళవారం సాయంత్రం వరకు లోపలకు వెళ్లలేకపోయారని ఓ అధికారి తెలిపారు. లోపలకు వెళ్లి వైరింగ్, మీటర్లు, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు
మిగతా 6వ పేజీలో..

అగ్గిరాజుకున్నప్పుడే హడావిడి
- నివేదికలు చెప్పరు.. లోగుట్టు విప్పరు
- సమన్వయ లోపంతో కమిటీలకే పరిమితం
- నెలల తరబడి విచారణ..
- గుట్టుచప్పుడు కాకుండా చార్జిషీట్లు దాఖలు
- భగ్గుమంటున్న బాధితుల కుటుంబాలు

6



అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి
- ఎంపీలు ఈటల, కొండా
- మృతులకు నివాళి

6

మన ఇల్లు భద్రమేనా!
- గుల్జార్‌హౌజ్ ఘటనతో స్థానికుల అప్రమత్తం
- ఏళ్ల క్రితం నిర్మితమైన గృహాలపై సమీక్ష
- ఇంటి ప్రవేశద్వారాల పొడిగింపుపై యజమానుల ఆలోచన

6

మహిళా ప్రయాణికుల భద్రతకు పెద్దపీట
- అరోమా సింగ్ ఠాకూర్
- చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను సందర్శించిన ఆర్‌పీఎఫ్ ఐజీ

కుషాయిగూడ, మే 20 (ఆంధ్రజ్యోతి) : మహిళా ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం ఆమె ఆర్‌పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేవస్మిత సి.బెనర్జీతో కలిసి చర్లపల్లి రైల్వే శాటిలైట్ టర్మినల్‌ను సందర్శించారు. టర్మినల్‌లో చేపట్టిన భద్రతా పరమైన అంశాలను పరిశీలించారు. చర్లపల్లి ఆర్‌పీఎఫ్ అవుట్-పోస్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్న అధికార సిబ్బందితో ఆమె 'సురక్షా సమ్మేళన్'కు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఆన్‌లైన్ గేమింగ్ వల్ల తలెత్తే ముప్పు, విధి నిర్వహణలో ఉన్న సమయంలో మొబైల్ ఫోన్‌ల వాడకం తగ్గింపు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర నిఘా, వృత్తి పట్ల నిబద్ధత వంటి సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఏర్పాటు చేసిన దాదాపు 250 సీసీ టీవీ కెమెరాలను నియంత్రించే ప్రత్యేక గదిని ఆమె ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైల్వే బోర్డు ద్వారా జరిగే నియామకాలతో అన్ని ప్రధాన స్టేషన్లలో సిబ్బంది సంఖ్యను పెంచనున్నామని, అప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 2,700మంది హోంగార్డులను రైల్వే భద్రతకు వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు. ఇన్‌స్పెక్టర్ రాకేష్ మీనా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


టర్మినల్‌ను పరిశీలిస్తున్న ఆర్‌పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ ఠాకూర్

సీఎం ప్రజావాణికి 263 దరఖాస్తులు
బేగంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 263 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి సంబంధించి 54 దరఖాస్తులు, రెవెన్యూకు 45, మున్సిపల్‌కు 15, విద్యుత్‌కు 18, ఇందిరమ్మ ఇండ్ల కోసం 81, ఇతర శాఖలకు 50 దరఖాస్తులు వచ్చినట్లు ప్రజావాణి అధికారి తెలిపారు.


సీ.ఎం ప్రజావాణిలో గల్ఫ్ సమస్యను వివరిస్తున్న ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు వినోద్‌కుమార్, మంద భీంరెడ్డిలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎన్‌ఓసీ రాగానే పనులు ప్రారంభిస్తాం
'మహా' లేఅవుట్‌పై స్పందించిన హెచ్ఎండీఏ



హైదరాబాద్ సిటీ, మే20 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్, ఎంఆర్‌డీసీఎల్ అధికారుల నుంచి ఎన్ఓసీ రాగానే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతాపసింగారంలోని లేఅవుట్ అభివృద్ధి పనులను చేపడతామని హెచ్ఎండీఏ అధికారులు ప్రకటించారు. 'మహా లేఅవుట్‌కు మోకాలడ్డు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. లే అవుట్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇరిగేషన్, రెవెన్యూ, ఎంఆర్‌డీసీఎల్ అధికారులతో సంయుక్తంగా ఇప్పటికి రెండు సార్లు తనిఖీలు చేశామని అన్నారు. పంట కాల్వలను తొలగించేందుకు ఇరిగేషన్ శాఖ, ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ఎన్ఓసీ జారీ చేయాల్సి ఉందని వెల్లడించారు. క్లియరెన్స్ వచ్చిన వెంటనే లేఅవుట్ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.


సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

రుణాల పేరుతో 'రియల్' మోసం
- ముఠా ఆటకట్టించిన సీసీఎస్ పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు

హైదరాబాద్ సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): ఆస్తులు తనాఖా పెట్టించి బ్యాంకు రుణాలు ఇప్పిస్తామంటూ నవ్వించి మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. సీసీఎస్ డీసీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన జబ్బర్‌ఖాన్ మున్నీఖాన్, ఖురేషీ జావెద్ హబీబ్సాబ్, సద్దాం హబీబ్ సాబ్ ఖురేషీ కొన్నాళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బేగంపేట ప్రకాష్‌నగర్‌లో స్థిరపడ్డారు. వివిధ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమాజిగూడలో జేకే ఎంటర్‌ప్రైజెస్ (ఫైనాన్స్ సొల్యూషన్స్) పేరుతో రియల్ ఎస్టేట్ బ్రోకరేజ్ వ్యాపారాన్ని ప్రారంభించారు. ముగ్గురూ ఒక ముఠాగా ఏర్పడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పరిచయాలు పెంచుకొని, వారి ద్వారా మార్టిగేజ్ రుణాలు ఇప్పిస్తామని స్థానికులను, తెలిసిన వారిని నమ్మించేవారు. రుణాల కోసం వచ్చిన వారి నుంచి స్థలం పత్రాలు, ఇతర ఐడీ ప్రూఫ్‌లు తీసుకునే వారు. వారికి అవసరమైన రుణం ఇచ్చేందుకు సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని నమ్మించేవారని డీసీపీ తెలిపారు. తర్వాత డబ్బులు, చెక్కులు తీసుకునే వారు. కస్టమర్ల బ్యాంకు ఖాతాలో డబ్బు అయిన వెంటనే చెక్కుల ద్వారా ఆ డబ్బును కాజేస్తున్నారు. ఇలా పలువురిని మోసం చేసిన ఈ ముఠాను ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షణలో అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ డీసీపీ శ్వేత తెలిపారు.

కాసులిస్తే ఎక్కువ నీళ్లు!
కొన్ని ప్రాంతాల్లో లైన్‌మన్ల బేరసారాలు



- డబ్బులిచ్చే ప్రాంతాలకు అధిక సరఫరా
- ఇవ్వకుంటే లోప్రెషర్‌గా వస్తున్న నీళ్లు
- ప్రలోభాలకు గురి చేస్తున్న హాస్టల్స్, హోటల్స్ యజమానులు
- ప్రతీ నెలా మామూళ్లు
- మోటర్లపై జరిమానాలతో పాటు.. సిబ్బంది చేతివాటాన్ని కట్టడి చేస్తే మెరుగైన ఫలితాలు

హైదరాబాద్ సిటీ, మే20 (ఆంధ్రజ్యోతి):



నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక లైన్‌మన్లు వాటర్‌బోర్డు నీటితో దందా సాగిస్తున్నారు. 2600 మిలియన్ లీటర్ల నీటిని రోజూ నగరానికి తీసుకొచ్చి కొన్ని ప్రాంతాలకు ఓ రోజు, మరికొన్ని ప్రాంతాలకు మరో రోజు వాటర్‌బోర్డు ఉన్నతాధికారులు సర్దుబాటు చేస్తున్నారు. అయినా 5వేల నుంచి 6వేల వరకు ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో వాటర్‌బోర్డు లైన్‌మన్లు నీటిని సమయానుసారంగా నిర్ణీత వ్యవధిలో సరఫరా చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

- హఫీజ్‌పేటలోని ఓ కాలనీలోని వీధికి పది రోజులుగా నీళ్లు లోప్రెషర్‌తో వస్తున్నాయి. మేనేజర్‌తో పాటు లైన్‌మన్‌కు స్థానికులు ఈ విషయం తెలిపారు. పురాతన పైపులైన్లు మార్చాలని సూచించారు. అవి మార్చినా సమస్య పరిష్కారం కాలేదు. పదే పదే లైన్‌మన్‌ను లోప్రెషర్ గురించి అడగగా, 'ఈ వీధిలో ఉండే వారంతా కలిసి నెలకు రూ.15వేలు ఇస్తే ఎక్కువ నీళ్లు వదులుతా. పక్క కాలనీలోని ఓ వీధివారు రూ.20వేలు ఇస్తున్నారు. తర్వాత మీ ఇష్టం' అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఎస్ఆర్‌నగర్‌లో నాలుగు కుటుంబాలు ఉండే ఓ ఇంటికి కూడా నీళ్లు లోప్రెషర్‌తో వస్తున్నాయి. దీనిపై యజమాని స్థానిక లైన్‌మన్‌ను అడిగితే వేసవి అయిపోయే వరకు నెలకు రూ.6వేలు ఇస్తే నీళ్లకు ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తానని చెప్పాడట. ఆ డబ్బు ఇవ్వాలని ఇంటి యజమాని అద్దెదారులు అందరినీ అడగడంతో వారు విస్తుపోయిన పరిస్థితి ఏర్పడింది.

క్షేత్రస్థాయిల్లో వారిదే హవా
నగరంలో నీటి సరఫరాలో క్షేత్రస్థాయిలో లైన్‌మన్లదే గుత్తాధిపత్యం. ఏయే ప్రాంతాలకు ఏ సమయంలో ఎంత సమయం నీటి సరఫరా చేయాలని, వాటర్‌బోర్డు మేనేజర్ల వద్ద కేవలం ప్రణాళిక మాత్రమే ఉంటుంది. కానీ అమలు ప్రక్రియ లైన్‌మన్లపైనే ఆధారపడి ఉన్నది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పలు ప్రాంతాలకు లోప్రెషర్ సమస్యలు, నీళ్లు రాకపోవడం లాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. నెలలో ఒకటి, రెండు సార్లు అలా ఇతర ప్రాంతాల నుంచి డిస్ట్రిబ్యూషన్ రిజర్వాయర్లకు నీళ్లు రాకపోవడం, షడౌన్ లాంటి పరిస్థితులు ఎదురైతే ఆయా ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదు. కానీ షడౌన్ లాంటి పరిస్థితులు లేకపోయినా నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి.

డబ్బుల పంపకాలు..
కొందరు లైన్‌మన్లు డబ్బులు ప్రతీ నెలా వచ్చే ప్రాంతాలకు అధికంగా నీటి సరఫరా చేస్తున్నారు. ఇవ్వని ప్రాంతాలకు అరకొరగా సరఫరా చేస్తున్నారు. హాస్టల్స్, హోటల్స్ యజమానులు, వాణిజ్య సముదాయాలకు చెందినవారే లైన్‌మన్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. లైన్‌మన్లలో కొందరు వాటర్‌బోర్డు పర్మినెంట్ ఉద్యోగులు ఉండగా, అత్యధికంగా ఔట్‌సోర్సింగ్‌పై పని చేస్తున్న వారే. వారికి ప్రతీ నెలా వచ్చే వేతనం రూ.13వేలు కూడా ఉండదు. ఈ పరిస్థితుల్లో కొందరు లైన్‌మన్లు ప్రలోభాలకు గురవ్వక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. హాస్టల్స్, హోటల్స్, ఇతర వాణిజ్య సముదాయాల నుంచి నీటి బిల్లులు గాకుండా అదనంగా వచ్చే ఆదాయాన్ని కింది స్థాయి నుంచి డివిజన్లలో పై స్థాయి వరకు పంపకాలు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోటర్లపై డ్రైవ్‌లు చేస్తూ వినియోగదారులకు జరిమానాలు వేస్తున్న అధికారులు బోర్డులోని సిబ్బంది చేతివాటాన్ని కూడా కట్టడి చేసి నీటి సరఫరా మెరుగుపడేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గంజాయి విక్రేత..
250 కేసుల్లో నిందితుడు
- అతడి సహా ఐదుగురి అరెస్ట్


నిందితుల(కూర్చున్నవారు)తో పోలీసులు

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలతో 250 కేసుల్లో నిందితుడిగా ఉన్న ఘరానా నేరగాడితో పాటు నలుగురిని సీసీఎస్, ఆబిడ్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫలక్‌నుమాకు చెందిన సయ్యద్ సయీద్ హుస్సేన్ అలియాస్ లంబా పాత నేరస్థుడు. ఇతడిపై మూడు కమిషనరేట్ల పరిధిలో స్నాచింగ్, దోపిడీ, దొంగతనం, దాడి, హత్యాయత్నం వంటి 250 కేసులు నమోదయ్యాయి. సైఫాబాద్ పోలీసులు పీడీయాక్ట్‌ను కూడా ప్రయోగించారు. అధిక సంపాదన కోసం సయ్యద్ సయీద్ అలియాస్ లంబా గంజాయి విక్రయాలు చేస్తున్నాడు. ఇతడికి ఫలక్‌నుమాకు చెందిన అమీర్ ఖాన్ (31), ఫరూక్‌ఖాన్ (27), మహ్మద్ గౌస్ (40), ఆజం ఖాన్(27) సహకరిస్తున్నారు. వీరి దందాపై పక్కా సమాచారం అందుకున్న సీసీఎస్, ఆబిడ్స్ పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 21 కిలోల గంజాయి, 5 సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు.

అంతర్జాతీయ కార్మిక సదస్సుకు సుంకరి మల్లేశం ఎంపిక



దుండిగల్, మే 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మిక సదస్సుకు భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు, పీఈఎఫ్ఓ సెంట్రల్ బోర్డు సభ్యుడు సుంకరి మల్లేశంను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈనెల 31 నుంచి జూన్ 15వ తేదీ వరకు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరిగే 113వ అంతర్జాతీయ కార్మిక సదస్సులో మల్లేశం పాల్గొంటారు.



మాట్లాడుతున్న రచన

లింగమార్పిడికి ప్రత్యేక ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

● ట్రాన్స్‌జెండర్ల డిమాండ్

రాంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): లింగమార్పిడికి రాష్ట్రంలో ప్రత్యేక ఆస్పత్రి ఏర్పాటు చేయాలని పలువురు ట్రాన్స్‌జెండర్లు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ట్రాన్స్‌జెండర్ల సమావేశం జరిగింది. ట్రాన్స్‌జెండర్లు రచన, అయుష్య, స్వేచ్ఛ, అహ్మాద్, మాంగల్య తదితరులు మాట్లాడారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన నల్సా కేసును గౌరవిస్తూ లింగమార్పిడి ఆపరేషన్లకు ప్రభుత్వ ఆస్పత్రులలో వసతులు కల్పించాలన్నారు. వివక్ష చూపొద్దని, సాధారణ ప్రజలకు ఉన్న హక్కులను కల్పించాలని కోరారు. తమను యాచించొద్దని పోలీసులు అనడం తగదన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లకు సామూహిక ఇళ్లు, శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలన్నారు. లింగమార్పిడి సేవలు ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ట్రాన్స్‌జెండర్లు, హిజ్రాలు పాల్గొన్నారు.

మన ఇల్లు భద్రమేనా..!

● గుల్జార్‌హౌజ్ ఘటనతో స్థానికుల అప్రమత్తం
● ఏళ్ల క్రితం నిర్మించిన గృహాలపై సమీక్ష
● ఇంటి ప్రవేశద్వారాల పొడిగింపుపై యజమానుల ఆలోచన

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని చరిత్రలో పెను విషాదాన్ని నింపిన గుల్జార్‌హౌజ్ ఘటనతో స్థానికులు అప్రమత్తమయ్యారు. అగ్ని ప్రమాదం ఘటనలో 17మంది మృతిచెందడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఘటన నేపథ్యంలో ఏళ్ల క్రితం నిర్మించిన తమ ఇళ్లు భద్రంగా ఉన్నాయా.. విద్యుత్ తీగల పరిస్థితి ఏమిటనే అంశాలపై దృష్టి సారిస్తున్నారు. మరోవైపు జీహెచ్ఎంసీ అధికారులు శిథిలావస్థకు చేరిన, ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన భవనాలను గుర్తించే పనిలో పడ్డారు. ఊహించకుండా జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని గుల్జార్‌హౌజ్‌లోని ఇతర వ్యాపారులు, గృహవాసులు తమ నిర్మాణాల భద్రతపై సమీక్షించుకుంటున్నారు. తాత, ముత్తాతల కాలంలో నిర్మించిన ఇళ్లు సురక్షితంగా ఉన్నాయా.. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో రక్షణకు ఎలాంటి ఏర్పాట్లు చేసుకోవాలని ఆలోచిస్తున్నారు. ఇంటి ప్రవేశద్వారాల పొడిగింపును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ తీగలను సరిచేసుకుంటున్న వ్యాపారులు

చార్మినార్ సమీపంలో షాపులతోపాటు ఇళ్లలో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలే ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో కొందరు నాసిరకం కరెంట్ వైర్లు ఏర్పాటు చేసుకున్న పరిస్థితి ఉంది. గుల్జార్‌హౌజ్‌లో జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో దుకాణదారులు, ఇళ్ల యజమానులు విద్యుత్ తీగలపై ప్రత్యేక దృష్టి సారించారు. రెండు రోజులుగా తెగి ప్లాస్టర్లు అంటించిన వైర్లు, లూజ్ కనెక్షన్లను సరిచేసుకుంటున్నారు. షార్ట్ సర్క్యూట్ జరిగితే వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయే విధంగా మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్(ఎంసీబీ)లను ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో తమ దుకాణంలో ఎంసీబీ లేదని, ఇటీవల జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని ఎంసీబీ ఏర్పాటు చేసుకున్నట్లు లాడ్‌బజార్‌కు చెందిన ఓ ముత్యాల వ్యాపారి తెలిపారు.

పురాతన భవనాల గుర్తింపులో అధికారులు

చార్మినార్, గుల్జార్‌హౌజ్, లాడ్‌బజార్, మక్కామసీదు, శాలిబండ, షంషేర్‌గంజ్, మదీనా, ఇంజన్‌బౌలి తదితర ప్రాంతాల్లో వేలాది దుకాణాలు, ఇళ్లు ఉన్నాయి. ఇందులో సగానికి పైగా దాదాపు వందేళ్ల క్రితం నిర్మించినవే. ఇరుకు గల్లీల్లో ఉండే దుకాణాలు, సరైన ప్రవేశద్వారాలు లేని ఇళ్లను స్థానిక జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించే పనిలో పడ్డారు. శిథిలావస్థకు చేరిన నిర్మాణాలకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, రాజేంద్రనగర్ సర్కిల్‌లో పురాతన భవనాలను, శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణాలను గుర్తించి యజమానులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను మంగళవారం ఆదేశించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పురాతన భవనాలను గుర్తించాలని, యజమానులు స్పందించకపోతే ఏళ్ల క్రితం నాటి భవనాలను తొలగించాలని సూచించారు.

నకిలీ సామగ్రితో అగ్నికి ఆజ్యం

(5వ పేజీ తరువాయి)

బేగంబజార్, సికింద్రాబాద్, అఫ్జల్‌గంజ్‌తోపాటు గ్రేటర్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లలో అప్పటి వైరింగ్‌తోనే కరెంట్ వినియోగిస్తున్నారు. అది కూడా షార్ట్‌సర్క్యూట్‌కు కారణం అవుతోందని నిపుణులు చెబుతున్నారు. కొంతమంది తమ ఇళ్లలో 2.5 స్క్వేర్ ఎంఎం వైర్లతో ఏసీలు వినియోగిస్తున్నారని ఓ ఎలక్ట్రీషియన్ తెలిపారు. పాత వైరింగ్‌తో ప్రస్తుతం రెట్టింపుస్థాయిలో కరెంటు వినియోగిస్తుండటం వల్ల కరెంట్ తీగలపై అధిక లోడ్ పడుతోంది. ఇది కూడా ప్రమాదాలకు కారణమవుతుందని సీనియర్ రిటైర్డ్ ఇంజనీర్లు చెబుతున్నారు. పాత విద్యుత్ తీగల వల్లే ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటున్నారు.

విద్యుత్‌రంగ నిపుణుల సూచనలు

- ఐఎస్ఐ, బీఐఎస్ మార్క్ కలిగిన కరెంట్ తీగలు, స్విచ్ బాక్సులు మాత్రమే వినియోగించుకోవాలి.
- 10 యాంప్స్ విద్యుత్‌వాడే చోట 20 యాంప్స్ భారం పడితే తీగలు కాలిపోయే ప్రమాదాలుంటాయి.
- విద్యుత్ ఓవర్‌లోడ్ ప్రమాదం నుంచి రక్షించుకోవడానికి ఎంసీబీ, ఆర్‌సీసీబి (మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్, రెసిడ్యువల్ కరెంట్ సర్క్యూట్ బ్రేకర్)లు ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతీ సర్క్యూట్‌కు 30 మిల్లీయాంప్స్ కలిగిన ఎంసీబీ, ఆర్‌సీసీబీలు ఏర్పాటు చేసుకోవాలి
- ప్రతీ భవనంలో సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండాకాలంలో రక్షణ పరికరాలు సరిగా పనిచేయాలంటే ఎర్తింగ్ తప్పనిసరి. ఎర్తింగ్‌కు నీరు, దొడ్డు ఉప్పు ఉపయోగించాలి.

తీగల సాధారణ లైఫ్ 15 ఏళ్లు

విద్యుత్ తీగల సాధారణ జీవిత కాలం 15 ఏళ్లు. ఆ తర్వాత కూడా అవి పనిచేసే స్థాయి. కానీ లైసెన్స్ పొందిన ఎలక్ట్రీషియన్లతో వాటి సామర్థ్యం చెక్ చేయించాలి. ఇళ్లు, ఆఫీసుల్లో విద్యుత్ తీగలను వాడిన తర్వాత మరోసారి ఇన్సలేషన్ మెగ్గర్‌తో టెస్టింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి. నగరంలో పాత భవనాల్లో చాలా వరకు ఎర్తింగ్ లేదు. ఎర్తింగ్ తప్పనిసరిగా ఉండాలి.

- రాజు, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్

17 మంది మృతి బాధాకరం

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్



కమిషన్ సభ్యులతో కలిసి పరిశీలిస్తున్న కె.సీతా దయాకర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ/చార్మినార్, మే 20 (ఆంధ్రజ్యోతి): గుల్జార్‌హౌజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 17 మంది చనిపోవడం బాధాకరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కె.సీతా దయాకర్ రెడ్డి అన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కమిషన్ సభ్యులతో కలిసి ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విషాదంలో అమాయక పిల్లలను కోల్పోవడం హృదయ విదారకరమని అన్నారు. చనిపోయిన వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు కౌచర్ల వందనగౌడ్, మారిపల్లి చందన, బి.అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, బి.వచన్‌కుమార్, డీసీపీవో శ్రీనివాస్ ఉన్నారు.



అధికారికి రివార్డు అందజేస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు వన్నె తేవాలి

డైరెక్టర్ షానవాజ్ ఖాసీం

ప్రతిభ కనబరిచిన 30 మంది అధికారులకు రివార్డులు

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు వన్నె తేవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అన్నారు. ఇటీవల నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది అధికారులకు మంగళవారం నగదు రివార్డులు అందజేశారు. నాంపల్లిలోని ఆబ్కారీ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖను బలోపేతం చేసి, అక్రమార్కుల భరతం పట్టడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి పాల్గొన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ షానవాజ్ ఖాసీంను వివిధ జిల్లాల నుంచి వచ్చిన డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్‌లు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు

అఫ్జల్‌గంజ్, మే 20 (ఆంధ్రజ్యోతి): చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. బత్తిని గౌరీశంకర్‌ను మంగళవారం కలిసి చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లపై చర్చించారు. చేప ప్రసాదం కోసం రాష్ట్రం, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటామని సాయికుమార్ తెలిపారు.

64 ఏళ్ల వయస్సులో పీహెచ్‌డీ



సంగారెడ్డి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ఖాన్ జమల్‌పూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల నర్సింలు బాబు 64 ఏళ్ల వయస్సులో పీహెచ్‌డీ సాధించారు. ఈ మేరకు ఉస్మానియా వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని మిషన్ భగీరథ శాఖ ప్రధాన కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా(జీయాలజీ) ఆరేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేసిన ఎర్రోళ్ల నర్సింలుబాబు భూగర్భ శాస్త్ర ప్రొఫెసర్ జి.ప్రభాకర్ పర్యవేక్షణలో 'వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలోని గంగకత్వ ప్రవాహ బేసిన్‌లో ఒకేలాంటి జల, వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్న లాటరైట్, బసాల్ట్, గ్రానైట్ రాతి నిర్మాణాలపై మైనర్ ఇరిగేషన్ చెరువుల సామర్థ్యాన్ని అంచనా వేయడం' అనే అంశంపై పరిశోధన చేశారు.

58.88 కిలోల గంజాయి పట్టివేత

● బీదర్ ముఠా సభ్యులు ఐదుగురి అరెస్ట్
● పరారీలో మరో ఇద్దరు

ఘట్‌కేసర్ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా చేస్తున్న బీదర్ ముఠాను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 58.88 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి డివిజన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం, గణపతి జిల్లాకు చెందిన సుమన్ జన్ని వద్ద కిలో గంజాయి రూ. 1,900కు కొనుగోలు చేసి పుణెకు చెందిన అభిషేక్‌కు కిలో గంజాయి రూ.5 వేలకు విక్రయించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఒడిశా నుంచి పుణెకు ముఠా సభ్యులు ఐదుగురు గంజాయి రవాణా చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ నంబర్ 9వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ కారును తనిఖీ చేయగా అందులో 29 బండిల్స్‌లో 58.88 కిలోల ఎండు గంజాయి లభించింది. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితులను కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లా శంషేర్‌పూర్‌వాడికి చెందిన గోవింద్ తప్సలే, గజానంద్, పవన్, అకాష్, అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తారోత్ రాహుల్‌గా గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.23,55,200 ఉంటుందని తెలిపారు. నిందితుల నుంచి గంజాయితోపాటు కారు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జన్ని, అభిషేక్ పరారీలో ఉన్నారని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

చెక్కబోర్డుపై మీటర్లు.. ప్రమాదానికి అదే కారణమా?

(5వ పేజీ తరువాయి)

పరిశీలిస్తే నిప్పు రవ్వలు ఎక్కడ నుంచి వచ్చాయో తెలియదన్నారు.

సేఫ్టీలెస్ భవనాలు

గుల్జార్‌హౌజ్‌లో వందల సంఖ్యలో కమర్షియల్ భవనాలు ఉన్నాయి. వాటిలో సేఫ్టీ పరికరాలు లేకుండానే వ్యాపారాలు కొనసాగుతున్నాయి. భవనాల్లో చాలావరకు కింద భాగంలో షాపులు నిర్వహిస్తుండగా, పై అంతస్తుల్లో నివాసాలు ఉన్నాయి. భవనాల్లో షాపులు నిర్వహిస్తున్న నేపథ్యంలో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఒకే మార్గం ఏర్పాటు చేస్తారు. రాత్రిళ్లు తాళం వేయడంతో లోపల నుంచి ఒక్కరు కూడా బయటకు వచ్చే పరిస్థితులుండవు.

ప్రకాశం పంతులుకు నివాళి



మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా మంగళవారం అసెంబ్లీ వద్ద టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు రుద్రరాజు, మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి వేణుగోపాలచారి, హనుమంతరావు, తదితరులు
- గన్‌పార్క్, మే 20(ఆంధ్రజ్యోతి)

జీవన ఎరువుల తయారీపై శిక్షణ

రాజేంద్రనగర్, మే 20(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో జీవన ఎరువుల ప్రాముఖ్యత, రైతులకు కలిగే లాభాలు, జీవన ఎరువుల తయారీ, ఎరువుల వ్యాపారం నైపుణ్యం, వ్యాపార ప్రారంభం తదితర అంశాలపై సూచనలు ఇస్తూ విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం ఉద్యోగానికే పరిమితం కాకుండా, స్వయం ఉపాధి అవకాశాలను అన్వేషిస్తూ వ్యవసాయ రంగంలో కొత్త వ్యాపార ఆలోచనలు ప్రారంభించడం ద్వారా తమకే కాకుండా ఇతరులకు కూడా ఉపాధి కల్పించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.త్రివేణి, డాక్టర్ సంతోషి లావణ్య, డాక్టర్ డి. శ్రీదేవి, కె. సి దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

'పురాతన భవనాలను గుర్తించండి'

రాజేంద్రనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్‌లో పురాతన భవనాలను, శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణాలను గుర్తించి వారికి నోటీసులు అందజేయాలని డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను కోరారు. మంగళవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పురాతన భవనాలను గుర్తించి వారికి నోటీసులు అందజేయాలన్నారు. అయినా వారు స్పందించకపోతే మున్సిపల్ సిబ్బంది పురాతన భవనాలను తొలగించాలని సూచించారు.

'నాలాలో చెత్తాచెదారం తొలగించాలి'

గోషామహల్, మే 20(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలం నేపథ్యంలో ఉస్మాన్‌గంజ్ నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను వెంటనే తొలగించి వర్షపు నీరు సులువుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రాజాసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జాంబాగ్ డివిజన్‌లోని ఉస్మాన్‌గంజ్ నాలాను కార్పొరేటర్లు జి.శంకర్ యాదవ్, రాకేష్జైస్వాల్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గోషామహల్ నియోజకవర్గం కన్వీనర్ కృష్ణ, వనమాల గోపాల్ పాల్గొన్నారు.

12 గంటలు నిరవధిక సంగీత విభావరి

రవీంద్రభారతి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎస్.ఆర్.మ్యూజికల్స్ ఆధ్వర్యంలో మంగళవారం సీజన్ 7 పేరిట ఎలివేట్స్ ఎలైట్ స్టూడియోస్ వేదికగా 12 గంటల పాటు నిరవధిక సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకుడు సైదారెడ్డి 120 పాటలను ఆలపించి భళా అనిపించారు. ఈ పాటల ఆలాపనకు గాను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు హాజరై తమ రికార్డుల్లో చోటు నమోదు చేశారు. ఈ సందర్భంగా గాయకుడు సైదారెడ్డికి రికార్డు పత్రాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ మధుకర్‌స్వామి, బింగి, నరేందర్‌గౌడ్, రవి కుమార్, అశోక్, మధుసూదన్ తదితరులు పాల్గొని గాయకుడు సైదారెడ్డిని సత్కరించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న హైదరాబాద్ జిల్లా పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి

రాజేంద్రనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేసవి శిక్షణలో భాగంగా 'ప్రోగ్రామ్ ఆన్ కెపాసిటీ బిల్డింగ్ ఫర్ ప్రైమరీ స్కూల్ టీచర్స్' అనే అంశంపై రాజేంద్రనగర్ ఉపాధ్యాయులకు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి, కోర్సు డైరెక్టర్ శంకర్ రాథోడ్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉప్పరపల్లిలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి 135 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈసందర్భంగా శంకర్ రాథోడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు కాలానుగుణంగా బోధించడంలో శిక్షణ అవసరమన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని విద్యాశాఖ హైదరాబాద్ జిల్లా రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి సందర్శించి శిక్షణ తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, వసతులను పరిశీలించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ (డీఆర్పీ) పుష్పరాగం, మండల రిసోర్స్ పర్సన్‌లు మహేశ్వర్, అనిల్, సంతోషి, రోహిణి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



టీచర్ ట్రైనింగ్ క్యాంప్‌ను సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి

గండిపేట మండలం బండ్లగూడలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల టీచర్ ట్రైనింగ్ క్యాంప్‌ను మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సందర్శించారు. ఎలా నడుస్తోంది, ఎంతమంది హాజరైయ్యారు.. అక్కడ ఉన్న ఇతరత్ర సమస్యలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంఈవో విజయ్‌కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.
- నార్సింగ్, మే 20(ఆంధ్రజ్యోతి)

పీఈటీ, ఫిజికల్ డైరెక్టర్లకు వృత్యంతర శిక్షణ

గన్‌పార్క్, మే 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా పరిధిలో పీఈటీ, ఫిజికల్ డైరెక్టర్లకు ఐదు రోజులు వృత్యంతర శిక్షణను నిర్వహించినట్టు నాంపల్లి విద్యాశాఖ డిప్యూటీ ఈవో బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం నాంపల్లిలోని మహబూబియా గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్‌లో పీఈటీ, ఫిజికల్ డైరెక్టర్లకు డిస్ట్రిక్ట్ లెవల్ ఇన్ సర్వీస్ టీచర్స్ ట్రైయినింగ్ పేరిట వృత్యంతర శిక్షణలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణలో వివిధ రకాల ఆటల పోటీలు, ప్రమాదం జరిగిన వెంటనే ప్రథమ చికిత్సతో ప్రాథమిక వైద్యం, కొత్త ఆటల వివరాలను తెలుసుకుంటారన్నారు. క్రీడల్లో రాష్ట్రానికి మంచి పేరు తేచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

'సెమిస్టర్ పరీక్ష రాసే అవకాశం ఇవ్వాలి'

బర్కత్‌పుర, మే 20(ఆంధ్రజ్యోతి): నిజాం కళాశాలలో డిగ్రీ మొదటి, ద్వితీయ 370 మంది విద్యార్థులకు సెమిస్టర్ పరీక్ష రాసే అవకాశం ఇవ్వాలని మంగళవారం ధర్నా నిర్వహించారు. అటెండెన్స్ 75 శాతం లేదనే సాకుతో సెమిస్టర్ పరీక్షలకు అనుమతి ఇవ్వకపోవడంతో విద్యార్థులు ధర్నా చేశారు. డిగ్రీ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నాల్గవ సెమిస్టర్, ఫైనల్ ఇయర్ విద్యార్థులకు 6వ సెమిస్టర్ పరీక్షలు రాయకుండా ప్రిన్సిపాల్ హాల్ టికెట్లు ఇవ్వలేదని వారు ఆరోపించారు. ఫీజు చెల్లించే ముందు అటెండెన్స్ విషయం లేవనెత్తలేదని ఇప్పుడు పరీక్షలు రాయకుండా అడ్డుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. త్వరలో ఓయూ వీసీని కలిసి తమ గోడును విన్నవిస్తామని తెలిపారు.

'ఉద్యాన శాఖను బలోపేతం చేయాలి'

బర్కత్‌పుర, మే 20(ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖను రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేయాలని ఉద్యాన అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుడిమల్ల సందీప్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసినట్టు ఆయన తెలిపారు. 1982లో వ్యవసాయ శాఖ నుంచి ఉద్యాన శాఖ విడిపోయిందని, ఆనాటి నుంచి నేటి వరకు ఉద్యాన అధికారుల పోస్టులు పెంచలేదన్నారు.

'గత ప్రభుత్వంలోనే అంగన్‌వాడీలకు ఇబ్బందులు'

బర్కత్‌పుర, మే 20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సిబ్బందిని ఇబ్బందులకు గురిచేసిన విషయాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు మరచిపోయారని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు అన్నపూర్ణ ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు అంగన్‌వాడీల ఇబ్బందులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఇప్పుడు మొసలీ కన్నీరుకారుస్తున్నారని ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.

'అర్హులకు డబుల్ ఇళ్లు ఇప్పించండి'

అఫ్జల్‌గంజ్, మే 20 (ఆంధ్రజ్యోతి): జియగూడ డివిజన్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అర్హులైన పేదలకు ఇళ్లు ఇప్పించేలా కృషి చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ ఛైర్మన్ మిత్ర కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం డీసీసీ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిన్ రెడ్డి నివాసంలో ఆయనను కలిసి విన్నవించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని రోహిత్‌రెడ్డి తమకు హామీ ఇచ్చినట్టు మిత్ర తెలిపారు.

'సురవరం' జయంతి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

రవీంద్రభారతి, మే 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైతాళికుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి గోల్కొండ పత్రిక సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి, 129వ జయంతి మహాసభ ఈనెల 29న రవీంద్రభారతిలో నిర్వహించనున్నారు. గోల్కొండ సాహితీ కళాసమితి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణలో నిర్వాహకులు బడేసాబ్, కమ్యూనిస్టు నాయకుడు చెరుకుపల్లి సీతారాం, ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్రకాష్ రెడ్డి, బడేసాబ్, గంట మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టెన్త్'లో జిల్లా టాపర్ కార్తీక్‌కు నగదు అందజేత



కార్తీక్‌కు రూ.72 వేలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా, సంఘం సభ్యులు

రాజేంద్రనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): టెన్త్‌లో రంగా రెడ్డి జిల్లా టాపర్‌గా నిలిచిన పద్మశాలిపురానికి చెందిన పాపిశెట్టి కార్తీక్‌కు కాటిదాన్, శివరాం పల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రూ. 72 వేలు అందజేశారు. పాపిశెట్టి కార్తీక్ మంచి ర్యాంకు సాధించి ఆర్యవైశ్య సంఘానికి గర్వకారణంగా నిలిచాడని సంఘం ఛైర్మన్ సోమ శ్రీనివాస్ గుప్తా కొనియాడారు. ఆర్యవైశ్య పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం తరఫున కార్తీక్ కు రూ. 21 వేలు ప్రోత్సాహకంగా, ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు విరాళంగా రూ. 51 వేలు మొత్తం రూ.72 వేలు పాపిశెట్టి కార్తీక్‌కు సంస్థ ఛైర్మన్ సోమ శ్రీనివాస్ గుప్తా అందజేశారు. కార్యక్రమంలో గణేష్‌నగర్ గవర్నమెంట్ స్కూల్ టీచర్ నవారు మాణిక్యం రెడ్డి, సంఘం వ్యవస్థాపకుడు రంగా ప్రభాకర్ గుప్తా, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం కమిషనర్‌కు సన్మానం

రాజేంద్రనగర్, మే 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం కొత్తగా నియమించిన తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ దేశాల భూపాల్‌ను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా, పల్లపు జగన్, వలకొండ విజయకుమార్ గుప్తా పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/xlxi5Xdలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ప్రజలకు మెరుగైన వైద్యమే లక్ష్యం



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖ వైద్య నిపుణులు తదితరులు

బర్కత్‌పుర, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని అపోలో ఆస్పత్రి అనెస్థియాలజీ విభాగాధిపతి డాక్టర్ జేఎం రెడ్డి అన్నారు. వైద్య రంగంలో ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రి 25వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వైద్యులు అందిస్తున్న సేవలను ప్రభుత్వం, ప్రజలు గుర్తించాలని కోరాయి. సాయికృష్ణ న్యూరో ఆస్పత్రి ఎండీ డాక్టర్ రాంరెడ్డి మాట్లాడుతూ.. నరాల వ్యాధులకు సంబంధించి దక్షిణ భారతదేశంలోని తమ ఆస్పత్రి మొదటిదని, ఆధునిక వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం ఉచిత వైద్య శిబిరాలు, నరాల వ్యాధులపై అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు కాంతారెడ్డి, పి.జి.రెడ్డి, టి.వి.శ్రీనివాస్, ఏ.ఆర్.రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చలపతిరావు, జి.శ్రీధర్, చంద్రకాంత్, జోగేందర్‌కుమార్, ప్రణయ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

23న 'హరే శ్రీనివాస' గ్రంథావిష్కరణ

రవీంద్రభారతి, మే 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ.రమణాచారి రచించిన 'హరే శ్రీనివాస' గ్రంథావిష్కరణ సభ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో జరుగనుంది. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుష్పగిరి పీఠాధిపతులు, జగద్గురువులు అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ గ్రంథాన్ని జి.వల్లీశ్వర్ సమీక్షించనున్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యదర్శి మద్దాళి రఘురామ్ తెలిపారు.

అగ్గి రాజుకున్నప్పుడే హడావిడి

- నివేదికలు చెప్పరు.. లోగుట్టు విప్పరు
- శాఖల సమన్వయ లోపంతో కమిటీలకే పరిమితం
- నెలల తరబడి విచారణ..
- గుట్టుచప్పుడుకాకుండా చార్జిషీట్లు దాఖలు
- భగ్గుమంటున్న బాధితుల కుటుంబాలు

హైదరాబాద్ సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): నగరంలో అగ్ని ప్రమాద ఘటనలు జరిగినపుడే అధికారులు హడావిడి చేస్తున్నారు. నెలల తరబడి విచారణలు చేసినా, నివేదికలు రూపొందించినా వాటిని బహిర్గతం చేయడం లేదు. శాఖల మధ్య సమన్వయ లోపంతో కమిటీలకే పరిమితమవుతున్న అధికారులు ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా చార్జిషీట్లు దాఖలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. వీటిపై బాధిత కుటుంబాలు భగ్గుమంటున్నాయి.

బతికేదెట్ట.. బయటపడేదెట్టా..

అగ్నిప్రమాదాల ఘటనలపై ఉన్నతస్థాయి అధికారుల కమిటీ వేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం, నాయకులు.. ఆ తర్వాత నివేదికలపై ఏ మాత్రం ఆరా తీయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో నివేదికలను తెప్పించుకున్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా బుట్టదాఖలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నివేదికలను బయటకు వెల్లడించకుండా, దాన్నే గుణపాఠంగా భావించి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కార్యాచరణ చేయనప్పుడు ఉపయోగం ఏమిటని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.

నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చడానికేనా..?

ప్రమాదాల నివేదికల లోగుట్టును బయటకు చెప్పకపోవడానికి ప్రధాన కారణాలే ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారులు నివేదికలు



తయారు చేసిన తర్వాత వాటి గురించి ప్రభుత్వ యంత్రాంగం బయటకు వెల్లడించకపోవడానికి ఆయా శాఖల డొల్లతనం బయటకొస్తుందని, అధికారులు నిర్లక్ష్యాన్ని, శాఖల మధ్య సమన్వయలోపాలన్ని కప్పిపుచ్చడానికే నివేదికల లోగుట్టును బయటకు చెప్పడంలేదనే విమర్శలు వస్తున్నాయి..

నగరంలో జరిగిన కొన్ని ఘటనలు..

- రెండేళ్ల క్రితం స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించి ఆరుగురు ప్రైవేట్ ఉద్యోగులు సజీవ దహనం అయ్యారు. ఈ ఘటనపై పూర్తి నివేదిక తయారు చేసి, న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేయడానికి పోలీసులకు సుమారు రెండేళ్ల పట్టినట్లు తెలిసింది. అయినా ఆ వివరాలు, జరిగిన నష్టం ఎక్కడా బహిర్గతం చేయలేదు.
- సికింద్రాబాద్ పరిధిలోని దక్కన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి ముగ్గురు బిహార్ కార్మికులు సజీవ దహనమైన ఘటనలో అధికారులు, నాయకులు సమగ్ర విచారణకు ఆదేశించారు. ఉన్నతస్థాయి కమిటీ వేస్తున్నట్లు ప్రకటించి చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత విచారణ నివేదికను గానీ, అగ్నిప్రమాదంపై అధికారులు గుర్తించిన అంశాలు గానీ, జరిగినలోపాలు గానీ ఏవీ బయటకు వెల్లడి చేయలేదు.
- బజార్‌ఘాట్ అగ్నిప్రమాద ఘటనలో 9మంది, పుప్పాలగూడలో ఐదుగురు, బోయగూడలో 11 మంది కార్మికులు దుర్మరణం చెందిన ఘటనల్లోనూ అధికారులు ఎన్నడూ విచారణ నివేదికలు బయటపెట్టి అగ్నిప్రమాదాల లోగుట్టును బయటకు వెల్లడించిన దాఖలాలు లేవు.

మెట్రో నగరాల్లో అగ్ని ప్రమాదాలెక్కువే..

హైదరాబాద్‌లో 30శాతానికి పైగా షార్ట్‌సర్క్యూట్ వల్లే..

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అగ్ని ప్రమాదాలు సాధారణంగా మారాయి. హైదరాబాద్ నగరంలో మాత్రమే కాదు, మెట్రో నగరాలలో షార్ట్‌సర్క్యూట్ సంబంధిత అగ్ని ప్రమాదాలు ఆందోళనకరంగా మారాయి. హైదరాబాద్‌లో అగ్నిప్రమాదాలు 30శాతానికి పైగా షార్ట్‌సర్క్యూట్ వల్లనే జరుగుతున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. అగ్నిమాపక శాఖ నివేదికల ప్రకారం 2015- 2021 నడుమ ఆరేళ్ల కాలంలో 59వేలకు పైగా చిన్నా పెద్ద అగ్ని ప్రమాదాలు జరిగితే, వాటిలో 18వేలకు పైగా అగ్ని ప్రమాదాలు షార్ట్‌సర్క్యూట్ కారణంగానే జరిగాయి. అదృష్టవశాత్తు ఇవి 99శాతం స్వల్ప ప్రమాదాలే అయినప్పటికీ ఈ ఆరేళ్ల కాలంలో 304 మందికి పైగా మృత్యువాత పడ్డారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముంబైలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలలో దాదాపు 80శాతం షార్ట్‌సర్క్యూట్‌ల కారణంగా జరుగుతుంటే, అలహాబాద్‌లో దాదాపు 67శాతంగా ఉన్నట్లు నివేదికలు ఉటంకిస్తున్నాయి. ఇక నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నిర్వహించే యాక్సిడెంటల్ డెత్స్ అండ్ సూసైడ్స్ ఇన్ ఇండియా (ఏడీఎస్‌ఐ) నివేదికల ప్రకారం 2016-2020 మధ్య దేశంలో రోజూ 35 మంది అగ్ని ప్రమాదాల కారణంగా మృత్యువాత పడుతున్నారని తేలింది.

దేశాన్ని కుదిపేసిన కొన్ని షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు

1995, డిసెంబరు 23 : హరియాణా రాష్ట్రంలోని దబ్వాలీలో రాజీవ్ కల్యాణమండపం పరిసరాల్లో ఏర్పాటుచేసిన టెంట్‌లకు జనరేటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన నిప్పురవ్వలు అంటుకుని ప్రమాదం జరిగింది. ఇందులో 500మందికి పైగా విద్యార్థులు, మరో 40మందికిపైగా సిబ్బంది మృత్యువాత పడ్డారు.

1997, ఫిబ్రవరి23: ఒడిశా రాష్ట్రంలోని బారిపడా ప్రాంతానికి దగ్గర మధువన్‌లోని ఒక ఆధ్యాత్మిక సమావేశంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల తలెత్తిన ప్రమాదం 200మంది ప్రాణాలను తీసింది.

1979, జూలై29 : తమిళనాడు, తూతకూడి శివారులోని లక్ష్మీటూరింగ్ టాకీస్‌లో తలెత్తిన అగ్ని ప్రమాదంలో మ్యాట్నీషోకు వెళ్లిన వారిలో 73మంది అగ్నికి ఆహుతయ్యారు.

2004, జూలై 16: తమిళనాడు, కుంభకోణం పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల తలెత్తిన ప్రమాదంలో 94మంది చిన్నారులు మరణించారు.

2011, సెప్టెంబరు12: కోల్‌కతాలోని ఏఎంఆర్‌ఐ ఆస్పత్రిలోనూ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో 90మంది చనిపోయారు. తమిళనాడు ఎక్స్‌ప్రెస్ 2012నాటి ప్రమాదంలోనూ 47మంది అశువులు బాశారు. ఇలా ఎన్నో ప్రమాదాలు మరెన్నో కుటుంబాలలో తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కటకం రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి డే స్కాలర్‌లో షెడ్యూల్డ్ కులానికి సంబంధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు నాంపల్లిలోని చంద్రవిహార్ కాంప్లెక్స్ 8వ అంతస్తులో అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించాలి

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 25న జరిగే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణపై మంగళవారం నాంపల్లిలోని సరోజినీనాయుడు వనితా మహావిద్యాలయ సమావేశ మందిరంలో సూపర్‌వైజర్లు, రూట్ ఆఫీసర్లు, పరిశీలకుల నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. 95 కేంద్రాల్లో 43,676 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. 25న పేపర్-1 ఉదయం 9.30 నుంచి ఉదయం 11.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందన్నారు. యూపీఎస్సీ నిబంధనల మేరకు 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లు మూసివేయాలని, అభ్యర్థులు ముందుగానే చేరుకోవాలని సూచించారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ తేజావత్ రాందాస్, ఆర్డీఓ సాయిరాం, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి పాల్గొన్నారు.

మాపై దుష్ప్రచారం తగదు : ఐడీఏ

పంజాగుట్ట, మే20(ఆంధ్రజ్యోతి): దంత వైద్యుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా ఇటీవల కొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ, తెలంగాణ డెంటల్ కౌన్సిల్‌లు ఖండించాయి. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) తెలంగాణ శాఖ, తెలంగాణ డెంటల్ కౌన్సిల్ సంయుక్తంగా మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేశాయి. ఐడీఏ తెలంగాణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ డీఎన్ స్వామి, కార్యదర్శి డాక్టర్ చలపతిరావు, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు డాక్టర్ ప్రమోద్‌కుమార్, రాష్ట్ర శాఖ రిజిస్ట్రార్ డాక్టర్ రవికిరణ్ రెడ్డి, డాక్టర్ సుధీర్, తదితరులు మాట్లాడారు. దంత వైద్యులను వైద్యులుగా పరిగణించకూడదని ఒక డెర్మటాలజీ వైద్యురాలు మాట్లాడటం సరికాదన్నారు. సమస్య ఉంటే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్, ఇండియన్ డెంటల్ కౌన్సిల్ లలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్యులు వేణుగోపాల్, శ్వేత, మనీత తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినిపై లైంగిక దాడి

బంజారాహిల్స్, మే 20(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బంజారాహిల్స్ పరిధిలో నివాసముంటున్న విద్యార్థిని (17) ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ఈ నెల 19న సోదరితో కలిసి బయటకు వచ్చిన విద్యార్థిని, ఆ తర్వాత ఒంటరిగా ఇంటికి బయలుదేరింది. మధ్యలో సమీప బంధువైన నవీన్ ఆమెను కలిసి తోడుగా వస్తానని ద్విచక్ర వాహనం మీద ఎక్కించుకొని దేవరకొండబస్తీలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. చిన్నపనిని పూర్తిచేసుకుని వెళ్దామని చెప్పి.. బలవంతంగా ఆమెపై లైంగిక దాడి చేశాడు. బయటికి చెప్తే చంపేస్తానని బెదిరించాడు. ఇంటికి చేరిన విద్యార్థిని ఈ లైంగిక దాడి విషయాన్ని తన సోదరుడికి చెప్పింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఎంపీలు ఈటల, కొండా

రాజేంద్రనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): చార్మినార్ గుల్జార్‌హౌజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. చార్మినార్ అగ్నిప్రమాద మృతుల సంతాపసభ మంగళవారం శివరాంపల్లిలోని ఎస్ఎన్‌సీ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, బీజేపీ రాజేందర్‌నగర్ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా



మృతులకు నివాళులర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 17మంది చనిపోవడం బాధాకరమన్నారు. షార్ట్ సర్క్యూట్ ఎలాజరిగింది? అగ్నిప్రమాదం జరిగిన తర్వాత పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఎంత సమయంలో అక్కడికి వచ్చారు, ఎలాంటి సహాయక చర్యలు చేపట్టారనే అంశాలపై పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అన్ని విధాలుగా బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ మహానగరంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కందికల్ గేట్ చెప్పుల గోదాంలో అగ్నిప్రమాదం

చాంద్రాయణగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి): చెప్పుల గోదాంలో అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఛత్రినాక కందికల్‌గేట్‌కి చెందిన ముఖేష్ (51), కిశోర్(48)లు ఇద్దరు సోదరులు. వీరు పాత చెప్పులు సేకరించి వాటికి రిపేర్ చేసి సెకండ్స్ మార్కెట్‌లో విక్రయించేవారు. ఈ నేపథ్యంలో బోయిగూడలోని జీ+2 భవనంలో గ్రౌండ్ ఫ్లోర్, రెండో అంతస్తులో చెప్పులను నిల్వ ఉంచారు. మొదటి అంతస్తులో నలుగురు పెద్దలు, ఆరుగురు పిల్లలు నివాసముంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం రెండో అంతస్తు మంటలు చెలరేగడంతో



కాలిపోయిన చెప్పులు

చెప్పులు తగలబడి మంటలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన వారు హుటాహుటిన పిల్లలను, గ్యాస్ సిలిండర్లు తీసుకొని బయటికి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ తన సిబ్బందితో ఘటన స్థలికి చేరుకొని ఫైర్ స్టేషన్‌కి సమాచారం అందించారు. చాంద్రాయణగుట్ట, మొఘల్‌పురా ఫైర్‌ఇంజన్‌లు అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ఘటనపై ఛత్రినాక ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా నిర్వాహకులు రెండో అంతస్తులో చెప్పులు నిల్వ ఉంచిన ప్రాంతంలో కట్టెల పొయ్యి పెట్టడం వల్ల ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని ప్రమాదం జరిగిందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కేంబ్రిడ్జ్ మార్చి సిరీస్ ఫలితాలు వెల్లడి

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్ భారతదేశంలో మార్చి-2025 సిరీస్ పరీక్షా ఫలితాలను ప్రకటించింది. మార్చి సిరీస్‌కు దాదాపు 85వేల ఎంట్రీలు రాగా, గతేడాది ఇదే పరీక్షకు 62వేల ఎంట్రీలు వచ్చాయని, కేంబ్రిడ్జ్ విద్యా సంస్థలో చదవాలన్న వారి సంఖ్య బాగా పెరిగిందని ఆ సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పెరుగుదల అంతర్జాతీయ విద్యకు పెరుగుతున్న ప్రపంచ డిమాండును ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు.

కర్రలు.. రాడ్లతో కొట్టి పందులపై ప్రతాపం

- కడుపుతో ఉన్న దానినీ వదల్లేదు..
- అడ్డుకున్న మహిళకు బెదిరింపులు
- పోలీసులకు ఫిర్యాదుతో పరార్

బేగంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): నోరులేని వరాహాలపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కర్రలు, రాడ్లతో దాడిచేశారు. ఖాళీ స్థలంలో సంచరిస్తున్న పందుల గుంపుపై దాడి చేయడంతో కొన్నింటికి తీవ్రగాయాలై రక్తస్రావం జరిగింది. కడుపుతో ఉన్న పందిని సైతం వదలకుండా దాడిచేసి పైశాచిక ఆనందం పొందారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చికోటి గార్డెన్ వద్ద జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బేగంపేటలోని చికోటి గార్డెన్ ప్రాంతంలో ఖాళీ స్థలంలో తిరుగుతున్న పందుల గుంపును పట్టుకునేందుకు ఐదుగురు వ్యక్తులు కర్రలు, రాడ్లు, వలతో వచ్చారు. వలలు వేసి పట్టుకున్న మూడుపందుల కాళ్లను తాళ్లతో కట్టి కర్రలతో చితకబాదడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఒకటి గర్భంతో ఉంది. కర్రలతో దాడిచేయడంతో దానికి తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన ఓ మహిళ వారిని అడ్డుకున్నప్పటికీ ఆమెను బెదిరించారు. వెంటనే ఆమె జంతు సంరక్షకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలానికి పోలీసులు రావడంతో సదరు వ్యక్తులు పరారయ్యారు. జరిగిన సంఘటపై ఆమె బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు

ఎస్సీ, ఎస్టీ పదోన్నతుల జీవోలను పక్కాగా అమలు చేయాలి

గన్‌పార్క్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలు వాటి అనుబంధ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో ప్రాతినిథ్యం కల్పించిన జీవోలను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో 'తెలంగాణ విద్యుత్ సంస్థల్లో సీనియారిటీ, ఆందోళనలు, కోర్టు తీర్పులు - పరిష్కారాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. దీనిని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పీఎం రాజు రాశారు. ముఖ్య అతిథిగా హాజరైన బక్కి వెంకటయ్య పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సీనియారిటీ విధానం అడ్డుకునేందుకు కొందరు కోర్టుల్లో పిటిషన్లు వేయడం సరికాదన్నారు. ఈ విషయంలో విద్యుత్‌సౌధ యాజమాన్యం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. పుస్తక రచయిత పీఎం రాజు మాట్లాడుతూ క్యాచ్ అప్ రూల్ కోర్టు కేసుల తీర్పులను అర్థం చేసుకుని బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆందోళనలు విరమించుకుంటే మంచిదన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబునాయక్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రెటరి మాతంగి శ్రీనివాస్, నేతలు రాములు, జె.శంకర్, నటరాజు పాల్గొన్నారు.

దక్షిణ డిస్కంలో మారిన అధికారుల ఫోన్ నెంబర్లు

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) అన్ని అధికారిక మొబైల్ నెంబర్లను మార్చింది. ప్రస్తుతం వినియోగించే నెట్‌వర్క్‌లో సిగ్నల్స్, కాల్‌డ్రాప్ సమస్యలు ఏర్పడుతున్నాయని, దీని వల్ల కొన్నిసార్లు పనితీరుపై ప్రభావం పడుతున్నదని దక్షిణ డిస్కం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. సంస్థ పరిధిలో విద్యుత్ అధికారులు, ఫ్యూజ్ కాల్ ఆఫీస్‌లలో వినియోగించే అన్ని మొబైల్ నెంబర్లు మారుతాయని పేర్కొన్నారు.

కొత్త ఫోన్ నెంబర్లు

చీఫ్ ఇంజనీర్ (సీఈ) మెట్రోజోన్-87124 68831, సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) బంజారాహిల్స్ - 8712468922, సికింద్రాబాద్ ఎస్ఈ- 87124 70320, హైదరాబాద్ సౌత్ ఎస్ఈ - 87124 70575, హైదరాబాద్ సెంట్రల్ ఎస్ఈ- 87124 69540, మేడ్చల్ జోన్ సీఈ- 87124 72515, మేడ్చల్ ఎస్ఈ- 87124 72156, హబ్సిగూడ ఎస్ఈ- 87124 71392, సంగారెడ్డి ఎస్ఈ- 87124 73077, రంగారెడ్డి జోన్ సీఈ- 87124 68897, సైబర్‌సిటీ ఎస్ఈ - 87124 69519, రాజేంద్రనగర్ ఎస్ఈ- 87124 70037, సరూర్‌నగర్ ఎస్ఈ - 87124 72298

సీఎం ప్రజావాణి చొరవతో కారుణ్య నియామకం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన వేములపతి దేవి

బేగంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్ సమస్యగా మారిన కారుణ్య నియామకానికి సీఎం ప్రజావాణి ద్వారా మోక్షం లభించింది. రెవెన్యూశాఖలో ఉద్యోగ నియామకపు ఉత్తర్వులు రావడంతో బాధిత మహిళ వేములపతి దేవి మంగళవారం



వేములపతి దేవికి నియామక పత్రాన్ని అందజేస్తున్న చిన్నారెడ్డి, దివ్య

మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌కు వచ్చి సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యలకు ఉత్తర్వులను చూపించారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకరించిన ప్రజావాణి బృందానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మహంకాళి పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ విధి నిర్వహణలో 2018 నవంబరు 17న మృతి చెందారు. అయితే, మృతుడు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా గిద్దలూరు వాసి కావడంతో ఆరేళ్లుగా ఆంధ్ర - తెలంగాణ ప్రభుత్వాల మధ్య కారుణ్య నియామక అంశం తేలకుండా పోయింది. అయితే, కొన్ని నెలల క్రితం సీఎం ప్రజావాణి కార్యక్రమంలో ఈ సమస్యను వివరిస్తూ మృతుడి భార్య వేములపతి దేవి దరఖాస్తును అందజేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. హైదరాబాద్ పోలీస్‌శాఖలో ఉద్యోగి కావడంతో కారుణ్య నియామకం కింద తెలంగాణలోనే ఉద్యోగం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. దీంతో హైదరాబాద్ కలెక్టర్ ద్వారా నాంపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రైళ్లలో ప్రయాణికులను బెదిరించి డబ్బులు వసూలు

- నలుగురు హిజ్రాల అరెస్టు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణికులను బెదిరించి బలవంతంగా డబ్బులను వసూలు చేస్తున్న నలుగురు హిజ్రాలను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ జావిద్, సికింద్రాబాద్ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్, సాయిబాబానగర్‌లకు చెందిన పల్లి సూర్య భానుప్రకాశ్ (24), మాదాసు విజయ్(24), చెరుకు సాయికుమార్ (31), మరో బాలుడు ఈనెల 12న వరంగల్ వెళ్లే రైలులో ప్రయాణం చేసి అదే రైలులో తిరిగి వచ్చారు. మౌలాలి స్టేషన్ దాటాకా ఓ బోగీలో ఒంటరిగా ఉన్న ప్రయాణికుడిని డబ్బులు అడిగారు. ఇవ్వకపోడంతో తిడుతూ అతనిపై దాడి చేశారు. అంతటితో ఆగకుండా




వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు


అతని వద్ద బలవంతంగా రూ.10వేలు లాక్కొని ఒక్కొక్కరు రూ.2,300 పంచుకున్నారు. సికింద్రాబాద్ స్టేషన్ వచ్చాక బాధితుడు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి మంగళవారం ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఈ నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. నేరం ఒప్పుకోవడంతో వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపించినట్లు తెలిపారు.

నెల రోజులైనా దొరకని నేపాలీ దొంగల ఆచూకీ


బర్కత్‌పుర, మే 20 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ పీఎస్ పరిధిలోని ఓ పారిశ్రామికవేత్త ఇంట్లో జరిగిన చోరీ కేసులో భారీ మొత్తంలో బంగారం, నగదును దోచుకుపోయిన నేపాలీ దొంగల ఆచూకీ ఇంతవరకు లభించలేదు. గత నెల 20వ తేదీన పారిశ్రామికవేత్త హేమరాజు, అతని భార్యకు మత్తు మందు కలిపిన డ్రింక్స్ ఇచ్చి బంగారం, నగదు దోచుకుపోయిన విషయం విదితమే. హేమరాజు ఇంట్లో పనికి కుదిరిన నేపాల్‌కు చెందిన అర్పిత, మరో ముగ్గురు లోకేంద్ర బహదూర్ షాహీ, దీపేందర్ అలియాస్ గజేందర్, చతుర్భుజ్ అలియాస్ ఆర్యన్‌లు ఈ దొంగతనానికి పాల్పడ్డారు. వీరిని పట్టుకోవడానికి తూర్పు మండలం డీసీపీ బాలస్వామి, అదనపు డీసీపీ జోగుల నర్సయ్య ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నేపాల్, లక్నో, గోరఖ్‌పూర్, ముంబై, బెంగళూరులలో జల్లెడపట్టినా ఫలితం లేకపోయింది. అయితే, ముంబైలో ఎక్కువసంఖ్యలో నేపాలీలు ఉండడంతో వారి వద్దే తలదాచుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా పారిశ్రామికవేత్త హేమరాజు ఇంట్లో జరిగిన దొంగతనం కాచిగూడ పోలీసులకు సవాల్‌గా మారింది.




లోకేంద్ర బహదూర్ షాహీ



అర్పిత



దీపేందర్



చతుర్భుజ్





జైపూర్‌లోని ఒక హోటల్‌లోని స్పాలో రిసెప్షనిస్ట్‌గా వృత్తి జీవితాన్ని ఆరంభించి.. అంచలంచెలుగా ఎదుగుతూ దేశవ్యాప్తంగా 75 'మేఘావి' వెల్‌నెస్ సెంటర్లను నెలకొల్పిన వాణిజ్యవేత్త **మేఘన**. వాటిద్వారా సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. చిన్నప్పుడు లైంగిక వేధింపుల బాధితురాలైన మేఘన తాజాగా తన జీవిత కథ ఆధారంగా 'ది రైజ్ ఆఫ్ శక్తి' అనే పుస్తకాన్ని కూడా రచించారు. ఈ నేపథ్యంలో తన జీవిత, వృత్తి ప్రస్థానాలలో ఎదురైన సవాళ్లను, వాటిని ఎదుర్కొన్న తీరును 'నవ్య'తో పంచుకున్నారు.

కొత్త సవాళ్లంటే ఇష్టం..

"మాది రాజస్థాన్‌లోని జైపూర్. మధ్యతరగతి ఉమ్మడి కుటుంబం. బాబాయ్‌లు, పిన్నిలు, అక్కలు, అన్నలతో ఇల్లంతా ఎప్పుడూ కళకళలాడుతూ ఉండేది. మా ఇల్లు చిన్నగానే ఉండేది.. కానీ ఇంటి వెనక పెద్ద గార్డెన్ ఉండేది. దాంతో పిల్లలందరం ఎప్పుడు చూసిన చెట్ల మీద ఆడుకుంటూ ఉండేవాళ్లం. చిన్నప్పటి నుంచి నాకు చదువు అంటే చాలా ఇష్టం. అమ్మ, నాన్న కూడా ఆ ఇష్టాన్ని గుర్తించారు. జైపూర్‌లో ఒక ప్రముఖ స్కూల్లో జాయిన్ చేశారు. మా ఇంట్లో అలాంటి ఇంగ్లీషు మీడియం స్కూలుకు వెళ్లిన తొలి అమ్మాయిని నేనే! నా దురదృష్టమేమిటంటే- నాకు ఏడేళ్లు వచ్చేసరికి అమ్మ, నాన్న విడిపోయారు. నాన్నతో పాటు నేను ఉమ్మడి కుటుంబంలో ఉండిపోయాను. 1970, 80 దశకాలలో రాజస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో మహిళలకు అంత స్వేచ్ఛ ఉండేది కాదు. ఇంటి పనంతా అమ్మాయిలే చేయాల్సి వచ్చేది. మా ఇంట్లోని అమ్మాయిల్లో నేనే పెద్ద కాబట్టి వంటపని బాధ్యత నామీద పడింది. 13 ఏళ్ల వయస్సు వచ్చేనాటికి- ఇంట్లో ఉన్నవారందరికీ నేను వండాల్సి వచ్చేది.

అదంతా ఒక పీడకల...

ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పాలి. మా ఇంటి పక్కనే ఇద్దరు అమ్మాయిలు ఉండేవారు. నేను వాళ్లింటికి ఆడుకోవటానికి వెళ్లేదాన్ని. నా స్నేహితురాళ్ల నాన్న నన్ను తాకరాని చోట్ల తాకుతూ ఉండేవాడు. అసభ్యకరమైన చేష్టలు చేస్తూ ఉండేవాడు. ఎవరితో చెప్పాలో కూడా తెలియని అమాయకత్వం నాది. ఈ లైంగిక వేధింపులు సుమారు ఏడేళ్ల పాటు సాగాయి. ఇప్పుడు ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే- అదంతా ఒక పీడకలలా అనిపిస్తుంది. బాల్యంలో జరిగిన అవాంఛనీయమైన సంఘటనలు మనస్సులో ముద్రపడిపోతాయి. అప్పుడే కాదు... ఇప్పుడు కూడా మన సమాజంలో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. అందుకే తల్లితండ్రులు... ముఖ్యంగా తల్లులు తమ అమ్మాయిల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వారికి 'గుడ్ టచ్...బ్యాడ్ టచ్'ల గురించి చెప్పాలి. అనుకోని సంఘటనలు ఎదురయితే- ఎలా ఎదుర్కోవాలో శిక్షణ ఇప్పించాలి. సాధారణంగా ఇలాంటి విషయాల గురించి ఎక్కువగా ఎవరు మాట్లాడరు. కానీ ఎవరో ఒకరు ముందుకు వచ్చి మాట్లాడితే తప్ప - ఈ తరహా సమస్యలకు పరిష్కారం గురించి సమాజం ఆలోచించదు. అందుకే ఆ అనుభవాలను నా ఆత్మకథలో రాశాను. కొన్ని పాడ్‌కాస్ట్‌లలో కూడా మాట్లాడాను.

స్ఫూర్తి వీరే...

తమకు ఎదురయిన అవాంతరాలను ఎదుర్కొని నిలబడే మహిళలంటే నాకు చిన్నప్పటి నుంచి చాలా గౌరవం. వాళ్లనే స్ఫూర్తిగా భావించేదాన్ని. జైపూర్ రాణీ సాహిబా గాయత్రీ దేవి నెలకొల్పిన మహిళా పాఠశాలలోనే నేను చదువుకొన్నా. మనకు స్వాతంత్ర్యం రాకముందే మహిళలకు సాధికారత అవసరమని భావించి నెలకొల్పిన పాఠశాల అది. ఆమె ఫోటో చూసినప్పుడల్లా నాలో కొత్త శక్తి వచ్చేది. అలాంటి మరో వ్యక్తి ఇందిరా గాంధీ. నాన్నకు ఇందిరాగాంధీ అంటే ఇష్టం. ప్రధానిగా ఆమె చేసిన పనులన్నీ కథలు కథలు చెబుతూ ఉండేవాడు. పురుషులతో నిండిపోయిన రాజకీయాల్లో ఆమె తనదైన ముద్ర వేయగలగటం చాలా ఆశ్చర్యంగా అనిపించేది. వీరిద్దరితో పాటుగా మా చుట్టూ పక్కలే నివసించే అనేక మంది మహిళలు చాలా గొప్పగా అనిపించేవారు. వీరు పెద్ద పెద్ద పనులు చేయకపోవచ్చు. కానీ తమకు ఎదురయిన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేవారు. నాకు కూడా వాళ్ల మాదిరిగానే జీవించాలని ఉండేది. కానీ కొన్ని పరిస్థితుల వల్ల 18 ఏళ్ల వయస్సులో ఇల్లు వదిలి బయటకు వచ్చేశాను. ఒక స్కూల్లో టీచర్‌గా చేరాను. ఆ రోజుల్లో ఇల్లు గడవాలంటే నెలకు రూ.4 వేలు ఖర్చు అయ్యేది. వేసవి సెలవుల్లో మాకు జీతాలు ఉండేవి కావు. ఏదో ఒక పని చేయకపోతే రోజు గడవదు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక రోజు ఓ స్నేహితురాలు ఒబెరాయ్ హోటల్‌లో రిసెప్షనిస్ట్ ఉద్యోగం ఉందని చెప్పింది. వాస్తవానికి నా చిన్నప్పటి నుంచి ఎప్పుడూ పెద్ద హోటల్‌కు వెళ్లి ఎరగను. బయట తినటం అసలు ఉండేది కాదు. హోటల్‌లో ఉద్యోగం అంటే మొదట్లో చాలా భయం వేసింది. ఇంటర్వ్యూకి వెళ్లకూడదనుకున్నా. కానీ జీతం రాకపోతే పస్తులు ఉండాల్సిన పరిస్థితి. పెద్ద హోటల్‌లో ఉద్యోగం వస్తే జీతం క్రమం తప్పకుండా ఇస్తారనుకున్నా. ఇంటర్వ్యూకి వెళ్లా. ఇంగ్లీషు మాట్లాడగలను కాబట్టి నన్ను ఎంపిక చేసుకున్నారు. వాళ్ల స్పాలోని ఫ్రంట్ ఆఫీస్‌లో ట్రైనీగా చేర్చుకున్నారు. నెలకు నాలుగు వేలు జీతం. ఆ ఉద్యోగమే నా జీవితాన్ని మలుపు తిప్పింది.

> హోటల్‌లో ఉద్యోగం అంటే మొదట్లో చాలా భయం వేసింది. ఇంటర్వ్యూకి వెళ్లకూడదనుకున్నా. కానీ జీతం రాకపోతే పస్తులు ఉండాల్సిన పరిస్థితి. పెద్ద హోటల్‌లో ఉద్యోగం వస్తే జీతం క్రమం తప్పకుండా ఇస్తారనుకున్నా. ఇంటర్వ్యూకి వెళ్లా. ఇంగ్లీషు మాట్లాడగలను కాబట్టి నన్ను ఎంపిక చేశారు. నెలకు నాలుగు వేలు జీతం. ఆ ఉద్యోగమే నా జీవితాన్ని మలుపు తిప్పింది.



అంచలంచెలుగా ఎదుగుతూ...

ఉద్యోగంలో చేరిన కొత్తల్లో నాకు కొన్ని లక్ష్యాలు ఉండేవి. సగంలో మానేసిన డిగ్రీ పూర్తి చేయటం మొదటిది. ఆ తర్వాత ఇంకో మంచి ఉద్యోగం చూసుకొని మారిపోవటం రెండోది. పెళ్లి చేసుకొని... భర్త, పిల్లలతో ఆనందంగా జీవించటం మూడోది. మొదటి మూడు నాలుగేళ్లు ఈ లక్ష్యాల కోసమే పని చేశాను. ఆ తర్వాత నాకు ఆ ఉద్యోగం నచ్చటం మొదలయింది. ఒక స్పాను ఎలా నడపాలి, దానిలో ఎలాంటి వస్తువులు ఉండాలి, కస్టమర్లకు ఎలాంటి సేవలు అందించాలి? అనే విషయాలు నాకు తెలియకుండానే నేర్చేసుకున్నాను. కొత్త కొత్త ఆవిష్కరణలు చేసేదాన్ని. ఆ తరువాత ఒబెరాయ్ నుంచి మరొక హోటల్‌కి మారా. ఇలా అతి తక్కువ కాలంలోనే ఒక పెద్ద గ్రూప్‌నకు డైరక్టర్ ఫర్ ఆపరేషన్స్‌గా ఎదిగా. ఆ స్థాయికి చేరుకున్న తర్వాత- హోటల్ పరిశ్రమలో నేను చేయగలిగింది ఏమి లేదనిపించింది. కొత్త సవాళ్లు కావాలనిపించింది. అలా ప్రారంభమయిందే 'మేఘావి వెల్‌నెస్ సెంటర్'.

ఆ అపోహ చాలామందిలో ఉంది...

ఒకే ఒక బ్రాంచ్‌తో ప్రారంభమయిన 'మేఘావి'కి ప్రస్తుతం 75 సెంటర్లు ఉన్నాయి. త్వరలోనే ముంబాయి ఎయిర్‌పోర్టులో మా బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్నాం. వీటిలో దేని నిర్వహణనూ ఇతరులకు ఇవ్వలేదు. అన్నింటినీ మేమే దగ్గరుండి చూసుకుంటాం. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. వెల్‌నెస్ సెంటర్ అంటే కేవలం మసాజ్‌లు మాత్రమే చేస్తారనే అపోహ చాలామందిలో ఉంది. అలసిపోయిన దేహానికి, మనస్సుకు సాంత్వన చేకూర్చేదే వెల్‌నెస్ సెంటర్. అలా సాంత్వన చేకూర్చడానికి అంతర్జాతీయంగా అనేక రకాల అత్యాధునిక సాంకేతిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వాటి ద్వారా ఫలితాలు త్వరగా లభిస్తాయి. వీటిని మా సెంటర్ల ద్వారా మన దేశంలో కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నాం.. నా ఈ ప్రయాణంలో అనేకమంది సహకరించారు. వారి నుంచి అనేక కొత్త విషయాలు నేర్చుకున్నాను. నాకు ఎంతో అభిమానాన్ని పంచి ఇచ్చిన సమాజానికి తిరిగి ఇవ్వటానికి అనేక రకాలుగా నా వంతు కృషి చేస్తున్నా. ముఖ్యంగా చిన్నపిల్లలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిపి పనిచేస్తున్నా. అందరూ కలిసి కృషిచేస్తే ఈ సమస్యను తరిమివేయవచ్చని భావిస్తున్నా."

• సీవీఎల్ఎన్ ప్రసాద్

"సైబర్ నేరాల బాధితులు ఎదుర్కొనేది ఆర్థిక నష్టం మాత్రమే కాదు, అంతకుమించిన వేదన కూడా... అటువంటి వేలాది సైబర్ నేరాల బాధితులకు మానసికంగా అండగా నిలుస్తున్నారు ఒడిశాకు చెందిన **స్వాతి దాస్**. మరోవైపు సైబర్ నేరాల గురించి, సోషల్ మీడియాకు బానిసలు కావడం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

'సైబర్ వల'లో పడకుండా



ఐటీ రంగంలో పని చేసేవారిలో ఎక్కువమంది వారాంతాల్లో విశ్రాంతికి ప్రాధాన్యం ఇస్తారు. 32 ఏళ్ళ స్వాతి దాస్ దీనికి మినహాయింపు. శని, ఆది వారాల్లో ఉదయాన్నే భువనేశ్వర్- కటక్ పోలీస్ కమిషనరేట్‌కు చేరుకుంటారు. సైబర్ నేరాల బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తారు. అలాగే విద్యా సంస్థలకు వెళ్తారు. యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తారు. గత రెండున్నర ఏళ్ళుగా క్రమం తప్పకుండా ఆమె ఈ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. "సాంకేతికత పెరుగుతున్నకొద్దీ నష్టపోయే ముప్పు కూడా పెరుగుతోంది. పెద్దగా చదువులేనివారే కాదు విద్యావంతులు కూడా బలైపోతున్నారు. వారికి ఊరట కలిగించి, ఆత్మస్థైర్యాన్ని పెంచాలనే ఆలోచనే నాకు ప్రేరణ" అని చెబుతున్నారు స్వాతి. ఒడిశాలోని కటక్‌కు చెందిన ఆమె ఒక ఐటీ సంస్థలో పని చేస్తున్నారు. తన బంధువులు, స్నేహితులు, తోటి ఉద్యోగుల్లో కొందరు సైబర్ నేరాల బారిన పడి... డబ్బుతోపాటు మనశ్శాంతిని సైతం పోగొట్టుకోవడం ఆమెకు వేదన కలిగించింది. అదే సమయంలో స్వాతి పని చేస్తున్న ఐటీ సంస్థ తమ ఉద్యోగుల కోసం ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా మెంటల్ హెల్త్ కౌన్సెలింగ్‌లో ఆమె శిక్షణ పొందారు. తన పరిచయస్తులు కొందరికి కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. ఈ క్రమంలోనే పోలీస్ కమిషనరేట్‌కు చెందిన వాలంటీర్లతో ఆమెకు పరిచయం అయింది. వారి ప్రోత్సాహంతో... పోలీసులు నిర్వహిస్తున్న సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొనడం మొదలుపెట్టారు. ఈ సమస్య తీవ్రత అప్పుడే తనకు మరింత లోతుగా అర్థమయిందంటారు స్వాతి.

బాధ్యతగా భావించా...

"సైబర్ నేరాలు ప్రజలను మానసికంగా, భావోద్వేగపరంగా కల్లోలానికి గురిచేస్తాయి. దీనివల్ల వాళ్ళ బ్యాంకు ఖాతాలు ఖాళీ కావడం మాత్రమే కాదు... మనశ్శాంతి నాశనమవుతుంది. చేతకానితనం వల్లే మోసపోయామనే అపరాధ భావం, నలుగురికీ తెలిస్తే ఎలా? అనే ఆందోళన, నిస్సహాయత కారణంగా మనస్థైర్యం కోల్పోయే ప్రమాదం ఉంది.. తోటివారి మీద నమ్మకం తగ్గిపోతుంది. కొందరు జీవితకాలం దాచుకున్నదంతా పోగొట్టుకోవడంతో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు కూడా చేస్తారు. ఇవన్నీ చివరికి పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పిటిఎస్‌డి)కి దారితీస్తాయి. తీవ్ర నిస్పృహలో ఉన్న ఇటువంటివారికి సామాజికమైన మద్దతు అవసరం. వారి సమస్యలను శ్రద్ధగా విని, కౌన్సెలింగ్ ద్వారా వారికి అండగా నిలవడం నా బాధ్యతగా భావించాను" అని చెబుతున్నారు స్వాతి. మన దేశంలో సగటున రోజుకు ఏడువేల సైబర్ నేరాలు నమోదవుతున్నట్టు "ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ (ఐఫోర్‌సి) నిరుడు మేలో విడుదల చేసిన నివేదిక చెబుతోంది. అంటే ప్రతి నిమిషానికి నలుగురైదుగురు మోసగాళ్ళ బారిన పడుతున్నారు. ఆ బాధితులకు సాయపడే కీలకమైన పాత్రను స్వాతి పోషిస్తున్నారు. సైబర్ నేరాలపై అవగాహన, మానసిక ఆరోగ్యంపై పాఠశాలల్లో, కళాశాలల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కొన్ని వందల వర్క్‌షాపులను ఆమె నిర్వహించారు. వెయ్యి మందికి పైగా బాధితులు వారి సమస్యల నుంచి బయటపడడానికి వ్యక్తిగతంగా సాయపడ్డారు. ఆమె భువనేశ్వర్-కటక్ పోలీస్ కమిషనరేట్‌తో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి పని చేస్తున్న ఏకైక మహిళా వాలంటీర్ కూడా. తన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం నుంచి, వివిధ సంస్థల నుంచి పురస్కారాలు సైతం అందుకున్నారు.

అతి ఏదైనా అనర్థమే

"సైబర్ నేరాల బాధితుల్లో రకరకాల వ్యక్తులు ఉంటారు. భారీ ఆర్థిక నష్టం కారణంగా కుమిలిపోతున్నవారు వారి వివరాలను చెబుతున్నప్పుడు ఏడ్చేస్తూ ఉంటారు. మరికొందరు తమ సమస్యలను చెప్పుకోవడానికి ఇష్టపడరు. హనీట్రాపింగ్ లేదా డీప్ ఫేక్ బారిన పడి డబ్బు పోగొట్టుకున్నవారు కూడా ఎంతో మంది. వారితో సహానుభూతితో మాట్లాడతాను. ఇలాంటిది జరిగింది వారొక్కరికే కాదని చెబుతాను. మానసికంగా దృఢంగా ఉంటేనే మిగిలిన జీవితాన్ని సజావుగా సాగించగలరనీ ఆత్మస్థైర్యాన్ని ఇస్తాను. ఇప్పటివరకూ యాభైకి పైగా



పాఠశాలల్లో పిల్లలకు సైబర్ నేరాల గురించి వివరించాను. దీనితోపాటు ప్రస్తుతం మన జీవితాల్లో సోషల్ మీడియా కారణంగా తలెత్తుతున్న దుష్పరిణామాల గురించి కూడా చెబుతున్నాను. చిన్న వయసులోనే పిల్లలు స్మార్ట్ ఫోన్లకు, దానిలో వచ్చే రకరకాల కంటెంట్‌కు బానిసలవుతున్నారు. అతి ఏదైనా అనర్థమే. సామాజిక సంబంధాలమీద సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా ఉంది. ముఖ్యంగా పిల్లల్లో దాని వాడకాన్ని నియంత్రించాల్సిన బాధ్యత కుటుంబాలపైనా, ఉపాధ్యాయులపైనా ఉంది" అని చెబుతున్నారు స్వాతి. ప్రస్తుతం భువనేశ్వర్, కటక్ నగరాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరిన్ని ప్రాంతాల్లోనూ ఆమె చేపట్టబోతున్నారు.

జామ ఆకు ప్రయోజనాలెన్నో...

జామ పండును పేదల యాపిల్ అని అంటారు. ఎందుకంటే అందులోని పోషకాలు యాపిల్‌కు తీసిపోవు. అయితే జామ పండు వలనే కాదు దాని ఆకుల వలన కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే జామ ఆకులను నేరుగా లేదా జామ ఆకుల టీ లేదా జామ ఆకులను నీటిలో మరిగించి ఆ నీటిని తీసుకోవచ్చు.



- జామ ఆకులు మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది.
- వీటిల్లోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు హానికరమైన సూక్ష్మజీవులతో పోరాడతాయి. శరీరంలో చక్కెర స్థాయిలను, ఆకలిని నియంత్రించి శరీర బరువును తగ్గించడంలో సహాయ పడతాయి.
- మహిళల్లో నెలసరి వలన కలిగే నొప్పులను జామ ఆకులు తగ్గిస్తాయి. వ్యాధి నిరోధకతను పెంచుతాయి.
- శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో జామ ఆకులు బాగా పనిచేస్తాయి. దీని వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.
- జామ ఆకుల క్యాన్సర్ కణాల పెరుగుదలను నివారిస్తుందని కొన్ని పరిశోధనల్లో తేలింది. క్యాన్సర్‌కు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌ను జామ ఆకుల్లోని యాంటీ ఆక్సిడెంట్లు నివారిస్తాయి.

బట్టల మన్నిక కోసం...

సాధారణంగా మనం వెతికి వెతికి మరీ నచ్చిన బట్టలు కొనుక్కుంటూ ఉంటాం. ఒక్కోసారి ఇవి త్వరగా రంగులు వెలిసి పోవడమో, చిరుగులు పట్టడమో జరుగుతూ ఉంటుంది. ఇలా కాకుండా బట్టలు ఎక్కువ కాలం మన్నికగా ఉండేందుకు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం.

- బట్టలను ఎక్కువసార్లు ఉతకడం వల్ల వాటి నాణ్యత దెబ్బతింటుంది. కొద్దిసేపు ధరించినవాటిని వెంటనే ఉతకకుండా గాలి తగిలేలా హ్యాంగర్‌కు తగిలించాలి.
- ముదురు రంగు బట్టలను మొదటిసారిగా ఉతికేటప్పుడు నీళ్లలో కొద్దిగా గళ్ల ఉప్పు కలిపితే అవి రంగు విడవకుండా ఉంటాయి.
- రంగుల బట్టలను ఉతికిన తరవాత నేరుగా ఎండలో ఆరవేయకూడదు. ఎండ వల్ల రంగులు వెలిసిపోతాయి. కాబట్టి వాటిని నీడలో గాలి తగిలేలా ఆరవేయాలి.
- బట్టలను ఉతికేటప్పుడు ఎక్కువ డిటర్జెంట్ ఉపయోగించకూడదు. సబ్బుతో అదేపనిగా రుద్దకూడదు. ఏవైనా మరకలు పడితే ఆ ప్రాంతం వరకు సబ్బు లేదా షాంపూతో రుద్దితే సరిపోతుంది.
- తెల్లని బట్టలను ఉతికేముందు వాటిని కొద్దిసేపు సర్ఫ్ నీళ్లలో నానబెడితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది.
- కొత్త బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేయకూడదు. ఒకవేళ ఇవి రంగులు విడుస్తున్నట్లయితే అవి విగిలిన బట్టలకు అంటుకునే అవకాశం ఉంటుంది.
- బాగా వేడెక్కిన ఇస్త్రీ పెట్టెతో బట్టలు ఇస్త్రీ చేయకూడదు. బట్టల మీద ముడుతలు పోయేలా ఇస్త్రీ పెట్టెను మధ్యస్థాయిలో వేడిచేస్తే సరిపోతుంది.
- అనుకోకుండా బట్టల మీద చిరుగులు ఏర్పడితే వెంటనే వాటిని దర్జీ వద్దకు తీసుకువెళ్లి కుట్టించాలి. లేదంటే ఇంట్లో కుట్టుమిషన్ మీదనైనా సరిచేసుకోవచ్చు.
- కాలానుగుణంగా ధరించే బట్టలను శుభ్రంగా ఉతికి సరైన విధానంలో మడతపెట్టి జాగ్రత్త చేసుకోవాలి.
- బట్టలను భద్రపరచే చోట కలరావుండలు ఉంచితే పురుగులు చేరకుండా ఉంటాయి.



పసందైన ప్యాచ్ వర్క్

ఫ్యాషన్

సాదాసీదా చీరలకు బదులుగా 'ప్యాచ్ వర్క్' చేసిన వినూత్నమైన చీరలు ఎంతో ప్రత్యేకంగా కనిపిస్తాయి. కాంట్రాస్ట్ రంగులతో, అందమైన డిజైన్ల రూపంలో ప్యాచ్ వర్క్ చేసిన ఆ కాటన్ చీరలు ఇవే!





- పువ్వులు, లతల డిజైన్లతో కూడిన కాటన్ చీరకు, అంచుల వెంబడి కాంట్రాస్ట్ కలర్ ప్యాచ్‌ను జతచేస్తే ఆ చీర లుక్ పూర్తిగా మారిపోతుంది. అదనపు ఆకర్షణ కూడా తోడవుతుంది.
- ప్యాచ్‌వర్క్‌ను పోలిన మ్యాచింగ్ బ్లౌజ్ ధరిస్తే, చీరకు అందం వస్తుంది. అయితే చీర కట్టుకు నప్పేలా బ్లౌజ్ నెక్ డిజైన్ జాగ్రత్తగా ఎంచుకోవాలి. ఓవల్, రౌండ్ షేప్ నెక్ డిజైన్లు బాగుంటాయి.
- ప్లెయిన్ కలర్ చీరకు, కాంట్రాస్ట్ కలర్ అంచు ఒక్కటే సరిపోదు. చీర రంగును పోలిన డిజైను అంచులో ఉండి తీరాలి. అప్పుడే ప్యాచ్‌వర్క్ నలుగురి కళ్లనూ ఆకర్షిస్తుంది
- ప్యాచ్ వర్క్ మరీ పెద్దవైతే ఎబ్బెట్టుగా ఉంటుంది. మరీ చిన్నవిగా ఉంటే స్పష్టంగా కనిపించవు. కాబట్టి ప్రత్యేకంగా కనిపించే డిజైన్లనే ఎంచుకోవాలి
- ప్లెయిన్ కాటన్ చీర మీద, కలంకారి, ఇక్కత్ వస్త్రపు ప్యాచ్ వర్క్ తాజా ఫ్యాషన్. కాబట్టి ఇలాంటి చీరలే ఎంచుకోవాలి.





- ఎరుపు, పసుపు... ఆకుపచ్చ, నీలం... నలుపు, ఎరుపు.. కాంట్రాస్ట్ డిజైన్లు బాగుంటాయి

ఇప్పటికి వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధమే

» స్టే ఇవ్వాలంటే బలమైన కారణం చూపాల్సిందే: సుప్రీం



న్యూఢిల్లీ, మే 20: బలమైన ఆధారాలతో పిటిషనర్లు సవాలు చేసే వరకు పార్లమెంటు చేసిన చట్టాలను రాజ్యాంగబద్ధమైనవి గానే పరిగణిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇటీవల పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ సవరణ అమలు చేయకుండా మధ్యంతర ఊరట కల్పించాలంటే స్పష్టంగా ఉన్న బలమైన కారణాన్ని చూపించాల్సిందేనని పిటిషనర్లకు స్పష్టం చేసింది. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిలతో కూడిన ధర్మాసనం మంగళవారం వక్ఫ్ చట్టంపై దాఖలైన పలు పిటిషన్ల మీద విచారణ జరిపింది. కోర్టులు వక్ఫ్‌గా ప్రకటించినవి, భూమిని వినియోగిస్తున్న వారు వక్ఫ్‌గా ప్రకటించినవి, ఆస్తిని రాసివ్వడం ద్వారా వక్ఫ్‌గా ప్రకటించినవి... ఈ మూడు రకాల ఆస్తులను డీనోటిఫై చేసే అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టే ప్రస్తుత చట్ట నిబంధనను పిటిషనర్లు ప్రధానంగా వ్యతిరేకిస్తున్నారు. చట్టాన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్లు వేసిన వారి తరపున కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కొత్త చట్టంతో న్యాయ ప్రక్రియతో నిమిత్తం లేకుండా వక్ఫ్ ఆస్తులను లాక్కునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పథకం ప్రకారం వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకొనే కార్యక్రమమని సిబల్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ అధికారి ఆదేశాలతో వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ ఆస్తులుగా ప్రకటించే పరిస్థితి నెలకొందని, బాధితులు కోర్టుల ద్వారా ఊరట పొందే అవకాశం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ అంటే శాశ్వతంగా అల్లాకు సమర్పించే ఆస్తి అని, కొత్త చట్టం వల్ల శాశ్వతం అనే భావనకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. పాత వక్ఫ్ చట్టాలు ఆస్తులను కాపాడేందుకు ఉద్దేశించినవి అయితే ప్రస్తుత వక్ఫ్ చట్టం వాటిని లాక్కునేందుకు ఉద్దేశించినట్లు కనబడుతోందని వ్యాఖ్యానించారు. ఒక ఆస్తి వక్ఫ్‌దా? ప్రభుత్వానిదా? అని ప్రభుత్వ అధికారి విచారిస్తున్నపుడు ఆ ఆస్తిని స్వాధీనం చేసుకొనే అధికారం కూడా సదరు అధికారికి కట్టబెడుతున్నారని ప్రస్తావించారు. ఇందులో ఎక్కడా కోర్టుల జోక్యానికి అవకాశం లేదని గుర్తు చేశారు. గతంలో వక్ఫ్‌కు ఎన్నికలు జరిగేవని, అందరూ ముస్లిములు ఉండేవారని, ఇప్పుడు అంతా నామినేటెడ్ సభ్యులని, 11 మందిలో ఏడుగురు ముస్లిమేతరులను నియమించే అవకాశం ఉందని, ఇది రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛకు, ప్రచారం చేసుకునే హక్కుకు భంగం కలిగిస్తుందని వ్యాఖ్యానించారు. ఇద్దరే కదా అని ధర్మాసనం గుర్తు చేయగా, ఇద్దరైనా చాలా ఎక్కువేనని సిబల్ అన్నారు. హిందూ, సిక్కు ఎండోమెంట్ సంస్థల్లో మతేతరులు లేరని, ఎక్స్ అఫీషియో సభ్యులు కూడా అదే మతానికి చెందిన వారు ఉంటారని ప్రస్తావించారు.

వక్ఫ్ లౌకిక భావన

వక్ఫ్ సవరణ చట్టాన్ని ప్రభుత్వం గట్టిగా సమర్థించుకుంది. వక్ఫ్ పాలనలో లౌకిక అంశాలను మాత్రమే ప్రభుత్వం నియంత్రిస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా లిఖితపూర్వకంగా కోర్టుకు చెప్పారు. వక్ఫ్ అనేదే మౌలికంగా లౌకిక భావన అన్నారు. చట్టంపై ఇప్పటికిప్పుడు స్టే ఇవ్వాల్సిన జాతీయ అత్యవసర పరిస్థితి ఏమీ లేదని వ్యాఖ్యానించారు. సరైన పత్రాలు లేకుండా వక్ఫ్ ఆస్తులను కొనసాగించే ప్రస్తావనే లేదని తుషార్ మెహతా స్పష్టం చేశారు. కోర్టు సొంత నిర్ణయంతో అలాంటి వాటికి గుర్తింపు ఇచ్చే ప్రయత్నంచేస్తే ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. అందుకు అనుమతిస్తే చాలా మోసాలు జరుగుతాయన్నారు. ఆస్తిని మత ధర్మం కోసం వాడుతున్న వ్యక్తికి దాన్ని వక్ఫ్‌గా ప్రకటించే అధికారం ప్రాథమిక హక్కేమీ కాదని స్పష్టం చేశారు. ఒక చట్టం ద్వారా ఇచ్చిన హక్కును మారుతున్న కాలమాన పరిస్థితులను బట్టి మరో చట్టం ద్వారా తీసుకొనే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని తేల్చిచెప్పారు.

ఆసియాలో కోరలు చాస్తున్న కొవిడ్!

హాంకాంగ్, సింగపూర్ థాయ్‌లాండ్‌లో వేలల్లో కేసులు.. ఆస్పత్రుల్లో చేరికలు.. తీవ్రత తక్కువ

» భారత్‌లోనూ 250 కేసుల నమోదు

» జేఎన్.1, దాని ఉపరకాల విజృంభణ

న్యూఢిల్లీ, మే 20: ప్రపంచాన్ని గడగడలాడించిన కొవిడ్ మహమ్మారి ఆసియా ఖండంలో మళ్లీ విజృంభిస్తోంది. ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్, చైనాల్లో వ్యాప్తి చెందుతోంది. రోజురోజుకూ పాజిటివిటీ రేటు పెరుగుతోంది. భారత్‌లోనూ 257 కేసులు నమోదయ్యాయి. జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలు ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 కారణంగా కొవిడ్ వ్యాప్తి అధికంగా ఉన్నట్లు సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జేఎన్.1 రకం వేరియంట్ పెరగడాన్ని బట్టి.. ఇంతకు మునుపు తీసుకున్న వ్యాక్సిన్ల ప్రభావం తగ్గుతున్నట్లు స్పష్టమవుతోందని పేర్కొంది.

కేసుల తీరు ఇలా..

సింగపూర్‌లో ఏప్రిల్ 27-మే 3 మధ్య 14 వేల కేసులు వెలుగు చూడగా.. అంతకు ముందు వారం 11 వేల కేసులున్నట్లు ఆ దేశ ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య కూడా 102(అంతకు ముందు వారం)తో పోలిస్తే.. 133కు పెరిగినట్లు వివరించింది. అయితే.. ఐసీయూలో చేరికలు స్వల్పంగా ఉన్నట్లు తెలిపింది. అటు థాయ్‌లాండ్‌లో ఈనెల 11-17 మధ్య కాలంలో 33 వేల కేసులు నమోదయ్యాయి. ఒక్క బ్యాంకాక్‌లోనే 6 వేల కేసులున్నాయి. హాంకాంగ్‌లోనూ కొవిడ్ కేసులు గత నెల 6-12 తేదీల(6.21%)తో పోలిస్తే.. 13.66శాతానికి చేరుకుంది. చైనాలో పాజిటివిటీ రేటు 3.3% నుంచి 6.3శాతానికి పెరిగింది. భారత్‌లో కొవిడ్ కేసులు 257కు చేరడంతో వైద్య సేవల డైరెక్టర్ జనరల్(డీజీహెచ్ఎస్) సోమవారం నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్(ఎన్‌సీడీసీ), ఎమర్జెన్సీ మెడికల్ రిలీఫ్(ఈఎంఆర్), విపత్తు నిర్వహణ విభాగం, ఐసీఎంఆర్, కేంద్ర ప్రభుత్వాస్పత్రుల వైద్యాధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పీటీఐ ఓ కథనాన్ని ప్రచురించింది. భారత్‌లో కరోనా తీవ్రత పెద్దగా లేదని, మరణాల ముప్పు లేదని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది.



ఒప్పందం కుదరడంతో వివిధ దేశాల ప్రతినిధుల అభివాదం

అన్ని దేశాలకూ వ్యాక్సిన్లు

కరోనా తరహా విపత్తులను ఎదుర్కోవడంపై డబ్ల్యూహెచ్‌వో సభ్య దేశాల ఒప్పందం

జెనీవా, మే 20: భవిష్యత్తులో కరోనా వంటి మహమ్మారులు విజృంభిస్తే.. ఎలా ఎదుర్కోవాలన్న దానిపై డబ్ల్యూహెచ్‌వో సభ్యదేశాలు చరిత్రాత్మక ఒప్పందానికి వచ్చాయి. మంగళవారం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉన్న డబ్ల్యూహెచ్‌ఓ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో సభ్యదేశాల ప్రతినిధులు ఈ ఒప్పందంపై సంతకం చేశారు. కరోనా మహమ్మారితో ప్రపంచమంతా అతలాకుతలమైన క్రమంలో.. మరోసారి అలాంటి విపత్తు వస్తే ఎలా ఎదుర్కోవాలన్న దానిపై 2022లో డబ్ల్యూహెచ్‌ఓలో చర్చలు మొదలయ్యాయి. తాజాగా ఒప్పందం కుదిరింది. మొత్తం 135 సభ్యదేశాలకుగాను 124 దేశాలు అనుకూలంగా ఓటేయగా.. అమెరికా, రష్యా, ఇజ్రాయెల్ సహా 11 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. అయితే డబ్ల్యూహెచ్‌వోకు అత్యధికంగా నిధులు ఇచ్చే అమెరికా ఈ దూరంగా ఉండటంతో.. ఈ ఒప్పందం ఏమేర సఫలీకృతం అవుతుందన్న సందేహాలున్నాయి.

ఏమిటీ ఒప్పందం?

భవిష్యత్తులో ఏదైనా మహమ్మారి వస్తే.. దానికి సంబంధించిన వ్యాక్సిన్లు, ఔషధాలు, చికిత్సలు వంటివి ఏ దేశం అభివృద్ధి చేసినా కూడా.. అన్నిదేశాలకు అందుబాటులోకి తేవాలి. సభ్య దేశాల్లోని ఫార్మా సంస్థలు ఉత్పత్తి చేసే వ్యాక్సిన్లు, ఔషధాలు, టెస్ట్ కిట్‌లలో 20శాతం డబ్ల్యూహెచ్‌వోకు అందజేయాలి. వాటిని పేద దేశాలకు సరఫరా చేస్తారు. ఒప్పందంలోని నిబంధనలకు సభ్య దేశాలు స్వచ్ఛందంగా కట్టుబడి ఉండాలి.

న్యాయ వ్యవస్థలో తిమింగలాలు?

(మొదటి పేజీ తరువాయి)



నిలబడింది. ఢిల్లీలోని ఒక న్యాయమూర్తి అధికార నివాసంలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మార్చిలో జరిగితే ఇంతవరకు ఎఫ్ఐఆర్ లేదు. దీన్ని కూడా కాలక్రమంలో మరచిపోవాల్సి వస్తుందని జనం అనుకుంటున్నారు. ఇతర పౌరుల విషయంలో జరిగినట్లుగా నేర న్యాయ వ్యవస్థ న్యాయమూర్తుల విషయంలో ఎందుకు పని చేయడం లేదు? ఆ డబ్బులు ఎవరివి? ఎక్కడి నుంచి వచ్చాయి? లాంటి వివరాల కోసం జనం ఎదురు చూస్తున్నారు" అన్నారు. న్యాయ వ్యవస్థ కలుషితం అయ్యిందని, వర్మ కన్నా పెద్ద తిమింగలాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇప్పటివరకు సరిగానే వ్యవహరించిందని, ముగ్గురు న్యాయమూర్తుల కమిటీని వేయడం ద్వారా మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడారని చెప్పారు. జస్టిస్ గవాయ్ జస్టిస్ ఖన్నా బాటలో నడవాలని, నివేదికను బహిర్గతం చేయాలని సూచించారు. న్యాయమూర్తుల మీద ఆరోపణలు వచ్చినపుడు అంతర్గత విచారణ జరిపే సంప్రదాయానికి జస్టిస్ వెంకటస్వామి కేసులో 1991 నాటి సుప్రీంకోర్టు తీర్పు అవకాశం ఇచ్చిందని ధన్‌ఖడ్ చెప్పారు. ఆ తీర్పును పునస్సమీక్షించాలని డిమాండ్ చేశారు. నాటి తీర్పుతో న్యాయవ్యవస్థలో జవాబుదారీతనానికి, పారదర్శకతకు పాతర వేసినట్లు అయ్యిందని వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని దేవెగౌడతో సమావేశమైన ధన్‌ఖడ్ రైతులకు ఇచ్చే అన్ని రకాల సబ్సిడీలు నగదు రూపంలో బ్యాంకు ఖాతాల్లో వేయాలని అభిప్రాయపడ్డారు. ఇతర ఏ రకాలుగా ఇచ్చినా కొంత లంచాలకు పోతుందని వ్యాఖ్యానించారు.

నీ కడుపున ఎందుకు పుట్టానమ్మా!

» రెండున్నరేళ్ల బిడ్డపై బాయ్‌ఫ్రెండ్ అత్యాచారం చేస్తుంటే అడ్డుకోని తల్లి.. చిన్నారి మృతి

ముంబై, మే 20: ఆ తల్లిది గుండెనా.. బండరాయా? రెండున్నరేళ్ల కూతురిపై బాయ్‌ఫ్రెండ్ అత్యాచారం చేస్తుంటే ఆ ఘోరాన్ని కళ్లప్పగించి చూసింది తప్ప అడ్డుకునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు! ముంబైలోని మాల్వాని ప్రాంతంలో ఈ ఘోరం వెలుగుచూసింది. ఆ నిర్దయురాలైన తల్లి పేరు రీనా షేక్. ఆమె ప్రియుడు ఫర్హాన్ షేక్! ఇంతటి దారుణ అత్యాచారానికి గురయ్యాక ఆ పసిబిడ్డ ప్రాణాలు నిలుస్తాయా? చిన్నారిని ఆస్పత్రికి తీసుకెళితే ఆమె దయనీయ స్థితి చూసి వైద్యులే దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒంటినిండా తీవ్రగాయాలైన బాలికను పరీక్షించి ఆమె అప్పటికే చనిపోయిందని నిర్ధారించారు. వెంటనే పోలీసులను అప్రమత్తం చేశారు. అంతకు ముందు రీనా షేక్ వైద్యులను తప్పుదోవపట్టించేందుకు శతవిధాలా ప్రయత్నించింది. పదే పదే ఫిట్స్ రావడంతో చిన్నారి అపస్మారక స్థితిలోకి వెళ్లిదందని వైద్యులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించింది. అప్పటికే వైద్యులిచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులకు దిగ్భ్రాంతికరమైన వాస్తవం తెలిసింది. మాతృమూర్తి రీనా సమక్షంలోనే చిన్నారిపై ఫర్హాన్ అత్యాచారానికి ఒడిగట్టాడని.. ఆమె అడ్డుకునేందుకు ప్రయత్నించలేదని పోలీసులు నిర్ధారించారు. రీనా, ఫర్హాన్‌కు అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు.

7నెలల్లో 25 పెళ్లిళ్లు!

» వివాహమయ్యాక బంగారంతో జంప్

» భోపాల్‌లో ఓ నిత్యపెళ్లి కూతురి లీలలు



భోపాల్, మే 20: పెళ్లంటే? పందిళ్లు.. సందళ్లు! ఆమెకు మాత్రం పెళ్లి ఈడు అబ్బాయిలను నిండా ముంచేందుకు ఉపయోగపడే అస్త్రం!! పెళ్లి మీద పెళ్లి.. మరో పెళ్లి.. ఇలా ఏడు నెలల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 25 మంది యువకులను పెళ్లాడింది. వివాహమయ్యాక కొన్నాళ్లకు ఇంట్లోని నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులన్నీ మూటగట్టుకొని అక్కడి నుంచి జంప్ అవుతుంది. భోపాల్‌కు చెందిన 23 ఏళ్ల అనురాధా పాశ్వాన్ అనే యువతి లీలలివి! పెళ్లి సంబంధాల పేరుతో యువకులకు వల వేసేందుకు అనురాధ ప్రత్యేకంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుంది. పెళ్లి సంబంధం కుదర్చడానికి ఏజెంట్ల రూపంలోని ఆ ముఠా సభ్యులు కమీషన్ కింద రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు తీసుకోవడంతో దోపిడీ మొదలవుతుంది. తనను మెచ్చి.. వచ్చే యువకుడిని కోర్టులో చట్టపరమైన ప్రక్రియ మధ్య అనురాధ పెళ్లాడుతుంది. ఏప్రిల్ 20న ఇలానే రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపూర్‌కు చెందిన విష్ణు శర్మ అనే యువకుడిని పెళ్లాడింది. మే 2న ఇంట్లోని విలువైన వస్తువులతో చెక్కేసింది. విష్ణు శర్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ నిత్య పెళ్లికూతురి బాగోతం వెలుగులోకొచ్చింది. అనురాధతో పెళ్లి ఖాయం చేసినందుకు సునీత, పప్పు, మీనా బృందానికి తాను రూ.2లక్షలు ఇచ్చానని ఫిర్యాదులో శర్మ పేర్కొన్నాడు. అనురాధను ఆమె తరహాలోనే పోలీసులు బోల్తా కొట్టించి అదుపులోకి తీసుకోవడం విశేషం. ఓ కానిస్టేబుల్‌ను వరుడు అని చెబుతూ ఆయన ఫొటోను వాట్సాప్‌లో ఆమెకు పంపారు. అనురాధ స్పందించడం.. చెప్పినచోటుకు రమ్మనడంతో అక్కడికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనురాధ స్వస్థలం యూపీలోని మహారాజ్ గంజ్. భర్తతో గొడవల కారణంగా అతడితో విడిపోయి.. భోపాల్‌కు మకాం మార్చింది.

ఐబీ చీఫ్ తపన్ డేకా పదవీ కాలం పొడిగింపు



న్యూఢిల్లీ, మే 20: ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) చీఫ్ తపన్ కుమార్ డేకా పదవీకాలాన్ని కేంద్రం మరోసారి పొడిగించింది. కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన పదవీ కాలం మరో ఏడాది పొడిగింపునకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2026 జూన్ వరకు ఆయన ఐబీ చీఫ్‌గా కొనసాగనున్నారు. హిమాచల్ ప్రదేశ్ కేడర్‌కు చెందిన డేకా 1988 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. 2022లో ఐబీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

చిత్రజ్యోతి

SINCE 1965

షూటింగ్‌లో రాశీ ఖన్నాకు గాయాలు

నటి రాశీ ఖన్నా షూటింగ్‌లో గాయపడ్డారు. ఆమె ముఖానికీ, చేతి వేళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ఆమె సోషల్‌మీడియా ద్వారా తెలిపారు. "కొన్ని పాత్రలు గాయాల్ని డిమాండ్ చేస్తాయి. ఆ గాయాలను లెక్కచేయకూడదు. మనమే ఒక తుపానుగా మారినప్పుడు ఏ పిడుగూ మనల్ని ఆపలేదు" అని పేర్కొన్నారు. ఆమెకు ఈ గాయాలు 'ఫర్జీ 2' వెబ్ సిరీస్ షూటింగ్ సమయంలో అయినట్లు తెలుస్తోంది. కాగా, షాహిద్ కపూర్, విజయ్‌సేతుపతి, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన సిరీస్ 'ఫర్జీ'. ప్రస్తుతం రెండో సీజన్ షూటింగ్ జరుగుతోంది.





ఎన్టీఆర్ బాలీవుడ్‌లోకి ఘనంగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'వార్ 2'. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. వైఆర్ఎఫ్ 'స్పై యూనివర్స్'లో భాగంగా ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14న విడుదలవుతోంది. మంగళవారం ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసి ఫ్యాన్స్‌ను ఖుషీ చేశారు మేకర్స్. ఆకట్టుకునే సంభాషణలు, అద్భుతమైన విజువల్స్‌తో 95 సెకన్ల పాటు సాగిన ఈ టీజర్ యాక్షన్ ప్రియులను అలరించేలా ఉంది. ముఖ్యంగా, ఎన్టీఆర్, హృతిక్ మధ్య వచ్చే పోరాట సన్నివేశాలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. కియారా అద్వానీ కథానాయిక.

పోలీస్‌గా మంచు మనోజ్



మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన కథానాయకుడిగా నటిస్తున్న కొత్త సినిమాను అధికారికంగా ప్రకటించారు. పరిశోధనాత్మక ఉత్కంఠభరిత కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రానికి 'రక్షక్' అనే శక్తిమంతమైన పేరు పెట్టారు. శ్రీనిధి క్రియేషన్స్ బ్యానర్‌పై నూతన దర్శకుడు నవీన్ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో మనోజ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ఆసక్తిని కలిగించింది. మనోజ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. పోస్టర్‌పై 'దాచిన నిజం శాశ్వతంగా దాగి ఉండదు' అనే ట్యాగ్‌లైన్ కథలోని మిస్టరీని సూచిస్తోంది. సెకండ్ ఇన్నింగ్స్‌లో చాలా బిజీగా ఉన్న మంచు మనోజ్ ప్రస్తుతం 'భైరవం', 'మిరాయ్' సినిమాల్లో నటిస్తున్నారు. ఇప్పుడు 'రక్షక్' చిత్రంతో మళ్లీ హీరోగా అలరించేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను తెలియజేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.



వినోదాత్మక చిత్రం

ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న వినోదాత్మక చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్‌జే మూవీస్ బేనర్‌పై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య దర్శకుడు మారుతి ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ 'ఈ సినిమాకు టైటిల్‌తోనే విజయం సాధించారు. సినిమా కూడా బాగుంటుందనే ఫీల్ కలుగుతోంది. కచ్చితంగా ఈ చిత్రం ప్రవీణ్ కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుంది' అని అన్నారు. ప్రవీణ్ మాట్లాడుతూ 'మారుతి చేతుల మీదుగా మా ట్రైలర్ రిలీజ్ అవడం సంతోషంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు ఎస్‌జే శివ మాట్లాడుతూ 'ఈ చిత్రం ద్వారా ప్రవీణ్‌ను హీరోగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు. 'ఈ సినిమాలో కేజీఎఫ్ గరుడ పాత్ర అందరికీ నచ్చుతుంది' అని నిర్మాత జనార్ధన్ ఆచారి చెప్పారు.

మళ్లీ వస్తున్న మాయాబజార్



తెలుగువారు ఇష్టపడే క్లాసిక్ చిత్రాల వరుసలో 'మాయాబజార్' ముందు స్థానంలో ఉంటుంది. తరాలు గడుస్తున్నా ఈ సినిమాపై వారికి ఉన్న ఆదరాభిమానాలు ఏ మాత్రం తగ్గలేదు సరికదా రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇటీవల రీరిలీజ్‌ల ట్రెండ్ ఊపందుకున్న తరుణంలో ఈ చిత్రాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఈ నెల 28న ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా కలర్ వెర్షన్‌లో బలుసు రామారావు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టీడీ జనార్ధన్ మాట్లాడుతూ "తెలుగు సినిమా చరిత్రలో ఈ సినిమాది ప్రత్యేక స్థానం. ఇప్పటితరానికి ఈ సినిమా ఓ మైలురాయిలాంటిది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రమేశ్ ప్రసాద్, దర్శకులు ఎస్వీకృష్ణారెడ్డి, వీరశంకర్, త్రిపురనేని చిట్టి తదితరులు పాల్గొన్నారు.



కీరవాణికి పవన్‌కల్యాణ్ అభినందన

'సలసల మరిగే నీలోని రక్తమే..' అనే పాటకు సంగీత సాహిత్యాలతో కీరవాణి ప్రాణం పోశారని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందించారు. మంగళవారం ఉదయం తనని కీరవాణి కలసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తను హీరోగా నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రానికి కీరవాణి అందించిన సంగీతం, నేపథ్య సంగీతం కథలోని భావోద్వేగాలను శిఖరస్థాయికి తీసుకెళ్లాయని ఆయన చెప్పారు. 'మొదటిసారి మీతో చేస్తున్నాను అంటే అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకు తగ్గట్లు ఉండాలి కదా' అని కీరవాణి చెప్పడం ఆయన అంకితభావాన్ని తెలియజేస్తుంది' అన్నారు పవన్‌కల్యాణ్.

శక్తిమంతమైన యోధుడు



తేజ సజ్జా హీరోగా కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'మిరాయ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తేజ సజ్జా సూపర్ యోధగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా మేకోవర్ అయ్యారు. అలాగే మంచు మనోజ్ విలన్‌గా, రీతికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన కొత్త షెడ్యూల్ ముంబైలోని చారిత్రక గుహల్లో ప్రారంభమైంది. తేజతో పాటు కొన్ని ప్రధాన నటీనటులు ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టులో ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది భాషల్లో విడుదల చేసేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన తేజ సజ్జా, మంచు మనోజ్ ఫస్ట్‌లుక్ పోస్టర్లు, స్పెషల్ గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి.

సందేశాత్మక కథతో...



రఘుబాబు, బలగం సత్యనారాయణ, విజయలక్ష్మీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కలివివనం'. రాజ్‌నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిర్మించారు. నాగదుర్గ హీరోయిన్. పూర్తిగా తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో సాగనున్న చిత్రమిదని మేకర్స్ చెప్పారు. అడవులను రక్షించుకోవాలని గొప్ప సందేశం ఇచ్చే కథతో తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని తెలిపారు. త్వరలోనే విడుదల కానుంది.

సైనికుల సత్తాను తక్కువ చేసే కుట్ర

- ఆర్మీ విజయాలను కాంగ్రెస్ స్వాగతించలేకపోతోంది
- ఇది దివాళాకోరు మనస్తత్వం: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌ను చిన్న యుద్ధం అని పేర్కొంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మన సైనికుల సత్తాను తక్కువ చేసి చూపించాలనుకుంటున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఈ ఆపరేషన్ గొప్పదనం గురించి భారత్ సహా ప్రపంచమంతా మాట్లాడుతుంటే.. కాంగ్రెస్ నాయకులు ఎందుకు ఉలిక్కిపడుతున్నారో అర్థం కావడం లేదని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఆర్మీ బలోపేతాన్ని విస్మరించారని, అధికారం కోల్పోయినా ఆర్మీ సాధిస్తోన్న విజయాలను స్వాగతించలేకపోతున్నారని తెలిపారు. ఇది కాంగ్రెస్ దివాళాకోరు మనస్తత్వానికి, మానసిక రుగ్మతకు నిదర్శమని కిషన్‌రెడ్డి ఎక్స్ వేదికగా విమర్శించారు. కాంగ్రెస్‌లో విలీనం అయ్యేందుకు బీఆర్ఎస్ ఒప్పందం చేసుకుందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. ఈ మేరకు ఇరు పార్టీల నాయకుల మధ్య రాజీ కుదిరిందని అన్నారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

అంగన్‌వాడీలకు పూర్తి జీతం చెల్లించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ లేఖ



హైదరాబాద్/నంగునూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను అంగన్‌వాడీలుగా గుర్తించి, పూర్తి జీతం చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సీతక్క.. మినీ అంగన్‌వాడీలను అంగన్‌వాడీలుగా గుర్తిస్తూ మొదటి సంతకం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిపై 2023 డిసెంబరు 15న ప్రభుత్వం జీవో జారీ చేసిందని.. 2024 జనవరి నుంచి మార్చి వరకు వారికి అంగన్‌వాడీ పే గ్రేడ్‌లో రూ.13,650 జీతం చెల్లించిన ప్రభుత్వం, ఆ తర్వాత రూ.7,800కు జీతాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. 2025 మేలో 8 జిల్లాల్లోని మినీ అంగన్‌వాడీలకు అంగన్‌వాడీ పేగ్రేడ్ జీతాలు చెల్లించి, మిగతా జిల్లాల వారికి ఇవ్వలేదని చెప్పారు. మినీ అంగన్‌వాడీలకు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న జీతాలను పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ హరీశ్‌రావు సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ రాశారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని, తెలంగాణకు పూర్వ వైభవం రావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లానాగరాజుపల్లిలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో హరీశ్ పాల్గొన్నారు.

లేఖలు కాదు 'బహిరంగ' క్షమాపణ చెప్పండి

- మాజీ మంత్రి హరీష్‌రావుకు మంత్రి సీతక్క డిమాండ్



హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): అధికారం పోయాక మినీ అంగన్‌వాడీల సమస్య గుర్తుకు వచ్చిందా? అని మాజీ మంత్రి టి.హరీష్‌రావును మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి దాసరి అనసూయ సీతక్క ప్రశ్నించారు. అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలపై సీఎం ఎ.రేవంత్ రెడ్డికి హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. ముందుగా బహిరంగ లేఖలు రాయడం మానుకుని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో బాధపడ్డ ప్రజలకు హరీష్ రావు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆమె మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీ టీచర్ల పట్ల బాధ్యత ఉంటే పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు వారికి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ఎందుకు పదోన్నతి కల్పించలేదని నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆర్థికశాఖ అనుమతుల్లేకుండా మొక్కుబడి జీవోలు జారీ చేసి చేతులు దులుపుకున్న చరిత్ర, అంగన్‌వాడీలకు పదోన్నతులు రాకుండా అన్యాయం చేసిందీ ఆయనదేనని విమర్శించారు. కానీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవిష్యత్తులో ఎలాంటి న్యాయ పరమైన అడ్డంకులు తలెత్తకుండా ఆర్థికశాఖ అనుమతితో 3,438 మంది మినీ అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతులు కల్పించామని సీతక్క గుర్తు చేశారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు టీచర్లకు తోడు సహాయకులను నియమిస్తున్నట్లు తెలిపారు.

అందాల భామల వెంట సొల్లుకార్చుకుంటూ తిరుగుతున్న మంత్రులు

- ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించేది ఇందుకేనా?
- దేశానికి డిఫ్యాక్టో ప్రధానిలా ట్రంప్: నారాయణ

హైదరాబాద్, మే20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరం అంతా ఇప్పుడు అందాల భామల చుట్టూ తిరుగుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఎద్దేవా చేశారు. భామల వెంట మంత్రులంతా సొల్లు కార్చుకుంటూ తిరుగుతున్నారన్నారని ఆయన వ్యాఖ్యానించారు. రూ.కోట్లు ఖర్చు చేసి ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించేది సొల్లుకార్చుకోడానికా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. మన దేశానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డిఫ్యాక్టో ప్రధాన మంత్రిగా వ్యవహరిస్తున్నారని, మోదీ డమ్మీ ప్రధానిగా మారిపోయారని ఎద్దేవా చేశారు. అమెరికా అధ్యక్షుడి ఆదేశాలను మోదీ పాటించడం దేశానికి అవమానకరమని నారాయణ అన్నారు. కాగా, ఆపరేషన్ కగార్ పేరుతో ఎంతమంది మావోయిస్టులను చంపేశారో, కేంద్ర ప్రభుత్వ లక్ష్యం ఏమిటో శ్వేత పత్రం విడుదల చేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కగార్ ఆపరేషన్‌లో తెలంగాణ పోలీసులు కూడా పాల్గొంటున్నారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం కూడా తెలపాలని కోరారు. అసెంబ్లీ ఎదురుగా ప్రకాశం పంతులు విగ్రహం అనాథలా ఉందని, దానిని మరో ముఖ్యమైన ప్రాంతానికి మార్చాలని సీఎం రేవంత్‌ను కూనంనేని కోరారు. ధర్మభిక్షం పేరును సూర్యాపేట జిల్లాకు పెట్టాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

సమాచార కమిషనర్ల నియామకంలో బీసీలకు న్యాయం చేయాలి: జాజుల

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): సమాచార కమిషనర్ల నియామకంలో బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం మంగళవారం టీపీసీసీ అధ్యక్షులడు మహేష్ కుమార్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించింది. జనాభా దామాషా ప్రకారం నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. మిగిలిన సమాచార కమిషనర్ పోస్టుల భర్తీలో అర్హులైన బీసీలను నియమించాలన్నారు. లేని పక్షంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ప్రతినిధుల బృందంలో బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్ తదితరులు ఉన్నారు.

మాతృభాషతో.. మరింత అందంగా..!

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం టీ-హబ్‌లో ప్రారంభమయ్యాయి. ఇందులో ప్రతి పోటీదారుకు కేటాయించిన 4 నిమిషాల సమయంలో తాము ఎంచుకున్న 'సేవా కార్యక్రమం (బ్యూటీ విత్ పర్పస్)' గురించి వివరించాల్సి ఉంటుంది. తొలిరోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన పోటీలో మూడు ఖండాలకు చెందిన 50 మంది పాల్గొన్నారు. వీరిలో 8 మంది తమ మాతృభాషలో ప్రసంగించారు. 'నా భాష.. నా గుర్తింపు.. నా ఆత్మాభిమానం.. నా ప్రజల భాషను నేడు ప్రపంచానికి పరిచయం చేస్తున్నందుకు గర్వంగా ఉంద'ంటూ మాట్లాడారు. బొలీవియాలో స్పానిష్‌తోపాటు మరో 12 స్థానిక భాషలు మాట్లాడతారు. అయితే మిస్ వరల్డ్ బొలీవియా ఓల్గా కావేజ్ అందులో అతి తక్కువ మంది మాట్లాడే స్థానిక భాషలో ప్రసంగించారు. నికరాగ్వా సుందరి వర్నానియా రోడ్రిగజ్ తన మాతృభాష 'మిస్కిటో'లో మాట్లాడారు. ఇలా మాతృభాషలో ప్రసంగించే విషయాన్ని వారు ముందుగా నిర్వాహకులకు తెలపడంతో.. అనువాదకులను ఏర్పాటు చేశారు. మంగళవారం ప్రసంగించిన 50 మందిలో చాలా మంది 'నమస్తే ఇండియా' అంటూ ప్రాంభించడం గమనార్హం. 'బ్యూటీ విత్ పర్పస్' కార్యక్రమంలో భాగంగా పోటీదారులు తమ సామాజిక సేవ ఆలోచనలను పంచుకున్నారు.

అందమైన ఆలోచనలతో సేవ దిశగా..

- 2024 యూనిసెఫ్ నివేదిక ప్రకారం అర్జెంటీనాలో 70లక్షల మంది చిన్నారులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. వారిలో 15 లక్షల మంది ఆకలితో అలమటిస్తున్నారు.. వారికోసం ప్రత్యేక ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవ చేస్తున్నట్టు అర్జెంటీనా సుందరి తెలిపారు.
- తమ దేశంలో కాలేయ, కిడ్నీ సంబంధిత మరణాలు ఎక్కువని.. ఆ సమస్యల బారినపడకుండా అవగాహన కల్పిస్తున్నానని బొలీవియా సుందరి చెప్పారు.



మిస్ వరల్డ్ పోటీదారులతో కిమ్స్ చైర్మన్ భాస్కర్‌రావు, డాక్టర్ రఘురామ్

- 'విప్లవాలు ఆయుధాలతో కాదు పెన్ను, పుస్తకాలతో వస్తాయని నమ్ముతా. అందుకే ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నా. 16 ఏళ్ల వయసు నుంచే వలంటీర్‌గా సేవలు అందిస్తున్నా' అని బ్రెజిల్ ప్రతినిధి జెస్సికా పిడ్రోజ్ చెప్పారు.
- మెక్సికో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లేక యువత నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారని.. చిన్నచిన్న విషయాల్లో జరిగే ఘర్షణల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని.. ఈ పరిస్థితిని మార్చేందుకు యువతకు కౌన్సెలింగ్ అందిస్తున్నానని మెక్సికో సుందరి తెలిపారు.
- తాను ఒకప్పుడు బార్ డ్యాన్సర్ అని, తర్వాత అందులోంచి బయటపడ్డానని కేమెన్ ఐలాండ్స్‌కు చెందిన జెడా రమూన్ చెప్పారు. తన దేశ మహిళలకు తన జీవితం స్ఫూర్తిగా ఉండాలన్న లక్ష్యంతో పోటీల్లో పాల్గొంటున్నానని వివరించారు.

కిమ్స్ ఆస్పత్రికి అందాల భామలు

ప్రపంచ సుందరి పోటీలో ఉన్న సుందరీమణులు కొందరు మంగళవారం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్, కిమ్స్-ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్‌ను పరిశీలించి.. అక్కడ చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కిమ్స్ ఆడిటోరియంలో ఆస్పత్రి వైద్య నిపుణులు, పీజీ, నర్సింగ్ విద్యార్థులతో మాట్లాడారు. కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటే యావత్ కుటుంబం ఆరోగ్యంగా ఉన్నట్టేనని.. మహిళలు ఆరోగ్యంగా ఉండేలా కుటుంబ సభ్యులు చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు, డాక్టర్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీ ప్రమాదం కలచివేసింది

పాతబస్తీ అగ్ని ప్రమాద సంఘటన కలచివేసిందని మిస్ వరల్డ్ కెనడా ఎమ్మా మారిసన్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు పెట్టారు. "ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోవడం, అందులో 8 మంది చిన్నారులు ఉండటం మరింత బాధాకరం. మమ్మల్ని ఈ ప్రాంతవాసులు ఆత్మీయంగా ఆహ్వానించారు. ఇప్పుడు వారు తీవ్రవేదనలో ఉండటం చూసి తన గుండె బద్దలైంది" అని పేర్కొన్నారు.

మిస్ వరల్డ్‌లో 'టాలెంట్ హంట్'!

ఇరవై రోజులుగా సాగుతున్న మిస్ వరల్డ్ పోటీల్లో కీలక దశ ప్రారంభమైంది. ఆడుతూ పాడుతూ, పర్యాటక ప్రాంతాల్లో తిరుగుతూ సాగిన అందాల పోటీలు.. మంగళవారం నుంచి రసవత్తరంగా మారాయి. మొత్తం 6 విభాగాలు.. ఎత్తు, శరీర ఆకృతి ఆధారంగా గుర్తించే బ్యూటీ.. క్రీడల్లో ప్రతిభను చాటే స్పోర్ట్స్.. ఆకట్టుకునేలా ఫ్యాషన్.. వ్యాపార ఆలోచనలు తెలిపే బిజినెస్.. సామాజిక సేవ గురించి వివరించే హెడ్ 2 హెడ్.. అప్పటికప్పుడు ప్రశ్నలకు వెంటనే సమాధానాలు చెప్పాల్సిన '1 ఆన్ 1' పోటీలు ఉంటాయి. ప్రతి పోటీలో ప్రతిభ ఆధారంగా 1 నుంచి 107 వరకు ర్యాంకులు ఇస్తారు. అన్ని విభాగాల్లో టాప్-40లో ఉన్నవారు చివరివరకు పోటీలో నిలుస్తారు. స్పోర్ట్స్‌లో టాప్-40 జాబితాను అంతర్గతంగా ఇప్పటికే ప్రకటించారు. హెడ్ 2 హెడ్ పోటీలు బుధవారం సాయంత్రం ముగుస్తాయి. ఇలా ఆరు విభాగాల్లో పోటీలు ముగిశాక.. టాప్-40 జాబితాను ప్రకటిస్తారు. తుది పోటీలు ఈనెల 31న జరగనున్నాయి.

నేడు శిల్పారామంలో సుందరాంగుల సందడి

ప్రపంచ సుందరి పోటీలో ఉన్న అందాల భామలు బుధవారం సాయంత్రం శిల్పారామంలో సందడి చేయనున్నారు. తెలంగాణ గ్రామీణ హస్తకళ ఉత్పత్తులు మృణ్మయపాత్రలు, బొమ్మలు, రంగవల్లులు, అల్లికలు, బుట్టబొమ్మలు ఇతర ఉత్పత్తులను పరిశీలించనున్నారు.

కూల్‌గా కొల్లగొట్టారు!

- ఏపీ మద్యం స్కామ్‌లో మతిపోగొట్టే 'స్కీమ్'
- తొలి ఆరునెలలు మాత్రమే కమీషన్ల కిక్కు
- ఆ తర్వాత... 'అదనంగా' పైసా వసూల్
- వెయ్యి విలువైన మద్యానికి రూ.1600 చెల్లించడం...
- అదనంగా ఇచ్చిన రూ.600 సొంతానికి మళ్లించడం
- అలా ఇచ్చి, పుచ్చుకున్నది ప్రజా ధనమే
- మొత్తం చేతులు మారింది రూ.3113 కోట్లు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ముడుపులే లక్ష్యంగా, ముడుపుల కోసం, ముడుపుల చుట్టూ తిరిగేలా రూపుదిద్దుకున్నదే మద్యం పాలసీ! దానిని రూపొందించింది, అమలు చేసింది వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో! దాని పాత్రధారులు, సూత్రధారులు ఒకొక్కరుగా అరెస్టవుతున్నారు. ఈ వేడి మెల్లగా 'తాడేపల్లి ప్యాలెస్'నూ తాకుతోంది. అప్పుడు ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన మద్యం స్కామ్ గులకరాయిలాంటిదైతే... జగన్ హయాంలో జరిగింది పెద్ద కొండంత! ఒక 'పథకం' ప్రకారం పకడ్బందీగా సాగిన కుంభకోణమిది! ప్రభుత్వమే మద్యం వ్యాపారం చేయాలన్నదీ ఇందులో కీలకం! దాని ద్వారా వేల కోట్లు మింగేశారు! మద్యం కంపెనీలు తమకు వచ్చిన ఆదాయంలోంచి కట్టిన ముడుపులు మాత్రమే కాదు! అంతకుమించి చాలా ఉంది! ప్రజల సొమ్మును మద్యం కంపెనీలకు 'అదనం'గా చెల్లించి... అదే డబ్బును తిరిగి 'ప్యాలెస్'కు తరలించిన అత్యంత నీచమైన, దారుణమైన కుంభకోణమిది!

అప్పుడెప్పుడో బోఫోర్స్ స్కామ్ నుంచి... తాజాగా ఢిల్లీలో జరిగిన లిక్కర్ స్కామ్ దాకా.. స్వతంత్ర భారత దేశంలో ఎన్నో కుంభకోణాలు వెలుగు చూశాయి. కానీ... వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన మద్యం కుంభకోణానికి మరేదీ సాటి రాదు! ఇది... 'మదర్ ఆఫ్ ఆల్ స్కామ్స్' అని ఆర్థిక నిపుణులే చెబుతున్నారు. 'సరుకు ఆర్డర్ ఇచ్చారు. కమీషన్లు పుచ్చుకున్నారు. ఇది ఇద్దరి మధ్య జరిగిన వ్యవహారం. మద్యం కంపెనీలు తమ లాభంలోంచి తీసి కొంత మొత్తాన్ని కమీషన్లుగా చెల్లించాయి. ప్రభుత్వ ఖజానాకు వచ్చిన నష్టమేమిటి?' అని అమాయకంగా ప్రశ్నించే వాళ్లూ ఉన్నారు. కానీ... జగన్ హయాంలో మద్యం స్కామ్ రెండు దశల్లో నడిచింది. మొదటి దశలో... ఒక్కో కేసుకు ఇంత చొప్పున కమీషన్ ఫిక్స్ చేసి, మద్యం తయారీదారుల నుంచి ముడుపులు పిండుకున్నారు. రెండో దశలో నడిచిందే కీలకం! అది.. ప్రభుత్వ సొమ్మును మద్యం కంపెనీలకు 'అదనం'గా ఇచ్చి, అదే మొత్తాన్ని తమ 'ప్యాలెస్'కు మళ్లించారు. ప్రభుత్వ ధనం అంటే ప్రజా ధనమే! దానినే... సొంతానికి మింగేశారు.

కమీషన్లతో మొదలుపెట్టి..

జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో సుమారు రూ.3100 కోట్లు చేతులు మారాయి. ప్రభుత్వం ద్వారా మద్యం దుకాణాలు నడపాలన్నది ఒక 'మాస్టర్ ప్లాన్'. ప్రైవేటు మద్యం దుకాణాలతో ముడుపులు లభించే అవకాశం లేదు. మహాఅయితే... తమ నేతలు, అనుచరులకు షాపులు దక్కుతాయి. వాటి ఆదాయమూ వారికే వస్తుంది. కానీ... 'మాకేంటి' అని నాటి ప్రభుత్వ పెద్దలు ఆలోచించారు. అందుకే... ప్రభుత్వ మద్యం షాపులు తీసుకొచ్చారు. 2019 ఏడాది చివరి నుంచే వైసీపీ పెద్దలు మద్యం కంపెనీలతో బేరసారాలు ప్రారంభించారు. 'సరుకు మీదే. కానీ... షాపులు ప్రభుత్వానివి. వాటిలో మీ మద్యం అమ్మితే కేసుకు ఎంత ఇస్తారు?' అని ప్రశ్నించారు. లిక్కర్‌కు రూ.200, బీరుకు రూ.50 చొప్పున తమకు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎప్పుడూ ప్రభుత్వ పెద్దలు ఇలా మద్యం కంపెనీలను ముడుపులు అడిగింది లేదు. తొలిసారి ఈ మాట విని... మద్యం కంపెనీలు అవాక్కయ్యాయి. కమీషన్లు ఇచ్చుకోవడం ఇష్టంలేని కంపెనీలు... ఏపీలో వ్యాపారం వదులుకున్నాయి. కొన్ని కంపెనీలు మాత్రం వైసీపీ పెద్దలు అడిగిన మేరకు ముడుపులు సమర్పించుకున్నాయి. ఇందులో భాగంగా చిల్లర, నాసిరకం మద్యం బ్రాండ్లూ రంగ ప్రవేశం చేశాయి. ఇలా మొదటి ఆరు నెలలపాటు కంపెనీలు వైసీపీ నేతలకు కమీషన్లు చెల్లించాయి. అంటే... ఇది తమకు వచ్చే లాభంలోంచి సమర్పించుకున్న ముడుపు! ఇది లిక్కర్ స్కామ్‌లో మొదటి దశ! అసలు సినిమా... రెండో దశలోనే ఉంది!

జనం సొమ్ము... 'జగన్'కే!?

కమీషన్లు తీసుకుంటున్న క్రమంలోనే... నాటి ప్రభుత్వ పెద్దలకు మరో ఆలోచన వచ్చింది. అన్ని కంపెనీల నుంచి పక్కాగా ముడుపులు వసూలు చేసేలా... మద్యం స్కామ్‌లో రెండో దశ మొదలైంది. మొదటి ఆరు నెలలు కంపెనీలు సొంత డబ్బును ముడుపులుగా చెల్లిస్తే, మిగిలిన నాలుగేళ్ల పాటు ప్రజా ధనమే మద్యం కంపెనీల ద్వారా తాడేపల్లికి వెళ్ళింది. వంద విలువైన మద్యాన్ని జగన్ ప్రభుత్వం 160కి కొనుగోలు చేసింది. అదనంగా చెల్లించిన రూ.60ని కంపెనీల నుంచి వైసీపీ పెద్దలు తిరిగి తీసుకున్నారు. ఉదాహరణకు... మాన్షన్ హౌస్ బ్రాండీని పొరుగునే ఉన్న తెలంగాణ ప్రభుత్వం కేసును రూ.1083తో కొనుగోలు చేయగా... ఏపీ ప్రభుత్వం అదే బ్రాండ్ మద్యం కేసుకు రూ.1695 చెల్లించింది. అదనంగా ఒక్క కేసుకు దాదాపు రూ.600. ఇలా అదనంగా చెల్లించిన మొత్తం తిరిగి తాడేపల్లికి చేరిందన్న మాట! ఇలా... మొత్తం కుంభకోణంలో లిక్కర్‌పై రూ.2861 కోట్లు, బీరుపై రూ.252 కోట్లు 'అదనం'గా చేతులు మారాయి. ఇది... మద్యం కంపెనీల సొంత సొమ్ము కాదు! అచ్చంగా... ప్రజా ధనం!

ముడుపులపై మొదట్లోనే ఒత్తిడి

వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే మద్యం కంపెనీలపై ముడుపుల ఒత్తిళ్లు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో మద్యం అమ్ముకోవాలంటే కప్పం కట్టాల్సిందేనని వైసీపీ వర్గాలు తేల్చేశాయి. దానికి అంగీకరించని కంపెనీలకు ఆర్డర్లు ఆగిపోయాయి. రాష్ట్రంలో అత్యధికంగా అమ్ముడుపోయే కింగ్‌ఫిషర్ బీరు 2018-19లో రాష్ట్రంలో 1.02 కోట్ల కేసులు అమ్మితే, 2023-24లో కేవలం 11.82లక్షల కేసులు అమ్మారు. అంటే 2018-19లో అమ్మినదాంతో పోలిస్తే కేవలం 11.54శాతం మాత్రమే. అదే నాకౌట్, బడ్వైజర్ కంపెనీల బీర్లు అయితే మొత్తంగా కనిపించకుండా పోయాయి. అదే సమయంలో... బ్రిటీష్ ఎంపైర్, బీరా 91 బూమ్, బ్లాక్ బస్టర్ అల్ట్రా కంపెనీల బీర్ల అమ్మకాలు భారీగా పెరిగిపోయాయి. ఇక... పాపులర్ లిక్కర్ బ్రాండ్ మెక్‌డోవెల్స్ నంబర్-1 బ్రాందీ 2023-24లో కేవలం 5 కేసులు అమ్ముడైంది. ఇంపీరియల్ బ్లూ కేవలం ఏడు కేసులే అమ్మింది. అవే బ్రాండ్లు 2018-19లో 20లక్షలకు పైగా కేసులు అమ్ముడయ్యాయి. ఇక... 2018-19లో ఒక్క కేసు కూడా అమ్ముడుపోని సిరీస్ క్లాసిక్ బ్లూ ఫైనెస్ట్ విస్కీ, గ్రేసన్స్ సిల్వర్ స్ట్రిప్స్, రాయల్ ప్యాలెస్, ఓల్డ్ టైమర్ బ్లూ క్లాసిక్ విస్కీ, గ్రేసన్స్ కింగ్స్‌వెల్ సెలెక్ట్ ఇండియన్ బ్రాందీలు జగన్ హయాంలో లక్షల కేసులు విక్రయించాయి. దీనికి ఒకటే కారణం... ముడుపులు ఇచ్చేందుకు, తమ 'అదనపు స్కీమ్'కు సహకరించిన వారికే ఆర్డర్లు!

మరిన్ని గోదాములు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం

- ఆర్ఐడీఎఫ్, నాబార్డ్ నిధులను వినియోగించండి: మంత్రి తుమ్మల



హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఆర్ఐడీఎఫ్), జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) నిధులను ఉపయోగించి మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో గోదాములు, కోల్డ్ స్టోరేజీల సామర్థ్యాన్ని పెంచుతూ, మరిన్ని నిర్మించాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మార్కెటింగ్, ఆయిల్ ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు మాత్రమే ఉత్పత్తులను అమ్ముకునేలా రైతుబజార్లను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం మార్కెట్లు, రైతుబజార్లలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అలాగే మే నెలాఖరు వరకు 2 లక్షల మట్టి నమూనాల సేకరణ పూర్తి చేసి, వాటి ఫలితాలు రెండు నెలలలోపు రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి ఇప్పటికే లక్ష మెట్రిక్ టన్నుల జొన్నలను సేకరించామని, ప్రభుత్వానికి నష్టం వాటిల్లినా రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రాష్ట్ర స్థాయి కమిటీ ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) సీఈఓల బదిలీలకు వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అలాగే 311 సహకార సంఘాలను ఉన్నతీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. సహకార సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లకు సంబంధించిన అక్రమాలపై విచారణ పూర్తి చేసి, సర్‌చార్జి ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు రూ.6.38 కోట్ల రికవరీ పూర్తయిందని, ఇంకా రూ. 19 కోట్లు రికవరీ చేయాల్సి ఉందని, అలాగే 74 సంఘాల సర్‌చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు నివేదిక సమర్పించారు. పదేళ్లుగా అపెక్స్ సహకార సంఘాల ఆడిట్ ఎందుకు జరగలేదని ఆడిట్ అధికారులపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత ఆడిట్ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. వానాకాలం సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో ఇప్పటికే 40 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు జిల్లాల వారీగా సిద్ధం చేసామని, రానున్న 10, 15 రోజుల్లో 2 కోట్ల విత్తన ప్యాకెట్లు రైతులకు అందుబాటులో ఉంచుతామని వ్యవసాయశాఖ సంచాలకులు తెలిపారు.

కేటాయింపుల ప్రకారం యూరియా ఇవ్వాలి.. కేంద్రానికి తుమ్మల లేఖ

ఏప్రిల్, మే నెలలకు రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను పూర్తి మొత్తంలో సరఫరా చేయాల్సిందిగా కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల మంగళవారం లేఖ రాశారు. ఈ వానాకాలానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించింది. ఇందులో ఏప్రిల్ నెల కోటా కింద 1.70 లక్షల మెట్రిక్ టన్నులు, మే నెల కోటాలో 1.60 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయింపులు చేసింది. ఏప్రిల్‌లో కేవలం 1.20 లక్షల మెట్రిక్ టన్నులు, మే నెలలో ఇప్పటి వరకు 52 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసింది. రాష్ట్ర అవసరాల దృష్ట్యా కేటాయింపుల మేరకు వెంటనే యూరియాను పంపించాలని లేఖలో కోరారు.

భూముల మార్కెట్ విలువల పెంపు?

- పెంపుపై ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులకు సర్కారు ఆదేశం
- పెంపుపై సలహా కమిటీ భేటీ
- త్వరలోనే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలు పెరగనున్నాయా? పెంపుపై త్వరలోనే సర్కారు నిర్ణయం తీసుకోనుందా? అంటే తాజా పరిణామాలు చూస్తే అవుననే అనిపిస్తోంది. ఇటీవల ఉపముఖ్యమంత్రి భట్టి నేతృత్వంలో జరిగిన వనరుల సమీకరణ సమావేశంలో భూముల విలువ పెంపుపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు సూచించారు. దీంతో రాష్ట్ర స్థాయిలో మార్కెట్ విలువల కేంద్ర మదింపు సలహా కమిటీ (సీవీఏసీ) సమావేశమై చర్చించింది. ఇప్పటికే ఓ ప్రైవేట్ ఏజెన్సీతో విలువ పెంపుపై అధ్యయనం చేయించిన ప్రభుత్వం.. ఆ నివేదిక ఆధారంగా ఆదాయాన్ని పెంచే మార్గాలను పరిశీలించాలని రిజిస్ట్రేషన్ శాఖకు సూచించింది. పలుదఫాలు సమావేశమైన అనంతరం అధికారులు తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేశారు. రకరకాల కారణాలతో వాయిదా పడుతూ వస్తున్న విలువల పెంపుపై త్వరలోనే నిర్ణయం తీసుకోవాలని యోచిస్తున్న సర్కారు.. తాజాగా నివేదిక ఇవ్వాలని కోరడంతో పెంపు ఖాయమనే చర్చ జరుగుతోంది. రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ చైర్మన్‌గా, జాయింట్ ఐజీ కన్వీనర్‌గా వ్యవహరించే సీవీఏసీకి కార్యదర్శిగా సీసీఎల్ఏ, ఇతర శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ భూముల మార్కెట్ విలువలను సమీక్షించి, అవసరమైన సిఫారసులతో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుంది. ఇందులో భాగంగానే మంగళవారం రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో సీవీఏసీ సమావేశమై మార్కెట్ విలువలపై చర్చించింది. మరోసారి సమావేశమై పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి అందించనుంది.

ఏటా పెంచాలని సూచించిన ఏజెన్సీ

భూముల విలువలను ఏటా పెంచాలని, ఎంత పెంచాలనేది ప్రభుత్వమే నిర్ణయించుకోవాలని, పెంచే విలువలు శాస్త్రీయంగా ఉండాలని థర్డ్ పార్టీ ఏజెన్సీ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొంది. భూముల విలువల పెంపుపై ఇదివరకే రిజిస్ట్రేషన్ శాఖ అధ్యయనం చేసింది. ఆ నివేదికను కూడా ఏజెన్సీ పరిశీలించింది. అధికారులు తయారు చేసిన నివేదిక శాస్త్రీయంగా ఉందా లేదా? భూముల వాస్తవ ధరలకు, పుస్తక విలువలకు మధ్య ఉన్న వ్యత్యాసం ఎంత? దాన్ని సవరించాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? శాస్త్రీయంగా పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలు వంటి అంశాలపై ఏజెన్సీ తన అభిప్రాయాన్ని తెలియజేసింది.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువ వైద్యురాలిపై లైంగిక దాడి

- మహబూబాబాద్ వైద్యుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్, మే20 (ఆంధ్రజ్యోతి): తనకు బలవంతపు పెళ్లి జరిగిందని, భార్యకు నాలుగు అబార్షన్లు కావడంతో ఆమెకు విడాకులిచ్చి ఒంటరి జీవితం గడుపుతున్నానని ఓ మెడికోను నమ్మించాడు మరో డాక్టర్. ఆ మెడికోను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి లైంగిక దాడి చేశాడు. ఈ విషయమై బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మహబూబాబాద్‌లోని అమ్మ ఆస్పత్రిలో పని చేస్తున్న పిల్లల వైద్యుడు డాక్టర్ జెర్పుల స్వామి.. 2023లో అదే పట్టణంలోని ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరిన హైదరాబాద్ నగర వైద్యురాలితో పరిచయం పెంచుకున్నాడు. గతేడాది సెప్టెంబర్‌లో హైదరాబాద్‌కు వచ్చి ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలిగా పని చేస్తున్న ఆమెతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ.. పెళ్లి చేసుకుంటానని నమ్మించేవాడు. గత జనవరి 11న హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ పెడికాన్ సదస్సుకు ఇద్దరూ హాజరయ్యారు. అదే రోజు రాత్రి బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో గది తీసుకున్నారు. తర్వాత ఆమెపై బలవంతంగా లైంగిక దాడి చేసిన స్వామి.. ఈ సంగతి బయటకు చెప్పొద్దని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి వెళ్లిపోయాడు. అనుమానం వచ్చిన బాధితురాలు విచారించగా, స్వామి తన భార్యకు విడాకులివ్వలేదని తెలిసింది. దీంతో తనకు జరిగిన అన్యాయాన్ని స్వామి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితురాలు బంజారాహిల్స్ పోలీస స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డాక్టర్ స్వామి, ఆమె తల్లి మాజీ, తండ్రి శంకర్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

స్పోర్ట్స్

హైదరాబాద్ ● బుధవారం 21 మే 2025



అహ్మదాబాద్‌లో ఫైనల్

క్వాలిఫయర్ 2 కూడా..
ముల్లన్‌పూర్‌లో ఎలిమినేటర్
ఐపీఎల్ ప్లేఆఫ్స్ షెడ్యూల్

న్యూఢిల్లీ: ఐపీఎల్ ప్లేఆఫ్స్ వేదికలను మంగళవారం బీసీసీఐ ప్రకటించింది. దీంట్లో భాగంగా జూన్3న జరిగే ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లో జరుగుతుంది. దీనికి ముందు జూన్ ఒకటిన జరిగే క్వాలిఫయర్ 2 కూడా ఇక్కడే నిర్వహించనున్నారు. అలాగే క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్‌లు **న్యూ చండీగఢ్‌కు సమీపంలోని ముల్లన్‌పూర్** నూతన స్టేడియంలో జరుగనున్నాయి. టాప్-2 జట్లు ఆడే క్వాలిఫయర్1లో విజేత నేరుగా ఫైనల్‌కు చేరే విషయం తెలిసిందే. అయితే ప్లేఆఫ్స్‌లో ఈ నాలుగు మ్యాచ్‌లు కూడా గత షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్, కోల్‌కతాలో జరగాల్సింది. కానీ ప్రయాణ సమస్యలు, వాతావరణ పరిస్థితుల వల్ల వేదికలను మార్చారు. కాగా ఐపీఎల్ ఫైనల్‌కు అత్యధికంగా మూడోసారి ఆతిథ్యమివ్వనున్న అహ్మదాబాద్ సరికొత్త చరిత్ర సృష్టించింది.

ఆర్‌సీబీ మ్యాచ్ లఖ్‌నవూలో..: బెంగళూరులో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్‌సీబీ తమ సొంత వేదికను మార్చింది. చిన్నస్వామి స్టేడియంలో ఈనెల 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే అదే రోజున లఖ్‌నవూ వేదికగా ఈ రెండు జట్లు తలపడనున్నాయి.

ప్లేఆఫ్స్ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
మే 29	క్వాలిఫయర్-1	ముల్లన్‌పూర్
మే 30	ఎలిమినేటర్	ముల్లన్‌పూర్
జూన్ 1	క్వాలిఫయర్-2	అహ్మదాబాద్
జూన్ 3	ఫైనల్	అహ్మదాబాద్

2 గంటల ఎక్స్‌ట్రా టైమ్

ఈ సీజన్ ఐపీఎల్‌లో జరగబోయే మిగిలిన అన్ని లీగ్ మ్యాచ్‌లకు మరో గంట అదనపు సమయం కేటాయించారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని బీసీసీఐ ప్రకటించింది. ఏవైనా అవాంతరాలు ఏర్పడితే మ్యాచ్ నిర్వహణ కోసం మామూలుగానైతే లీగ్ మ్యాచ్‌లకు గంట, ప్లే ఆఫ్స్‌కు 2 గంటల ఎక్స్‌ట్రా టైమ్ ఉంటుంది. అయితే ఈ సీజన్‌లోని మిగిలిన 9 లీగ్ మ్యాచ్‌లకు కూడా రెండు గంటల సమయాన్ని కేటాయిస్తున్నట్టు బోర్డు తెలిపింది. ఇది మంగళవారం జరిగిన చెన్నై-రాజస్థాన్ మ్యాచ్‌నుంచే అమల్లోకి వచ్చింది. దీంతో భారీ వర్షం కురిసినా మ్యాచ్‌లు ఆడించేందుకు మరో గంట వేచి చూసే వీలుంటుంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	12	9	3	0	18	0.795
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	12	6	5	1	13	0.260
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లఖ్‌నవూ	12	5	7	0	10	-0.506
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

నేటి మ్యాచ్ — ముంబై x ఢిల్లీ — వేదిక ముంబై — రా.7.30 నుంచి

ఢిల్లీకి చావోరేవో!

ముంబైతో కీలక పోరు నేడు

ముంబై: ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేస్ రసవత్తరంగా మారింది. సన్‌రైజర్స్ చేతిలో ఓటమితో లీగ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కథ ముగిసింది. దీంతో ప్లేఆఫ్స్‌లో మిగిలిన నాలుగో బెర్త్ కోసం వాంఖడేలో బుధవారం ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య పోరు కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో ఓడితే ఢిల్లీ నాకౌట్ ఆశలు ఆవిరవుతాయి. ముంబై నెగ్గితే వారికి ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారవుతుంది. ప్రస్తుతం ముంబై 12 మ్యాచ్‌ల నుంచి 14 పాయింట్లతో ఉండగా.. ఢిల్లీ 12 మ్యాచ్‌ల నుంచి 13 పాయింట్లు సాధించింది. రెండుజట్లు తమ చివరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడాల్సి ఉంది. ఢిల్లీ చివరి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గితే మొత్తం 17 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు చేరుకొంటుంది. ఒకవేళ ముంబైపై గెలిచి.. 24న పంజాబ్ చేతిలో ఓడితే ఫలితం వారి చేతుల్లో ఉండదు. మరోవైపు ఫుల్‌జోష్‌లో ఉన్న ముంబై సొంతగడ్డపై జరిగే ఈ మ్యాచ్‌లో నెగ్గి నాలుగో బెర్త్ పట్టేయాలనుకొంటోంది.

ముంబై-ఢిల్లీ మ్యాచ్‌కు వరుణ గండం తప్పేట్టు లేదు. మంగళవారం సాయంత్రం వర్షం కారణంగా ఇరు జట్లు ప్రాక్టీస్‌ను ముందే ముగించాల్సివచ్చింది. అలాగే బుధవారం ముంబైలో భారీ వర్షం కురిసే అవకాశం పుష్కలంగా ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది.



వైభవ్ (57)

యుధ్‌వీర్, మధ్వల్

రాజస్థాన్‌కు ఓదార్పు విజయం

చెలరేగిన వైభవ్.. 6 వికెట్ల తేడాతో ఓడిన చెన్నై

న్యూఢిల్లీ: అన్ని విభాగాల్లోనూ రాణించిన రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్ సీజన్‌ను విజయంతో ముగించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 57) మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. దీంతో మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్ఆర్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ఈ రెండు జట్లు ఇదివరకే ప్లేఆఫ్స్ రేసు నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. అటు సీఎస్‌కేకిది పదో ఓటమి కావడం గమనార్హం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. ఆయుష్ మాత్రే (43), బ్రెవిస్ (42) దూబే (39) రాణించారు. మధ్వల్, యుధ్‌వీర్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 17.1 ఓవర్లలో 4 వికెట్లకు 188 పరుగులు చేసి నెగ్గింది. శాంసన్ (41), జైస్వాల్ (36), జురెల్ (31 నాటౌట్) ఆకట్టుకున్నారు. అశ్విన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఆకాశ్ మధ్వల్ నిలిచాడు.

టాపార్డర్ అదుర్స్: ఓ మాదిరి ఛేదనలో ఓపెనర్ జైస్వాల్ ఆరంభంలో మెరుపులు మెరిపించగా.. ఆ తర్వాత మరో ఓపెనర్ వైభవ్ జోరు చూపాడు. కెప్టెన్ శాంసన్ తన సహజశైలిలో ఆడాడు. దీంతో ఆర్ఆర్ సునాయాసంగా ఛేదనను ముగించింది. జైస్వాల్‌ను పేసర్ అన్షుల్ బౌల్డ్ చేసినా పవర్‌ప్లేలో రాజస్థాన్ 56/1తో నిలిచింది. ఇక వైభవ్ బ్యాట్‌కు పనిచెప్పడంతో 27 బంతుల్లోనే అతని ఫిఫ్టీ పూర్తయింది. ఈ సమయంలో శాంసన్‌తో పాటు వైభవ్‌ను 14వ ఓవర్‌లో అశ్విన్ అవుట్ చేయగా, పరాగ్ (3)ను నూర్ వెనక్కి పంపాడు. దీంతో మ్యాచ్‌లో కాస్త ఉత్కంఠ నెలకొంది. అయితే జురెల్ భారీ షాట్లతో చెలరేగి 17 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

మాత్రే, బ్రెవిస్ మెరుపులు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై తొలి ఎనిమిది ఓవర్లలోనే ఐదు వికెట్లను కోల్పోయింది. అయితే ఓపెనర్ ఆయుష్ మాత్రేతో పాటు మిడిల్ ఆర్డర్‌లో బ్రెవిస్ విజృంభించాడు. కానీ డెత్ ఓవర్లలో తడబాటుతో స్కోరు 200 సమీపంలోనే నిలిచింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ కాన్వే (10), హిట్టర్ ఉర్విల్ (0)లను పేసర్ యుధ్‌వీర్ పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత మాత్రే రాజస్థాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. మఫాక చక్కటి క్యాచ్‌తో అతడి దూకుడుకు పేసర్ తుషార్ తెరదించాడు. అప్పటికి మూడో వికెట్‌కు అశ్విన్ (13)తో కలిసి 56 పరుగులు జత చేయగా, పవర్‌ప్లేలో జట్టు 68/3 స్కోరుతో నిలిచింది. అనంతరం వరుస ఓవర్లలో అశ్విన్, జడేజా (1) వికెట్లను కోల్పోవడంతో సీఎస్‌కే తడబడినట్టు కనిపించింది. కానీ బ్రెవిస్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. పదో ఓవర్‌లో అతడి 4,6తో స్కోరు కూడా వంద దాటింది. యుధ్‌వీర్ ఓవర్‌లోనూ సిక్సర్‌తో చక్కటి జోరు మీదున్న అతడిని పేసర్ మధ్వల్ బౌల్డ్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు దూబేతో కలిసి జత చేసిన 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ధోనీ (16) 14వ ఓవర్‌లోనే అడుగుపెట్టినా, క్రీజులో అప్పటికే దూబే ఉన్నప్పటికీ పరుగుల్లో వేగం కనిపించలేదు. చివరి మూడు ఓవర్లలో పేసర్లు తుషార్, మధ్వల్ అద్భుత బౌలింగ్ కారణంగా 17 పరుగులే వచ్చాయి. దీనికి తోడు ఆఖరి ఓవర్‌లో దూబే, ధోనీ వికెట్లను కూడా కోల్పోవడంతో స్కోరు 190లోపే ఆగింది.

స్కోరుబోర్డు

చెన్నై: ఆయుష్ మాత్రే (సి) మఫాక (బి) దేశ్‌పాండే 43; కాన్వే (సి) పరాగ్ (బి) యుధ్‌వీర్ 10; ఉర్విల్ (సి) మఫాక (బి) యుధ్‌వీర్ 0; అశ్విన్ (సి) హెట్‌మయెర్ (బి) హసరంగ 13; జడేజా (సి)ధ్రువ్ జురెల్ (బి) యుధ్‌వీర్ 1; బ్రెవిస్ (బి) ఆకాశ్ మధ్వల్ 42; శివమ్ (సి) జైస్వాల్ (బి) మధ్వల్ 39; ధోనీ (సి) దేశ్‌పాండే (బి) మధ్వల్ 16; అన్షుల్ కాంబోజ్ (నాటౌట్) 5; నూర్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 20 ఓవర్లలో 187/8. వికెట్ల పతనం:** 1-12, 2-12, 3-68, 4-70, 5-78, 6-137, 7-180, 8-185; **బౌలింగ్:** దేశ్‌పాండే 4-0-33-1; యుధ్‌వీర్ 4-0-47-3; మఫాక 2-0-22-0; హసరంగ 4-0-27-1; రియాన్ పరాగ్ 2-0-26-0; ఆకాశ్ మధ్వల్ 4-0-29-3.

రాజస్థాన్: జైస్వాల్ (బి) కాంబోజ్ 36, సూర్యవంశీ (సి) జడేజా (బి) అశ్విన్ 57, సంజూ (సి) బ్రెవిస్ (బి) అశ్విన్ 41, పరాగ్ (బి) నూర్ 3, జురెల్ (నాటౌట్) 31, హెట్‌మయెర్ (నాటౌట్) 12, **ఎక్స్‌ట్రాలు 8, మొత్తం: 17.1 ఓవర్లలో 188/4, వికెట్లపతనం:** 1-37, 2-135, 3-138, 4-158; **బౌలింగ్:** ఖలీల్ 3-0-35-0, కాంబోజ్ 3-0-21-1, అశ్విన్ 4-0-41-2, నూర్ అహ్మద్ 3-0-42-1, పతిరణ 2.1-0-22-0, జడేజా 2-0-27-0.

‘ద వరల్డ్’తో కార్ల్‌సన్ మెగా గేమ్ డ్రా



బెర్లిన్: ‘కార్ల్‌సన్ వర్సెస్ ద వరల్డ్’ ఫ్రీస్టయిల్ మెగా గేమ్ డ్రాగా ముగిసింది. చెస్ డాట్ కామ్ వేదికగా గత నెల 4న ఈ ఆన్‌లైన్ సింగిల్ మ్యాచ్ ఆరంభమైంది. ఇందులో కార్ల్‌సన్ సునాయాసంగా గెలుస్తాడని అంచనా వేశారు. కానీ, 1.43 లక్షల మందితో కూడిన బృందం... ‘ద వరల్డ్’ అద్భుతంగా ఆడుతూ మ్యాచ్‌ను డ్రా చేసింది. 32వ ఎత్తులో మూడోసారి చెక్ చెప్పడంతో ‘త్రీఫోల్డ్ రిపిటీషన్ రూల్’ ప్రకారం గేమ్ డ్రా అయింది.

దిగ్వేష్‌పై మ్యాచ్ నిషేధం

50 శాతం జరిమానా



లఖ్‌నవూ: లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేష్ రాఠీపై ఓ మ్యాచ్ నిషేధం విధించారు. సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మతో దురుసుగా ప్రవర్తించినందుకు రాఠీ మ్యాచ్ ఫీజులో 50శాతం కోత విధించడంతో పాటు రెండు డీమెరిట్ పాయింట్లను చేర్చారు. దీంతో ఈ సీజన్‌లో పాయింట్లు ఐదుకు చేరడంతో ఓ మ్యాచ్ సస్పెన్షన్ పడింది. అలాగే దిగ్వేష్‌తో గొడవలో భాగమైనందుకు అభిషేక్ మ్యాచ్ ఫీజులోనూ 25శాతం కోత విధించి ఒక డీ మెరిట్ పాయింట్‌ను చేర్చారు.

ముంబై జట్టులో బెయిర్‌స్టో

ముంబై: ముంబై ఇండియన్స్ జట్టులో ముగ్గురు ఆటగాళ్లు చేరనున్నారు. చివరి రెండు లీగ్ మ్యాచ్‌లు ఆడాక జాక్స్, రికెల్టన్, బాష్ తమ జాతీయ జట్లతో చేరేందుకు స్వదేశాలకు వెళ్లనున్నారు. దీంతో ప్లేఆఫ్స్ కోసం ఇంగ్లండ్‌కు చెందిన బ్యాటర్ బెయిర్‌స్టో, పేసర్ గ్లీసన్, శ్రీలంక స్పిన్నర్ అసలంకలతో ముంబై తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకుంది.



డోపింగ్‌లో పట్టుబడ్డ శివ్‌పాల్

ఎనిమిదేళ్ల నిషేధం?

న్యూఢిల్లీ: ఒలింపిక్ జావెలిన్ త్రోయర్ శివ్‌పాల్ సింగ్ (29) రెండోసారి డోప్ పరీక్షలో విఫలమయ్యాడు. ఒకవేళ అతడు డోపీగా నిర్ధారణ అయితే గరిష్ఠంగా ఎనిమిదేళ్ల నిషేధం విధించే అవకాశం ఉంది. టోక్యో ఒలింపిక్స్‌లో సింగ్ బరిలోకి దిగాడు. అయితే, ఈ ఏడాది ఆరంభంలో అవుటాఫ్ కాంపిటీషన్‌లో సేకరించిన మూత్రం శాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరక ఆనవాళ్లు బయటపడ్డాయి. దీంతో అతడిపై తాత్కాలికంగా నిషేధం విధించారు. 2019లో దోహాలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్స్‌లో రజతం సాధించడం శివ్‌పాల్ అత్యుత్తమ ప్రదర్శన. 2021లో కూడా సింగ్ డోపింగ్‌లో పట్టుబడడంతో నిషేధం విధించారు.

మెయిన్ డ్రాకు శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్ టోర్నీ

కౌలాలంపూర్: కిడాంబి శ్రీకాంత్ మలేషియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్ మెయిన్ డ్రాకి అర్హత సాధించాడు. మంగళవారం జరిగిన సింగిల్స్ క్వాలిఫయర్స్ రెండో మ్యాచ్‌లో శ్రీకాంత్ 9-21, 21-12, 21-6తో హువాంగ్ యు కై (చైనీస్ తైపీ)పై గెలిచాడు. తరుణ్ మన్నేపల్లి 13-21, 21-23తో పనిట్చాఫోన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడాడు. ప్రధాన పోటీల మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ప్రేరణ-మృణమయి జోడీ 21-19, 19-21, 21-13తో భారత్‌కే చెందిన వైష్ణవి-అలీషా జంటపై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించగా, రష్మీ-సానియా ద్వయం, సిమ్రాన్-కవిప్రియ జంట ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్‌లో పృథ్వీ కృష్ణమూర్తి రాయ్-ప్రతీక్ ద్వయం, హరిహరన్-రుబాన్ జోడీ ఇంటిముఖం పట్టారు.

బిజినెస్

నెలాఖరులోగా కొత్త బీమా పాలసీ

న్యూ ఇండియా అష్యూరెన్స్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అష్యూరెన్స్ ఈ నెలాఖరులోగా సరికొత్త బీమా పాలసీ ప్రారంభించబోతోంది. పారామెట్రిక్ పాలసీ పేరుతో ప్రకటించే ఈ పాలసీ ద్వారా రిటైల్, వ్యాపార సంస్థలు వాతావరణ మార్పులతో సంభవించే ప్రకృతి విపత్తుల నష్టాలకు పరిహారం పొందవచ్చని సంస్థ సీఎండీ గిరిజా సుబ్రమణియన్ చెప్పారు. భారీ వర్షాలు, గాలి వానలు, వరదలు, దుర్భిక్షాలు ఈ కోవలోకి వస్తాయన్నారు. ఈ పాలసీ కింద నిర్ణీత ప్రామాణికాల ప్రకారం నష్టపరిహారం లభిస్తుంది. దీంతో క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్ కూడా త్వరగా పూర్తవుతుంది.

ఐటీఆర్-యూ నోటిఫై చేసిన ఐటీ శాఖ

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను చెల్లింపుదారులు ఇక నాలుగేళ్ల క్రితం వరకు తమ అప్‌డేటెడ్ ఆదాయ పన్ను (ఐటీ) రిటర్న్‌లు ఫైల్ చేయవచ్చు. ఐటీ శాఖ ఇందుకోసం ఐటీఆర్-యూ పేరుతో కొత్త ఫారాన్ని విడుదల చేసింది. ఇంతకు ముందు ఈ గడువు రెండేళ్ల వరకు మాత్రమే ఉండేది. 2025 బడ్జెట్‌లో ఈ గడువును నాలుగేళ్లకు పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. ఏడాది నుంచి రెండేళ్ల అప్‌డేటెడ్ రిటర్న్‌లపై అదనంగా 25, 50 శాతం పన్ను చెల్లించాలి. అదే మూడు నుంచి నాలుగేళ్ల అప్‌డేటెడ్ రిటర్న్‌లు ఫైల్ చేస్తే 60, 70 శాతం అదనపు పన్ను చెల్లించాలని ఐటీ శాఖ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	540
చిత్తూరు	623	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	124
వరంగల్	125	గుంటూరు	127
కరీంనగర్	125	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	109
కర్నూలు	125	నెల్లూరు	114
విశాఖపట్నం	121	అనంతపురం	114
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,020 ▼	87,100 ▼	1,08,000 ▼
విజయవాడ	98,500 ▲	92,000 ▲	97,500 ▼
విశాఖపట్నం	97,020 ▲	87,100 ▼	1,08,000 ▼
రాజమండ్రి	95,020 ▼	87,100 ▼	98,200 ▼
ప్రొద్దుటూరు	94,900 ▼	87,350 ▼	97,600 ▼
ముంబై	93,807 ▲	85,927 ▲	95,800 ▲

పసిడి దిగుమతులకు కళ్లెం



కొత్త నిబంధనలు జారీ చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి వచ్చి పడే పసిడి, వెండి దిగుమతులను ప్రభుత్వం మరింత కట్టడి చేసింది. ఆ దేశంతో మన దేశానికి ఉన్న సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) ముసుగులో కొన్ని సంస్థలు ప్లాటినం పేరుతో బంగారాన్ని దిగుమతి చేసుకుంటూ సుంకాలు ఎగవేస్తుండడంతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఇక నుంచి నామినేటెడ్ సంస్థలు, అర్హత పొందిన నగల వ్యాపారులు/సంస్థలు, చెల్లుబాటయ్యే టారిఫ్ రేటు కోటా (టీఆర్‌క్యూ) ఉన్న సంస్థలను మాత్రమే ఈ ఒప్పందం కింద యూఏఈ నుంచి బంగారం, వెండి దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. శుద్ధి చేయని, పాక్షికంగా శుద్ధి చేసిన లేదా పౌడర్ రూపంలో ఉన్న బంగారం, వెండిలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి.

ఎందుకంటే?

భారత్-యూఏఈ సీఈపీఏ ఒప్పందం ప్రకారం మన దేశ సంస్థలు యూఏఈ నుంచి ఏటా 200 టన్నుల వరకు పాక్షికంగా లేదా ఏ మాత్రం శుద్ధి చేయని ప్లాటినంను ఖనిజ రూపంలో లేదా పౌడర్ రూపంలో ఒక శాతం సుంకంతో దిగుమతి చేసుకోవచ్చు. అయితే చాలా సంస్థలు ఈ ఒప్పందం ముసుగులో స్వచ్ఛమైన బంగారాన్ని కూడా ప్లాటినం ముసుగులో దిగుమతి చేసుకుంటూ సుంకం ఎగవేస్తున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఇందుకోసం బంగారం, వెండి, ప్లాటినంలకు వేరు వేరు కోడ్స్ కేటాయించింది. ప్లాటినం కూడా 99 శాతం స్వచ్ఛత ఉంటేనే ఒక శాతం డ్యూటీతో అనుమతిస్తామని ప్రకటించింది. దీంతో దుబాయ్ నుంచి వచ్చే అక్రమ బంగారం, వెండి దిగుమతులకు తెరపడుతుందని భావిస్తున్నారు.



ప్రారంభ ధర రూ. 2.95 లక్షలు

టీవీఎస్ నుంచి కొత్త ఎలక్ట్రిక్ ఆటో

చెన్నై: టీవీఎస్ మోటార్.. కొత్త ఎలక్ట్రిక్ త్రీ వీలర్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. టీవీఎస్ కింగ్ ఈవీ మ్యాక్స్ పేరుతో దీన్ని విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ. 2.95 లక్షలు (ఎక్స్-షోరూమ్). 51.2 వాట్స్ లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన ఈ ఆటో ఒకసారి చార్జింగ్‌తో 179 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. కేవలం 2.15 గంటల్లోనే 80 శాతం బ్యాటరీ చార్జింగ్ కావటం దీని ప్రత్యేకత అని టీవీఎస్ తెలిపింది. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఈ ఆటో ప్రయాణిస్తుంది. ‘టీవీఎస్ స్మార్ట్‌ఎక్స్‌కనెక్ట్’ ఫీచర్లను ఈ ఆటోకు జోడించినట్లు కంపెనీ తెలిపింది.

హైదరాబాద్‌లో ఐటీసీ వెల్‌కమ్ హోటల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐటీసీ హోటల్స్ హైదరాబాద్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా శంకర్‌పల్లిలో 155 రూమ్స్‌తో ఐటీసీ వెల్‌కమ్ హోటల్‌ను ప్రారంభిస్తోంది. ఇందుకోసం కేపీసీ పామ్ ఎగ్జోటికా హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దాదాపు 11 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ హోటల్‌లో ఆల్ డే డైనింగ్, ప్రత్యేక రెస్టారెంట్, బార్, స్విమ్మింగ్ పూల్, లాంజ్, స్పా, కిడ్స్ క్లబ్ వంటి అత్యాధునిక సదుపాయాలు ఉంటాయని తెలిపింది. ఐటీసీ హోటల్స్‌కు ఇప్పటికే హైదరాబాద్‌లో ఐటీసీ కాకతీయ, ఐటీసీ కోహినూర్ పేరుతో రెండు సొంత హోటల్స్ ఉన్నాయి. వెల్‌కమ్ బ్రాండ్‌తో హైదరాబాద్‌లో శంకర్‌పల్లిలో తొలి స్టార్ హోటల్‌ను నిర్వహించబోతోంది.

రూ.5.6 లక్షల కోట్ల సంపద ఆవిరి

సెన్సెక్స్ 873 పాయింట్లు డౌన్

ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి బ్లూచిప్ షేర్లలో లాభాల స్వీకరణ మంగళవారం మార్కెట్‌ను కుంగదీసింది. దీంతో సెన్సెక్స్ 872.98 పాయింట్లు నష్టపోయి 81,186.44 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 27 నష్టాల్లో క్లోజయ్యాయి. ఆటో, ఫైనాన్షియల్స్, రక్షణ రంగాల షేర్లలో కూడా ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి పాల్పడ్డారు. నిఫ్టీ 261.55 పాయింట్ల నష్టంతో 24,683.90 వద్ద ముగిసింది. మార్కెట్ నష్టాల్లో ముగియడం వరుసగా ఇది రెండో రోజు. మంగళవారం బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.5,64,594.68 కోట్లు దిగజారి రూ.4,38,03,259.51 కోట్ల వద్ద (5.13 లక్షల కోట్ల డాలర్లు) స్థిరపడింది.

7 ఐపీఓలకు సెబీ ఆమోదం: క్రెడిలా ఫైనాన్షియల్ సర్వీసెస్, శ్రీ లోటస్ డెవలపర్స్, యూరో ప్రతీక్ సహా ఏడు కంపెనీల ఐపీఓలకు సెబీ ఆమోదం తెలిపింది. సెబీ ఆమోదం పొందిన ఇతర కంపెనీల్లో కాలిబర్ మైనింగ్, జారో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, జెసన్స్ ఇండస్ట్రీస్, జెమ్ ఆరోమేటిక్స్ ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ రూ.3,000 కోట్లు సమీకరించనున్నాయి.

టైమ్ దాతల జాబితాలో ముకేశ్ అంబానీ, అజీమ్ ప్రేమ్‌జీ

నిఖిల్ కామత్‌కూ స్థానం



న్యూఢిల్లీ: ప్రపంచంలో దాతృత్వ కార్యకలాపాలు నిర్వహించే అగ్రశ్రేణి 100 మంది ప్రముఖుల జాబితాలో దేశీయ పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీతో పాటు విప్రో మాజీ చైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీ, జీరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌కు చోటు దక్కింది. టైమ్ మ్యాగజైన్ ప్రపంచంలో దాతృత్వ కార్యకలాపాల్లో అత్యంత ప్రభావశీలురైన 100 మంది దాతల జాబితా-2025ని తొలిసారిగా విడుదల చేసింది. అత్యంత అవసరంలో ఉన్న సామాజిక వర్గాలకు విరాళాలందించే దాతలు, ఫౌండేషన్ల సారథులు, లాభాపేక్ష రహిత సంస్థల ఉదారతకు సంబంధించిన కథనాలను ఈ జాబితా వెల్లడిస్తుందని టైమ్ పత్రిక తెలిపింది. టైమ్ కథనం ప్రకారం ముకేశ్, నీతా అంబానీ దంపతులు 2024లో రూ.407 కోట్ల విరాళాలందించి దేశంలోనే అతి పెద్ద దాతలుగా నిలిచారు. దేశంలో అత్యంత సంపన్నులైన ఈ దంపతులు తమ దాతృత్వ కార్యకలాపాల ద్వారా కోట్లాది మందికి సాధికారత కల్పిస్తున్నారని ఆ నివేదికలో తెలిపారు. 11,000 కోట్ల డాలర్ల (రూ.9.35 లక్షల కోట్లు) సంపద కలిగిన తమ వ్యాపార సామ్రాజ్యం ఎన్ని రంగాలకు విస్తరించిందో వారి దాతృత్వ కార్యకలాపాలు కూడా అంతగా విభిన్న రంగాలకు విస్తరించాయని పేర్కొంది. రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, వ్యవస్థాపకురాలైన నీతా అంబానీ తమ ఫౌండేషన్ చేపట్టే వివిధ కార్యక్రమాలకు స్వయంగా సారథ్యం వహిస్తూ ఉంటారని టైమ్ మ్యాగజైన్ తెలిపింది.

గాంధేయవాది ప్రేమ్‌జీ

గాంధేయవాదిగా పేరొందిన టెక్నాలజీ దిగ్గజం అజీమ్ ప్రేమ్‌జీ ప్రపంచంలో అత్యంత ఉదారంగా దానధర్మాలు చేసే ప్రముఖుల్లో ఒకరుగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఒక క్రమ పద్ధతిలో తన సంపదను వినియోగిస్తున్నారని టైమ్ పత్రిక తెలిపింది. గివింగ్ ప్లెడ్జ్‌పై సంతకం చేసిన తొలి భారతీయుడు ప్రేమ్‌జీ. 25 సంవత్సరాల క్రితం తాను ప్రారంభించిన ఫౌండేషన్‌కు 2013లో తన కంపెనీకి చెందిన 2,900 కోట్ల డాలర్ల (రూ.2.46 లక్షల కోట్లు) విలువ గల షేర్లను విరాళంగా అందించారు.

అంతేకాకుండా విప్రో సంస్థ విద్య, ఆరోగ్యం, ఇతర రంగాల మెరుగుదలకు కృషి చేస్తున్న 940 సంస్థలకు 2023-24 సంవత్సరంలో 10.9 కోట్ల డాలర్లు (రూ.926.5 కోట్లు) సాంప్రదాయిక గ్రాంట్లుగా అందించింది. ప్రేమ్‌జీ ఫౌండేషన్ దేశవ్యాప్తంగా 59 క్షేత్ర స్థాయి కార్యాలయాలు, 263 ఉపాధ్యాయ అభ్యాస కేంద్రాల ద్వారా ప్రత్యక్షంగా ఉపాధ్యాయులు, గ్రామీణ బాలల సంరక్షణ సిబ్బందితో సంబంధాలు కలిగి ఉంది. ఇప్పటి వరకు 80 లక్షల మంది బాలబాలికల కోసం విద్యా కార్యక్రమాలు చేపట్టింది.

విద్యనే నమ్మిన నిఖిల్ కామత్

డిస్కౌంట్ బ్రోకరేజీ సంస్థ జీరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ 2023లో గివింగ్ ప్లెడ్జ్‌పై సంతకం చేశారు. 36 సంవత్సరాల పిన్న వయసులో సంతకం చేసిన తొలి భారతీయుడుగా గుర్తింపు పొందారు. విద్య ఒక్కటే సమాజంలో అసమానతలను నిర్మూలించగలదని విశ్వసించే నిఖిల్ అప్పటికే పలు పర్యావరణ, విద్యా ప్రాజెక్టులకు కోట్లాది రూపాయలు విరాళంగా అందించారు. యంగ్ ఇండియా ఫిలాంత్రపిక్ ప్లెడ్జ్ (వైఐపీపీ) పేరిట సొంత సంస్థను స్థాపించి 10 కోట్ల డాలర్లకు పైబడిన సంపద కలిగిన, 45 సంవత్సరాల లోపు వయస్కులైన యువత అందరూ తమ సంపదలో 25 శాతం విరాళాలుగా అందించాలని పిలుపు ఇచ్చారని టైమ్ తెలిపింది.

వాతావరణ మార్పుల సొల్యూషన్లపై కృషి చేస్తున్న రెయిన్ మ్యాటర్ ఫౌండేషన్‌కు 10 కోట్ల డాలర్లకు (రూ.850 కోట్లు) పైగా నిధులు అందించారు. నిఖిల్ సారథ్యంలోని వైఐపీపీ 300 పాఠశాలలకు కంప్యూటర్లు అందించేందుకు, కెరీర్ కౌన్సెలింగ్, ఇతర సేవల కోసం 80 కోట్ల డాలర్లు (రూ.6,800 కోట్లు) సమీకరించింది. కాగా ఫుట్ బాల్ లెజెండ్ డేవిడ్ బెక్‌హామ్, ప్రముఖ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్, అమెరికన్ దాత మెలిండా ఫ్రెంచ్ గేట్స్, ప్రిన్స్ విలియం, వేల్స్ ప్రిన్సెస్ కాథరిన్ కూడా ఈ జాబితాలో ఉన్నారు.

తగ్గిన గ్లాండ్ ఫార్మా లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్లాండ్ ఫార్మా.. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.186.54 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం లాభం రూ.192.42 కోట్లతో పోల్చితే 3% తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.1,537.45 కోట్ల నుంచి రూ.1,424.91 కోట్లకు తగ్గింది. అమెరికా మార్కెట్ ఆదాయాలు 10% తగ్గటం పనితీరును దెబ్బతీసిందని పేర్కొంది. ఈ కాలంలో అమెరికా ఆదాయం రూ.791.80 కోట్లుగా ఉంది. మరోవైపు యూరప్ ఆదాయాలు 4% వృద్ధితో రూ.280.20 కోట్లుగా ఉండగా భారత ఆదాయం నిలకడగా రూ.52.5 కోట్లుగా ఉన్నట్లు గ్లాండ్ ఫార్మా తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.18 తుది డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

ఎయిర్‌టెల్, గూగుల్ బంఫర్ ఆఫర్

6 నెలల పాటు 100 జీబీ క్లౌడ్ స్టోరేజ్ సబ్‌స్క్రిప్షన్ ఉచితం

న్యూఢిల్లీ: టెలికాం సంస్థ భారతి ఎయిర్‌టెల్, టెక్ దిగ్గజం గూగుల్ జట్టు కట్టాయి. ఒప్పందంలో భాగంగా ఎయిర్‌టెల్ తన పోస్ట్‌పెయిడ్, వైఫై ఖాతాదారులకు గూగుల్ వన్ ద్వారా 100 జీబీ క్లౌడ్ స్టోరేజ్ సబ్‌స్క్రిప్షన్‌ను ఆరు నెలల పాటు ఉచితంగా అందించనుంది. ఈ స్టోరేజ్‌ను గరిష్ఠంగా ఐదుగురితో పంచుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఆరు నెలల అనంతరం ఈ సబ్‌స్క్రిప్షన్ కొనసాగించాలనుకునే కస్టమర్లు నెలకు రూ.125 చెల్లిస్తే సరిపోతుందని తెలిపింది. ఒకవేళ సబ్‌స్క్రిప్షన్ అవసరం లేదనుకుంటే గూగుల్ వన్ సభ్యత్వాన్ని రద్దు చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది.



బెంగళూరులో అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరా విధానాన్ని పరిశీలిస్తున్న భట్టి

ఫ్యూచర్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్!

» జనాభా ఎక్కువున్న పట్టణాల్లోనూ ఏర్పాటుకు యోచన: భట్టి

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రాష్ట్రంలో జనాభా ఎక్కువగా ఉన్న పట్టణాల్లోనూ దీనిని అమలు చేయాలనే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. ఈ వ్యవస్థలో భూమి లోపల చాంబర్లు నిర్మించి, విద్యుత్ పరికరాలు, ఇన్సులేటెడ్ తీగలను ఏర్పాటు చేసి.. విద్యుత్ సరఫరా చేస్తారు. ఇప్పటికే బెంగళూరులోని పలు ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరా విధానం అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో భట్టి మంగళవారం రాష్ట్ర విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బెంగళూరులో పర్యటించారు. అక్కడి అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు. కర్ణాటక విద్యుత్ సరఫరా కార్పొరేషన్, బెంగళూరు ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ లిమిటెడ్ (బీఈఎస్‌సీఓఎం) అధికారులు, ఇంజనీర్లతో సమావేశమయ్యారు. అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరా ప్రాజెక్టుకు బ్యాంకు రుణాలు, సాంకేతిక సమస్యలు, నష్టాలు, లాభాలు, ప్రమాదాలు తదితర వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలోని పట్టణ గ్రిడ్ ఆధునికీకరణలో భాగంగా అండర్‌గ్రౌండ్ విద్యుత్ సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని భట్టి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దుంప కూరల సాగు పెంపునకు కార్యాచరణ

» ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుధాకర్

రాజేంద్రనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో దుంప కూరగాయల వాణిజ్యసాగును భారీగా పెంచేందుకు కార్యాచరణ రూపొందిస్తామని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుధాకర్ పాండే పేర్కొన్నారు. రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల వేదికగా 'దేశంలో దుంప కూరగాయాల సాగు- అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం' అంశంపై రెండు రోజులపాటు సదస్సు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి హాజరైన సుధాకర్ పాండే మాట్లాడారు. కందలో డ్రిప్ ఇరిగేషన్, దూది పురుగు యాజమాన్యానికి జీవ నియంత్రణ పద్ధతులు, భూమిలోని మిగిలిన తేమను వాడుకొని దిగుబడి పెంపొందించేలా కార్యాచరణ, పొటాషియం మోతాదును తగ్గించే అంశాలపై పరిశోధనలను ముమ్మరం చేస్తామని తెలిపారు. గ్రామాలను క్లస్టర్లుగా చేసి దుంప పంటలపై ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వచ్చే ఐదేళ్లలో భారీగా దుంప కూరల జనక రకాలను సేకరించి పరిశీలించాలని శాస్త్రవేత్తలను కోరారు. సందర్భంగా తెలంగాణకు చెందిన దుంప కూరగాయల రైతులతో శాస్త్రవేత్తల బృందం ముఖాముఖి నిర్వహించింది.

కేసీఆర్ చట్టాన్ని గౌరవిస్తారని భావిస్తున్నా

» పుష్కరాలకు బండి సంజయ్ నిధులు తేవాలి: శ్రీధర్‌బాబు



పెద్దపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, వ్యక్తిగత ద్వేషంతో ఎవరిపైనా కేసులు పెట్టే ప్రభుత్వం తమది కాదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా శివపల్లిలో శ్రీధర్‌బాబు విలేకరులతో చిట్‌చాట్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జరుగుతున్న విచారణలో కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. ఆయన చట్టాన్ని గౌరవిస్తారని భావిస్తున్నానని అన్నారు. కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాలకు ప్రభుత్వం రూ.35 కోట్లు ఇచ్చిందని, పుష్కరాల నిర్వహణ గురించి విమర్శిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా కేంద్రం నుంచి రూ.35 కోట్లు ఇప్పిస్తే బాగుంటుందని అన్నారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు బండి సంజయ్, కిషన్‌రెడ్డి రూ.వెయ్యి కోట్లు తీసుకురావాలని కోరారు.

కేసీఆర్ నిజాయితీని నిరూపించుకోవాలి : అద్దంకి

హైదరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ విచారణలో కేసీఆర్ నిజాయితీని నిరూపించుకుంటే పూల దండలు వేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాటి సీఎం, నీటి పారుదల, ఆర్థిక మంత్రులు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది కనుకే కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ నోటీసులు జారీ చేసిందని తెలిపారు. తప్పు ఎవరు చేసినా జైలుకు వెళ్లాల్సిందేనని, కేసీఆర్, హరీశ్, ఈటలకు జైలుకు వెళ్లే అర్హతలూ ఉన్నాయని అన్నారు.

నోటీసులు అందాక స్పందిస్తా: ఈటల



భువనగిరి టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ నుంచి తనకు ఎలాంటి నోటీసులు రాలేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కమిషన్ నుంచి తనకు నోటీసులు వస్తే.. ఆ అంశంపై స్పందిస్తానన్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లా కేంద్రం– భువనగిరిలో మంగళవారం నిర్వహించిన తిరంగా యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులపై ప్రశ్నించగా.. ఈటల పైవిధంగా స్పందించారు. తనకు నోటీసులు అందాక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, తన అభిప్రాయాలను చెబుతానన్నారు. నోటీసులను చూడకుండా ఏమీ మాట్లాడలేనని స్పష్టం చేశారు. తిరంగా యాత్ర సందర్భంగా మాట్లాడుతూ భారత్ ప్రపంచ శాంతిని కోరుకుంటోందని, భారతీయులకు హాని జరిగితే.. ప్రధాని మోదీ చూస్తూ ఊరుకోబోరని.. గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్

» రాజకీయ కక్షతోనే కేసీఆర్‌కు నోటీసులు: కవిత



హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా ఖండించారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ అని కవిత ఎద్దేవాచేశారు. ప్రజలకోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ప్రజానాయకుడు కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ కుట్రచేస్తోందని ఎక్స్ వేదికగా ఆమె పేర్కొన్నారు. ఎన్ని కమిషన్లువేసినా.. కాలక్రమంలో న్యాయాన్ని గెలిపిస్తాయని, నిజాలన్నీ బయటకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం.. కాంగ్రెస్‌పార్టీ చేస్తోన్న కుట్రపూరిత చర్య అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు.

సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ టాప్

పోగొట్టుకున్న, దొంగిలించిన సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ పోలీసులు దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచారు. ఇప్పటివరకు ఏకంగా 78,114 సెల్‌ఫోన్లను రికవరీ చేసి రికార్డు సృష్టించారు. సీఈఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా ఈ ఘనత సాధించినట్లు సీఐడీ డీజీ శిఖాగోయల్ తెలిపారు. సెల్ ఫోన్ల రికవరీలో హైదరాబాద్ కమిషనరేట్ (11,879), సైబరాబాద్ కమిషనరేట్ (10,385), రాచకొండ కమిషనరేట్ (8,681) మొదటి మూడు స్థానాల్లో నిలిచాయని పేర్కొన్నారు. ఫోన్లను పోగొట్టుకున్న వారు పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండానే తెలంగాణ పోలీసు సిటిజన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చని శిఖాగోయల్ వివరించారు.

లోటుపాట్లు సరిదిద్దుకోండి!

» ప్రజలకు చేరువగా ఉండండి

» ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు రాకూడదు

» నాగర్ కర్నూల్, మల్కాజ్‌గిరి, మెదక్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం దిశానిర్దేశం

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో లోటుపాట్లను సరిదిద్దుకోవాలని, ప్రజలకు మరింత చేరువ కావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం తదితర సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. పథకాల అమల్లో ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు రాకుండా చూసుకోవాలని, పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కొద్దిరోజుల కిందట జరిగిన సీఎల్పీ సమావేశంలో.. పార్టీ ఎమ్మెల్యేలతో తాను ముఖాముఖిగా భేటీ అవుతానని, ఈలోగా తమ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యల జాబితాను రూపొందించుకోవాలని సీఎం రేవంత్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమావేశమై.. వారికి దిశానిర్దేశం చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్, మెదక్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, మైనంపల్లి రోహిత్, శ్రీగణేశ్ పాల్గొన్నారు.

హామీలు.. సూచనలు..

ఒక్కో ఎమ్మెల్యేకు 10 నుంచి 15 నిమిషాల సమయం ఇచ్చి మాట్లాడిన ముఖ్యమంత్రి.. ముందుగా నియోజకవర్గ సమస్యలపై వారు చెప్పాల్సింది చెప్పాలని సూచించారు. దీంతో క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు, ఆయా నియోజకవర్గాల్లో తక్షణం పూర్తి చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యేలు వివరించారు. ఆపై.. ఆయా అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన సీఎం.. సంబంధిత ప్రతిపాదనలను అధికారులకు అందజేశారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరుపై ఇంటెలిజెన్స్ నివేదికల ఆధారంగా తగిన సూచనలూ చేశారు. ముఖ్యంగా ఎమ్మెల్యేల అనుచరులు, సిబ్బంది వల్ల ప్రజలు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. ప్రజలకు మరింత చేరువ కావాలని, పథకాలను వారి వద్దకు తీసుకెళ్లాలని అన్నారు. ఎమ్మెల్యేల పనితీరు సహా లోటుపాట్లను సమగ్రంగా వివరించి వాటిని సరిదుద్దుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత తనదని చెప్పారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. నల్లమల డిక్లరేషన్‌ను అమలు చేసే పూచీ తనదని నాగర్ కర్నూల్ పరిధిలోని ఎమ్మెల్యేలకు స్పష్టం చేశారు.

గీత దాటొద్దు

(మొదటిపేజీ తరువాయి)

వెళతాయని తెలిపింది. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఉదంతాల నేపథ్యంలో సర్కారు ఈ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్రంలోని అఖిలభారత అధికారులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు.. విధులకు కట్టుబడి, హద్దుల్లో ఉండాలని పేర్కొంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం రెండు వేర్వేరు అంతర్గత ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కొంతమంది అధికారులు బహిరంగ సభలు, ప్రజా సమూహాల్లో అనుచితంగా ప్రవర్తించిన ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని ప్రభుత్వం తెలిపింది. నిజానికి రాష్ట్రంలో అధికారులు మితిమీరి ప్రవర్తిస్తున్న సంఘటనలు గత కొంతకాలంగా ఉంటున్నాయి. ఓ ఐఏఎస్ అధికారి.. సీఎం రేవంత్‌రెడ్డి కాళ్లకు మొక్కే ప్రయత్నం చేశారు. మరో ఐఏఎస్ అధికారి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఓ శాఖ విభాగాధిపతి (హెచ్‌వోడీ)గా పనిచేసిన అధికారి.. ఓ పార్టీకి అనుకూలంగా పని చేశారు. ఎన్నికల్లో పోటీకి టికెట్ సాధించే క్రమంలో ఆయన ఆ పార్టీకి వంత పాడారు. ఇలాంటి ఉదంతాలు ఐఏఎస్‌లు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని, వారి సేవలను ప్రశ్నార్థకం చేస్తాయని ప్రభుత్వం తెలిపింది. ప్రజల్లో విశ్వాసం కోల్పోయేలా చేయడమే కాకుండా... అధికారుల సేవల సామర్థ్యాన్ని కూడా తక్కువ చేస్తాయని పేర్కొంది.

విధులకు బద్ధులై ఉండాలి..

'అఖిల భారత సర్వీసు ప్రవర్తనా నియమావళి-1968'లోని రూల్ 3(1) ప్రకారం అఖిల భారత అధికారి పూర్తి వినయ విధేయలతో ఉండాలని, విధులకు బద్ధులై ఉండాలని, ఎలాంటి బహిరంగ సభల్లో పాల్గొనకూడదని ప్రభుత్వం తెలిపింది. వృత్తిపరమైన ఉన్నత విలువలను పాటించాలని, ప్రజలతో మాట్లాడే సందర్భాల్లో, వృత్తిలో భాగంగా పూర్తి మర్యాద పాటించాలని ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని పేర్కొంది. అధికారులు, ఉద్యోగుల మితిమీరిన ప్రవర్తన వల్ల తప్పుడు ప్రచారం జరుగుతుందని, ఇది ఉద్యోగులకు వ్యక్తిగతంగా నష్టం చేయడమే కాకుండా ప్రభుత్వ ప్రతిష్ఠను కూడా దిగజారుస్తుందని తెలిపింది. 'తెలంగాణ సివిల్ సర్వీసెస్(కాండక్ట్) రూల్స్-1964'లోని రూల్ 3 ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగులు క్రమశిక్షణ, నిష్పాక్షికత, సమగ్రతను పాటించాలని గుర్తు చేసింది. ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా ఏ ఒక్క ఉద్యోగీ ప్రవర్తించకూడదని, అసభ్య పదజాలాన్ని వాడరాదని హెచ్చరించింది. ఎలాంటి అపసవ్య పద్ధతులను అనుసరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు అన్ని శాఖల విభాగాధిపతులు ఈ విషయాన్ని తమ అధికారులు, ఉద్యోగులకు తెలియజేయాలని సూచించింది.



సీఎం రేవంత్‌తో రష్యా కాన్సుల్ జనరల్ భేటీ

చెన్నైలో ఉన్న రష్యా కాన్సుల్ జనరల్ వాలెరీ ఖడ్జోయేవ్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

అప్పట్లో నాటి సీఎంకు... ఇప్పుడు నేటి సీఎంకు

ఓ ఐఏఎస్ అధికారి మితిమీరిన ప్రవర్తన ప్రతిసారీ చర్చనీయాంశంగా మారుతోంది. ముఖ్యంగా ఐఏఎస్ సర్కిల్‌ను ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెడుతోంది. ఆయన ఏమి ఆశించి ఇలాంటి చర్యలకు దిగుతున్నారోనంటూ మిగతా ఐఏఎస్‌లు అసహనానికి గురవుతున్నారు. బీఆర్ఎస్ పరిపాలనలో ఆ అధికారి.. అప్పటి సీఎం కేసీఆర్ కాళ్లకు మొక్కబోయారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి కాళ్లకూ మొక్కే ప్రయత్నం చేశారు. దీంతో.. ఎవరు అధికారంలో ఉంటే ఆ సీఎం కాళ్లకు మొక్కడం ఒక తంతుగా ఆయన మార్చుకున్నారని ఐఏఎస్ అధికారుల్లో చర్చ జరుగుతోంది. అఖిలభారత సర్వీసు అధికారిగా హుందాగా ఉండాలని, రాజకీయ నాయకుల కాళ్లకు మొక్కడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక.. ప్రభుత్వం మారగానే సోషల్ మీడియా వేదికగా కొత్త ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్న మరో ఐఏఎస్ అధికారి తీరునూ ఇతర అధికారులు తప్పుబడుతున్నారు. సర్వీసు పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా.. ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు దిగకూడదని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇలాంటి అధికారుల వల్లే ప్రభుత్వం కఠిన హెచ్చరికలు జారీ చేయాల్సి వచ్చిందని తెలుస్తోంది.

తుమ్మిడిహెట్టిపై ప్రతిపాదనలు సిద్ధం చేయండి!

» 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి చర్యలు

» ఎస్ఎల్‌బీసీ తవ్వకం చేపట్టాలి: ఉత్తమ్



హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా 148 మీటర్ల ఎత్తుతో తుమ్మిడి హెట్టి బ్యారేజీ నిర్మాణం దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. పలు ప్రాజెక్టులపై ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌పైనా మంత్రి సమీక్షించారు. ఇన్‌లెట్(దోమలపెంట-శ్రీశైలం) వైపు నుంచి వెంటనే డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ (డీబీఎం) విధానంలో తవ్వకాలు చేపట్టాలని ఆదేశించారు. ఔట్‌లెట్ (మన్నెవారిపల్లి-అచ్చంపేట) వైపు టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం)కు బేరింగ్‌ను సత్వరం అమర్చి టన్నెలింగ్ చేయాలన్నారు. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ప్రకారం పరీక్షలు, ఇతర మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బిల్లులు విడుదల చేయాలని నిర్మాణ సంస్థలు కోరుతున్నాయని అధికారులు నివేదించగా పెండింగ్ బిల్లులు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. సమ్మక్కసాగర్ బ్యారేజీకి ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం తెచ్చుకోవడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జలాశయాల్లో పూడికతీత కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నల్లగొండ జిల్లాలోని ధర్మారెడ్డి కాలువ, పిల్లాయిపల్లి కాలువ, బునియాదిగాని కాలువ పనులను సత్వరం చేపట్టాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సమీక్షలో గుత్తా కూడా పాల్గొన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని, ఉత్తమ్ నిరంతరం అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారని గుత్తా గుర్తు చేశారు.



కేసీఆర్‌కు పిలుపు

(మొదటిపేజీ తరువాయి)

ఎంపిక, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల స్థలాల మార్పు నిర్ణయం కూడా కేసీఆర్‌దే. బ్యారేజీల స్థలాలను ఎంపిక చేసే క్రమంలో భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలు కూడా చేయలేదని విచారణలో తేలింది. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) కూడా ఇదే విషయాన్ని నిర్ధారించింది. వానాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీలను ఖాళీచేసి, బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయని నివేదికలు తయారు చేయాల్సి ఉండగా, 2023 అక్టోబరు 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాకు కుంగేదాకా మధ్యలో ఒక్కసారి కూడా చేయలేదని గుర్తించారు. 2019 మేలో బ్యారేజీలు పూర్తికాగా మేడిగడ్డ కుంగుబాటు ఘటన జరిగే వరకు కూడా ఏ సంవత్సరం కూడా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) పనులు చేయలేదని విచారణలో తేలింది. నీటి మళ్లింపు కోసం కాకుండా బ్యారేజీలను నీటి నిల్వ కోసం కట్టడమే అనర్థాలకు కారణమని కమిషన్ విచారణలో పలువురు వివరించారు. బ్యారేజీల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ చేయడానికి కారణం ఎవరని కమిషన్ అధికారులను ప్రశ్నించగా అంతా కేసీఆర్ పేరే చెప్పారు. హరీశ్‌రావు ఆదేశాలు కూడా కారణమని కొందరు ప్రస్తావించారు. 2016-18 మధ్యకాలంలో నీటిపారుదల మంత్రి హోదాలో హరీశ్‌రావు కేసీఆర్ మార్గదర్శకంలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పర్యవేక్షించారు. రెండో దఫా ప్రభుత్వం వచ్చాక నీటి పారుదల శాఖ కేసీఆర్ దగ్గరే ఉంది. నిధుల విడుదల సమయంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ ఉండటంతో ఆయనకు విచారణకు పిలిచారు. కేసీఆర్‌కు జూన్ 5న విచారణకు హాజరవుతారా? విచారణ ప్రక్రియను న్యాయస్థానంలో సవాలు చేస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. కమిషన్ మంగళవారం జారీ చేసిన సమన్లు బుధవారం కేసీఆర్, హరీశ్‌రావు, ఈటలకు అందనున్నాయి. హరీశ్, ఈటల విచారణకు హాజరవడానికే మొగ్గు చూపే అవకాశం ఉంది. కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారనేది తేలాల్సి ఉంది. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంపై జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ ముందు హాజరు కావడానికి కేసీఆర్ నిరాకరించారు. సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. తాజాగా కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరు కాలేనని, వీడియో ద్వారా విచారించాలని కేసీఆర్ కోరితే కమిషన్ సానుకూలంగా స్పందించే అవకాశాలు లేకపోలేదని తెలుస్తోంది. కాళేశ్వరం డ్యామ్ సేఫ్టీ సూపరింటెండెంట్ ఇంజనీర్ అమెరికాలో ఉండగా వర్చువల్‌గా విచారించారు. అదే అవకాశం కేసీఆర్‌కు ఇచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి.

కిం కర్తవ్యం?

» కాళేశ్వరం కమిషన్ నోటీసులపై ఏం చేద్దాం?

» బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమాలోచనలు

» ఎర్రవెల్లిలో ఆయనతో భేటీ అయిన హరీశ్

» న్యాయనిపుణుల సలహాతో 2-3 రోజుల్లో నిర్ణయం తీసుకోనున్న గులాబీ బాస్!

హైదరాబాద్, గజ్వేల్, మే 20 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ నోటీసులకు ఎలా స్పందిద్దాం? విచారణకు వెళ్లాలా.. వద్దా? లిఖితపూర్వకంగా వివరణ ఇద్దామా? న్యాయనిపుణుల సలహాతో ముందుకు వెళ్దామా? కిం కర్తవ్యం?" అంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం వ్యవహారంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు పంపింది. ఆయనతోపాటు ఆ సమయంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావుకు, ఆర్థిక శాఖ మంత్రిగా కొనసాగిన ఈటల రాజేందర్‌కు సైతం కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీచేసింది. ఈ నేపథ్యంలో.. హరీశ్ రావు మంగళవారంరాత్రి ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఆయనతో భేటీ అయినట్లు తెలుస్తోంది. 9వ తేదీన విచారణకు హాజరు కావాలంటూ తనకు వచ్చిన నోటీసు ప్రతిని కేసీఆర్ వద్దకు హరీశ్ తీసుకు వెళ్లినట్లు సమాచారం. నోటీసుల్లో ఏం ఉంది? విచారణకు వెళ్తే ఎటువంటి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది? వాటికి ఏం సమాధానం చెప్పాలనే అంశంపై వారి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. అసలు విచారణకు వెళ్లాలా.. వద్దా? అనే అంశంపై న్యాయనిపుణుల సలహా తీసుకోవాలని గులాబీ బాస్ నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై అంతర్గత సమాలోచనలు జరిపి.. న్యాయనిపుణులు ఇచ్చే సూచనల ఆధారంగా.. ఒకటి, రెండు రోజుల్లో ఆయన కీలకనిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఇక.. కమిషన్ సూచించిన తేదీన విచారణకు హాజరు కావాలని అప్పటి ఆర్థికశాఖ మంత్రి, ప్రస్తుత ఎంపీ ఈటల రాజేందర్ నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తాను ఆర్థికమంత్రిగా కొనసాగినప్పటికీ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి నిధుల విడుదలలో తన శాఖ ప్రమేయం లేదని, దీని కోసం ప్రత్యేకంగా కెటాయించిన బడ్జెట్ ద్వారానే నిధుల వినియోగం జరిగిందని ఆయన తన ఆత్మీయులతో పేర్కొన్నట్లు సమాచారం.



ఎట్టకేలకు ఫలించిన నిరీక్షణ

సీఎం చొరవతో కానిస్టేబుల్ భార్యకు కారుణ్య నియామకం

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో కానిస్టేబుల్ భార్య వేములవతి దేవికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం లభించింది. నగరంలోని మహంకాళి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ బి.రవికుమార్ విధి నిర్వహణలో భాగంగా 2018లో మృతి చెందాడు. రవికుమార్ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందినవాడు కావడంతో ఆరేళ్లుగా ఏపీ, తెలంగాణ మధ్య కారుణ్య నియామక అంశం ఎటూ తేలకుండా పోయింది. దీంతో కొన్ని నెలల క్రితం దేవి ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. ప్రజావాణి ఇంచార్జి చిన్నారెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారిణి దివ్య దేవరాజన్ ఈ విషయాన్ని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. రవికుమార్ హైదరాబాద్ పోలీసు అయినందున.. దేవికి ఇక్కడే ఉద్యోగం ఇవ్వాలంటూ సంబంధిత అధికారులను సీఎం ఆదేశించారు. దీంతో దేవిని నాంపల్లి రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ హైదరాబాద్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నా బదిలీ వెనుక దురుద్దేశం ఉంది

» బెంగళూరు పంపాలని కోరినా పట్టించుకోలేదు

» ఇద్దరు సీజేఐలకు వినతులిచ్చినా పరిగణించలేదు

» నన్ను వేధించడానికే బదిలీ ఉత్తర్వులిచ్చినట్లుంది

» వారి అహాన్ని సంతృప్తిపరుచుకొనేందుకే... సొంత రాష్ట్రం నుంచి అకారణంగా బదిలీ చేశారు

» దేవుడు వాళ్లని మర్చిపోడు.. క్షమించడు

» వీడ్కోలు సభలో జస్టిస్ దుప్పల వెంకట రమణ ఆవేదన

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు నుంచి తనను మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయడం వెనుక దురుద్దేశం ఉందని న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి కారణాలు లేకుండా తనను బదిలీ చేశారని ఆరోపించారు. జస్టిస్ వెంకటరమణ జూన్ 2న పదవీ విరమణ చేయబోతున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో మధ్యప్రదేశ్ హైకోర్టు మంగళవారం ఆయనకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ వెంకటరమణ మాట్లాడుతూ.... 'బదిలీ సమయంలో ఆప్షన్లు కోరినప్పుడు నా భార్యకు మెరుగైన చికిత్స అందించేందుకు వీలుంటుందని బెంగుళూరును ఎంచుకున్నాను. అయితే నా అభ్యర్థనను సుప్రీంకోర్టు కొలీజియం పరిగణనలోకి తీసుకోలేదు. 2023 నవంబరు 1న మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేశాను. కొవిడ్ కారణంగా మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నా భార్యకు వైద్య చికిత్స అందించేందుకు వీలుగా నన్ను బదిలీ చేయాలని 2024 జూలై 19న, ఆగస్టు 28న అప్పటి సుప్రీంకోర్టు ఇద్దరు ప్రధాన న్యాయమూర్తులకు వినతులు సమర్పించినా వాటిని పరిగణలోకి తీసుకోలేదు... తిరస్కరించనూ లేదు. నా అభ్యర్థనను మానవతా దృక్పథంతో పరిశీలిస్తారని ఆశించాను. ఎలాంటి స్పందనా లేకపోవడంతో నిరుత్సాహపడ్డాను. తీవ్రంగా బాధపడ్డాను. ప్రస్తుత సీజేఐ జస్టిస్ గవాయ్ నా వినతిని పరిగణలోకి తీసుకోవచ్చు. అయితే ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఏదేమైనా నా బదిలీ ఉత్తర్వులు దురుద్దేశంతో, నన్ను వేధించడానికి జారీ చేసినట్టు కనిపిస్తోంది. వారి అహాన్ని సంతృప్తిపరుచుకొనేందుకు నా సొంత రాష్ట్రం నుంచి అకారణంగా బదిలీ చేశారు. వారి అహాన్ని సంతృప్తిపరిచినందుకు నాకూ సంతోషంగానే ఉంది. ఇప్పుడు వారు పదవీ విరమణ చేశారు. దేవుడు వాళ్లని అంత తేలికగా మర్చిపోడు.. వారిని క్షమించడు. నన్ను ఇబ్బందులకు గురిచేసినందుకు వారు ఏదో ఒక రూపంలో బాధపడతారు. అదృష్టవశాత్తు వారి శాపమే నాకు వరంగా మారింది. ఇండోర్, జబల్‌పూర్ బెంచ్‌లలో సోదర న్యాయమూర్తులు, న్యాయవాదుల నుంచి అపారమైన మద్దతు, ప్రేమ, సహకారం లభించింది' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. జస్టిస్ వెంకటరమణ 2022లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023లో అప్పటి సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన కొలీజియం సిఫారసు మేరకు ఆయన మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు.

17 నెలల పాలనలో 17 పథకాలు: టీపీసీసీ చీఫ్



హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ 17 నెలల పాలనలో అమలు చేసిన 17 ప్రధాన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాన్ని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మంగళవారం గాంధీభవన్‌లో ఆవిష్కరించారు. టీపీసీసీ నేత బీఆర్ కుమార్ రూపొందించిన ఈ కరపత్రాలను రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయనున్నారు. కాగా, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావుకు వ్యతిరేకంగా మంగళవారం గాంధీభవన్ ప్రధాన ద్వారం వద్ద గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు ధర్నా చేశారు. 'సునీతారావ్‌కో హటావో, గోషామహల్ కాంగ్రెస్‌కో బచావో' అంటూ నినాదాలు చేశారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌పై ఆరోపణలు చేసిన ఆమెపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.



ఐఎఫ్ఎస్ సాధించిన దేవానంద్‌ను అభినందిస్తున్న ఏడీజీ మహేశ్ భగవత్

ఐఎఫ్ఎస్ టాప్-50లో మనవాళ్లు ముగ్గురు!

(మొదటిపేజీ తరువాయి)

ఎంపికయ్యారు. అందులో ముగ్గురు తెలంగాణవారు. ముగ్గురూ టాప్ 50లో నిలిచారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన చాడ నిఖిల్‌రెడ్డికి 11వ ర్యాంకు, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన జి.ప్రశాంత్ 25వ ర్యాంకు, కరీంనగర్ జిల్లాకు చెందిన చెరుకు అవినాశ్‌రెడ్డి 40వ ర్యాంకు సాధించారు. ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికైన 143 మంది అభ్యర్థుల్లో.. తుది ఇంటర్వ్యూ కోసం అదనపు డీజీపీ మహేశ్ భగవత్ బృందం మార్గదర్శకత్వం అందించిన వారు 80మంది ఉండటం గమనార్హం. సివిల్స్‌కు సిద్ధమయ్యే అభ్యర్థులకు తమ బృందం కొన్నేళ్లుగా మార్గదర్శకత్వం చేస్తోందని, కీలకమైన ఇంటర్వ్యూలో గట్టెక్కడంపై మెళకువలు అందిస్తున్నామని మహేశ్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన దేవానంద్ తెల్గోటే తొలి ప్రయత్నంలోనే ఫారెస్ట్ సర్వీస్ 112వ ర్యాంకు సాధించారు. 2020లో యూపీఎస్సీ ఇంటర్వ్యూ సమయంలో కరోనా బారినపడి, మృత్యువు అంచుల వరకు వెళ్లిన దేవానంద్.. ఏడీజీ మహేశ్ భగవత్ సాయంతోనే హైదరాబాద్‌లోని ప్రముఖ ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు.

ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచనతో..

మాది వ్యవసాయ కుటుంబం. ఐఐటీ ముంబైలో బీటెక్ చేశాను. ప్రజలకు సేవ చేసేందుకు యూపీఎస్సీకి సిద్ధమయ్యాను. గతంలో ఏడాదిపాటు ఈపీఎఫ్ఓలో పనిచేశాను. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రీసెర్చ్(ఐసీఏఆర్)లో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో పనిచేస్తూనే ఫారెస్ట్ సర్వీస్ పరీక్షకు హాజరై ఎంపికయ్యాను.

- ప్రశాంత్, ఫారెస్ట్ సర్వీస్‌లో 25వ ర్యాంకు

ఐఏఎస్ సాధించడమే లక్ష్యం

మా తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. 2018లో ఇంజనీరింగ్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరా. కలెక్టర్ అయి ప్రజలకు సేవ చేయాలన్నది నా అంతిమ లక్ష్యం. అందుకోసం ఉద్యోగాన్ని వదిలేసి యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యాను. ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికవడం ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఐఏఎస్ సాధించాలన్న లక్ష్యం నెరవేర్చుకుంటాను.

- చాడ నిఖిల్‌రెడ్డి, ఫారెస్ట్ సర్వీస్‌లో 25వ ర్యాంకుజ

ప్రతి చిన్న విషయానికీ హైకోర్టుకు..!

- రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్థాయిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ స్థాయికి దిగజార్చారు
- మీ మధ్యన ఉన్న సిల్లీ వివాదాలు పరిష్కరించడానికి ఇక్కడ లేము
- రాజకీయ పార్టీలపై ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): గత ఐదారేళ్లలో రాజకీయ పార్టీలు ప్రతి చిన్న విషయాన్నీ హైకోర్టుకు తీసుకొచ్చి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్థాయిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ స్థాయికి దిగజార్చాయని హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రెండు రాజకీయ పార్టీలు తమ మధ్య ఉన్న సమస్యలను కోర్టులకు తీసుకొచ్చి న్యాయస్థానాలను క్రీడా మైదానాలుగా మార్చాయని, ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని వ్యాఖ్యానించింది. కోర్టులో షో చేయవద్దని హెచ్చరించింది. ప్రతీ ఒక్కరూ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది. తిరువూరు నగర పంచాయితీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా భద్రత కల్పించాలని కోరుతూ వైసీపీ కౌన్సిలర్లు వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. భద్రత అవసరమైన కౌన్సిలర్లు పోలీసులకు వినతి సమర్పించాలని గతంలోనే ఉత్తర్వులు ఇచ్చామని, తమ ఆదేశాలకు అనుగుణంగా వినతిపత్రం ఎందుకు సమర్పించలేదని పిటిషనర్లను ప్రశ్నించింది. తాము ఇచ్చిన ఆదేశాలు పోలీసులు అమలు చేయలేదని గుర్తిస్తే కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు ఎవరినీ ఉపేక్షించబోమని, వారిని శిక్షించడానికి కూడా వెనుకాడబోమని వ్యాఖ్యానించింది. అవసరమైతే కోర్టు ధిక్కరణ కింద చర్యలు ప్రారంభిస్తామని పేర్కొంది. పిటిషనర్ల వైపు నుంచి తప్పు ఉందని తేలితే రూ.10లక్షలు జరిమానా విధించి వ్యాజ్యాలు కొట్టివేస్తామని హెచ్చరించింది. కోర్టులతో ఆటలాడొద్దని, మీ మధ్యన ఉన్న సిల్లీ వివాదాలు పరిష్కరించడానికి ఇక్కడ లేమని ఘాటుగా స్పందించింది. తమ ఆదేశాల అమలుకు సంబంధించిన నివేదికను తదుపరి విచారణలో తమ ముందు ఉంచాలని స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఆరుగురు అధికారులతో కమిటీ

'గుల్జార్ హౌజ్' అగ్నిప్రమాదంపై దర్యాప్తు చేసేందుకు ఏర్పాటు చేసిన సర్కారు

- సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశం
- శాంపిల్స్ సేకరించిన ఫోరెన్సిక్ బృందం
- అగ్ని ప్రమాదం జరిగిన తీరుపై లోతైన దర్యాప్తు
- టెర్రస్ పైన ఉన్న నలుగురు కార్మికులు సురక్షితం
- నేడు కార్మికులు, మృతుల కుటుంబ సభ్యులను విచారించనున్న చార్మినార్ పోలీసులు
- దేశంలోనే అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నాం
- అసత్య ఆరోపణలు సరికాదు: అగ్నిమాపక శాఖ



అగ్ని ప్రమాదం జరిగిన ఇంటి వద్ద ఫోరెన్సిక్, క్లూస్ టీమ్ సభ్యులు

హైదరాబాద్ సిటీ/చార్మినార్, మే 20 (ఆంధ్రజ్యోతి): గుల్జార్ హౌజ్ ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై దర్యాప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీ వేసింది. ప్రమాదంలో 8 మంది చిన్నారులు సహా 17 మంది మరణించిన సంగతి తెలిసిందే. మంటలు వ్యాపించడానికి కారణమేంటి? పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరగడానికి కారణాలు ఏంటి? అనే అంశాలపై స్థానికులు, అధికారులు, నాయకుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీ వేసినట్లు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ప్రకటించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌తో కమిటీని వేసినట్లు తెలిపారు. పెద్దపెద్ద అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు నష్టాన్ని తగ్గించడంపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిందిగా కమిటీని ఆదేశించినట్లు సమాచారం.

నమూనాలు సేకరించిన ఫోరెన్సిక్ బృందం..

ప్రమాదం జరిగిన ఇంట్లో మంగళవారం ఫోరెన్సిక్, క్లూస్ టీమ్ అధికారులు మృతుల బంధువుల సమక్షంలో 3 గంటల పాటు తనిఖీలు చేశారు. ఇంటి లోపలికి వెళ్లే ప్రధానమార్గం మొదలుకొని లోపలున్న కొద్దిపాటి పార్కింగ్ స్థలం, అక్కడి మెట్లమార్గం, ఇంట్లోని గదులను పరిశీలించారు. పేలిపోయిన ఏసీ కంప్రెషర్ ముక్కలు, కాలిపోయిన ఇతర వస్తువుల నమూనాలను సేకరించారు. ప్రమాదం కారణంగా ఇంటి గోడలు బీటలు వారినట్లు గుర్తించారు. భవనంలో 14 ఏసీలు ఉన్నట్లు గుర్తించారు. బయటకు వెళ్లేందుకు ఒక్కటే మార్గం ఉండడం వల్లే ప్రమాద సమయంలో తప్పించుకునే వీల్లేకుండా పోయినట్లు పేర్కొన్నారు. ఓవర్ లోడ్ వల్ల విద్యుత్తు మీటర్లలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి, క్రమంగా ఏసీలకు పాకడంతో దారుణం జరిగి ఉండొచ్చనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. మెట్ల వద్ద పార్క్ చేసిన బైకులకు మంటలు అంటుకున్నాయని, వాటిలోని పెట్రోల్ కారణంగా మంటల తీవ్రత పెరిగి ఉంటుందని, అలాగే వాహనాల సీట్ల కవర్లు కాలిపోయి దట్టమైన పొగలు వ్యాపించాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇంటి బయటి ద్వారం కూడా షట్టర్ కావడంతో పొగ పై అంతస్తులకు వేగంగా వ్యాపించి ఉంటుందని భావిస్తున్నారు. కాగా, ఉన్నతస్థాయి అధికారుల కమిటీతో సమన్వయం చేసుకుంటూ విచారణ కొనసాగిస్తామని చార్మినార్ పోలీసులు తెలిపారు. మొదటి, రెండో అంతస్తులకు మంటలు, పొగలు వ్యాపించిన క్రమంలో బాధితులు టెర్రస్ పైకి వెళ్లడానికి ప్రయత్నించగా దానికి తాళం వేసినట్లు దర్యాప్తులో తేలింది. టెర్రస్ పైన ఉన్న నలుగురు కార్మికులు సురక్షితంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. గుల్జార్ హౌజ్ ప్రాంతంలో భవనాలన్నీ అతుక్కొని ఉండడంతో దొంగలు సులభంగా చోరీలకు పాల్పడే అవకాశం ఉంటుంది. దీంతో రోజూ దుకాణాల్లో పనిచేసే కార్మికులు టెర్రస్‌పైన పడుకునేటప్పుడు మెట్ల మార్గానికి తాళం వేస్తారని గుర్తించారు. ప్రాణాలతో బయటపడిన కార్మికులు మృతుల కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియల్లో పాల్గొన్నట్లు చెబుతున్నారు. బుధవారం ఆ నలుగురితో పాటు మృతుల కుటుంబ సభ్యులను విచారించనున్నట్లు పోలీసులు తెలిపారు.

అత్యాధునిక సాంకేతికతను వాడుతున్నాం: అధికారులు

మృతుల బంధువులు చేసిన ఆరోపణలను అగ్నిమాపక శాఖ అధికారులు ఖండించారు. తెలంగాణ అగ్నిమాపక శాఖ దేశంలోనే అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోందని తెలిపారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఫైరింజన్లలో నీరు లేదన్న ఆరోపణలు అవాస్తవమని చెప్పారు. ఫైరింజన్‌లో 4500 లీటర్ల నీటిని నిల్వ చేస్తారని, సాధారణ పీడనం వద్ద జెట్స్‌ను వాడినప్పుడు ట్యాంకు ఖాళీ అవడానికి 20 నిమిషాలు పడుతుందని, పరిస్థితి తీవ్రతను బట్టి అధిక పీడనంతో రెండు జెట్స్ వాడితే నీరు 10 నిమిషాల్లోనే అయిపోతుందని వివరించారు. ఈ విషయం తెలియని వారు ఫైరింజన్‌లో నీళ్లు లేవని ఆరోపిస్తారని చెప్పారు.

మా అన్న అలాంటోడు కాదు..

- ఉగ్రవాదులతో సంబంధాలు లేవు
- సమీర్ చెల్లెలు అలియా బేగం



సమీర్



అలియా బేగం

అడ్డగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదులతో తన అన్నకు ఎలాంటి సంబంధం లేదని విజయనగరం పోలీసుల అదుపులో ఉన్న సమీర్ సోదరి అలియా బేగం ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మంగళవారం మాట్లాడుతూ... ఈ నెల 16న తమ ఇంటికి కొంతమంది వ్యక్తులు వచ్చి సమీర్‌ను వెంట తీసుకెళ్లడమే కాకుండా ఇంట్లో పూర్తిగా తనిఖీలు చేశారని తెలిపింది. తన అన్నకు సంబంధం ఉన్నట్లు ఆరోపిస్తున్న సిరాజ్ ఎవరో తమకు తెలియదని, సమీర్ ఏసీ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని చెప్పింది. సమీర్‌ను తీసుకెళ్లింది ఎవరు? ఎక్కడికి తీసుకెళ్లారు... ఉగ్రవాదులతో సంబంధం ఉందంటూ మీడియాలో కథనాలు వస్తున్నాయి... అసలేం జరిగిందో పోలీసులే చెప్పాలని కోరింది. న్యాయం కోసం ఒవైసీతో పాటు సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తానని తెలిపింది. తమ కుటుంబం ఇంటికి తాళం వేసి పారిపోయినట్లు మీడియాలో కథనాలు రావడంపై ఆవేదన వ్యక్తం చేసింది. సమీర్‌ను పోలీసులు తీసుకెళ్లడంతో బీపీ, మధుమేహ వ్యాధితో బాధపడుతోన్న తమ తల్లికి వైద్యం చేయించేందుకు ఆస్పత్రికి వెళ్లి తిరిగి గంటలోపే ఇంటికి చేరుకున్నామని చెప్పింది. ఇప్పటికీ తాము ఆ ఇంట్లోనే ఉన్నామని తెలిపింది.

సిరాజ్‌కు 10 బ్యాంకు ఖాతాలు!

- కాల్ డేటాపైనా ఎన్ఐఏ ఆరా

విజయనగరం, మే 20(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సానుభూతిపరులైన విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన్ సయ్యద్ సమీర్ కార్యకలాపాలపై ఎన్ఐఏ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్థిక మూలాలను శోధిస్తున్నట్లు తెలుస్తోంది. సిరాజ్‌కు 10 బ్యాంక్ అకౌంట్‌లు ఉన్నట్లు సమాచారం. వీటిలో విజయనగరంలోని డీసీసీబీ ఖాతా, అతని తండ్రి పేరుపై ఉన్న లాకర్ గురించి పోలీసులు ఇప్పటికే ఆరా తీశారు. ఎన్ఐఏ అధికారులు రెండు రోజులుగా విజయనగరంలోనే ఉంటూ విచారిస్తున్నారు. అన్ని కోణాల్లో ఆరా తీస్తూ సమాచారాన్ని క్రోడీకరిస్తున్నారు. సిరాజ్ సమీప బంధువులు, కుటుంబ సభ్యులు, అతని బ్యాంక్ ఖాతాల లావాదేవీలు, సెల్‌ఫోన్ నంబర్ల వినియోగం, కాల్ డేటా తదితర విషయాలను మంగళవారం నమోదు చేసుకున్నారు. సిరాజ్ కుటుంబం నివాసం ఉండే ఆబాద్‌వీధి, సిరాజ్ ప్రత్యేకంగా ఉంటున్న బాబామెట్టలోని ఆయన ఇంటిని మరోసారి పరిశీలించినట్లు సమాచారం. అలాగే సయ్యద్ సమీర్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో ఆర్థిక లావాదేవీలు, మొబైల్ కాంటాక్ట్ నంబర్లపై ఓ స్పష్టతకు వచ్చినట్లు తెలిసింది. కాగా, సిరాజ్, సమీర్‌ల నుంచి సమాచారం రాబట్టేందుకు వారిని తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.

రాజ్‌భవన్‌లో మార్ఫింగ్ రచ్చ!

- హార్డ్‌డిస్కుల చోరీతో బయటపడ్డ బాగోతం
- మార్ఫింగ్ లతో తోటి ఉద్యోగినిని బెదిరించిన ఓ ఉద్యోగి
- ఆ కేసులో అరెస్టు, ఉద్యోగం నుంచి సస్పెన్షన్

పంజాగుట్ట, మే 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాజ్‌భవన్‌లో హార్డ్ డిస్కులు, కీలక పత్రాలు చోరీ అంటూ జరిగిన విస్తృత ప్రచారంతో.. ఆ చోరీ వెనుక ఉన్న మార్ఫింగ్ ఫొటోల రచ్చ బయటపడింది. మార్ఫింగ్ ఫొటోలతో తోటి మహిళా ఉద్యోగినిని వేధించి సస్పెండైన రాజ్‌భవన్‌కు చెందిన ఓ ఉద్యోగి చీకటి బాగోతం ఆలస్యంగా వెలుగు చూసింది. హెల్మెట్ ధరించిన ఓ వ్యక్తి రాజ్‌భవన్‌లోకి దర్జాగా ప్రవేశించి కంప్యూటర్ గదిలోని హార్డ్ డిస్కులు దొంగలించాడు అనే వార్త మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. దీంతో స్పందించిన పంజాగుట్ట ఏసీపీ ఎస్.మోహన్ కుమార్ ఈ చోరీ వ్యవహారంపై స్పష్టతనిచ్చారు. ఆయన కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ (45) రాజ్‌భవన్‌లో కంప్యూటర్ హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసేవాడు. శ్రీనివాస్ కొద్ది రోజుల క్రితం తోటి మహిళా ఉద్యోగినికి ఆమెకు చెందిన కొన్ని మార్ఫింగ్ ఫొటోలు చూపించాడు. గుర్తు తెలియని వ్యక్తులు తనకు ఆ ఫొటోలు పంపారని, తన కంప్యూటర్‌లో ఇంకా చాలా ఫొటోలు ఉన్నాయని, జాగ్రత్తగా ఉండాలని ఆమెను భయపెట్టాడు. అయితే, తన ఫొటోలను ఎవరో మార్ఫింగ్ చేశారని పేర్కొంటూ సదరు మహిళ మే 10న పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేసిన పోలీసులు ఆ ఫొటోల వెనుక ఉన్నది శ్రీనివాసే అని తేల్చారు. శ్రీనివాస్‌ను మే 12న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ వెంటనే రాజ్‌భవన్ అధికారులు శ్రీనివాస్‌ను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. అయితే, రెండ్రోజులకే బెయిల్‌పై విడుదలైన శ్రీనివాస్.. తాను మార్ఫింగ్ చేసిన మహిళ ఫొటోలు, వీడియోలు ఉన్న కంప్యూటర్ హార్డ్ డిస్కుల చోరీకి సిద్ధమయ్యాడు. మే 14వ తేదీ రాత్రి రాజ్‌భవన్‌కు వచ్చి భద్రతా సిబ్బందిని మభ్యపెట్టి లోపలికి ప్రవేశించాడు. తలకు హెల్మెట్ ధరించి కంప్యూటర్లున్న గదిలోకి వెళ్లి తనకు కావాల్సిన హార్డ్‌డిస్కులను ఎత్తుకెళ్లాడు. ఈ చోరీపై రాజ్‌భవన్ ఐటీ విభాగం మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు చోరీకి పాల్పడింది శ్రీనివాస్ అని గుర్తించారు. మే 15న శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని హార్డ్‌డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చోరీ కేసులో అతడిని రిమాండ్‌కు తరలించారు. కాగా, తాను మార్ఫింగ్ చేసిన ఫొటోలు బయటి రాకూడదని శ్రీనివాస్ హార్డ్‌డిస్కులు చోరీ చేశాడని, రాజ్‌భవన్‌లో కీలకమైన సమాచారం ఉన్న హార్డ్ డిస్కులు, ఫైళ్లు మాయం అవ్వలేదని పోలీసులు వెల్లడించారు.

నాలుగైదు రోజుల్లోనే కేరళకు నైరుతి

- సాధారణం కంటే వారం ముందే రుతుపవనాల రాక
- రాష్ట్రంలో నేడు, రేపు అక్కడక్కడ భారీ వర్షాలు

హైదరాబాద్, బోథ్, కాటారం, విశాఖపట్నం, అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి) :నైరుతి రుతుపవనాలు మరో నాలుగైదు రోజుల్లో కేరళను తాకనున్నాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) అంచనా వేసింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1న కేరళను తాకుతాయి. జూలై 8 నాటికి దేశమంతా విస్తరిస్తాయి. అయితే, ఈ ఏడాది ముందస్తుగానే మే 27న రుతుపవనాలు కేరళను తాకుతాయని ఇటీవల ఐఎండీ అంచనా వేసింది. కానీ దాని కంటే ముందే రుతుపవనాలు కేరళను తాకనున్నట్టు మంగళవారం వెల్లడించింది. కాగా, బుధ గురువారాల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, కొన్ని చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఇక, రాష్ట్రంలో పలు చోట్ల మంగళవారం వర్షాలు కురిశాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో అత్యధికంగా 5.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరోపక్క, నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో రాష్ట్రంలోనే గరిష్ఠంగా 40.6 డిగ్రీలు, వనపర్తి జిల్లా మదనాపూర్‌లో కనిష్ఠంగా 35.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వడదెబ్బకు ఇద్దరు మృతి

ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన షేక్ అమౌంత్ (18) అనే యువకుడు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన మంథెన శ్రీనివాస్(35) వడదెబ్బకు గురై మరణించారు. బోథ్‌కు చెందిన అమౌంత్ స్థానిక స్టేడియంలో క్రికెట్ ఆడుతూ అస్వస్థతకు గురై వాంతులు చేసుకుని కుప్పకూలిపోయాడు. స్నేహితులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. ఇక, కాటారం గ్రామ పంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్ అయిన మంథెన శ్రీనివాస్.. సరస్వతి పుష్కరాల విధులకు వెళ్లి ఆదివారం అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స అనంతరం ఇంటికి తిరిగొచ్చిన శ్రీనివాస్ సోమవారం రాత్రి తిరిగి అస్వస్థతకు గురై మరణించాడు.

మెట్రో టికెట్ ధర 10 శాతం తగ్గింపు

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో టికెట్ ధరలను ఇటీవల పెంచిన ఎల్ అండ్ టీ సంస్థ.. సవరించిన ధరలపై తాజాగా 10 శాతం తగ్గింపును ప్రకటించింది. తగ్గిన ధరలు ఈ నెల 24 నుంచి అమలులోకి వస్తాయని మంగళవారం వెల్లడించింది. నగరంలో మెట్రో రైలు ప్రారంభించిన 2017 తర్వాత తొలిసారిగా ఫేర్ ఫిక్సేషన్ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) నివేదిక ఆధారంగా ఎల్ అండ్ టీ సంస్థ ఇటీవల 20 నుంచి 42.8 శాతం వరకు రేట్లను పెంచింది. ఇందులో భాగంగా కనిష్ఠంగా రూ.2 నుంచి.. గరిష్ఠంగా రూ.16 వరకు ధరలను పెంచింది. దీంతో ప్రయాణికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. గతంతో పోల్చితే తమపై రూ.15 నుంచి రూ.16 అదనపు భారం పడుతోందని, పెంచిన చార్జీలను తగ్గించాలని రెండు రోజుల క్రితం నాగోల్‌లోని ఎల్ అండ్ టీ ప్రధాన కార్యాలయం ఎదుట ప్రయాణికులు భారీ ధర్నా చేపట్టారు. ఓ వైపు ప్రయాణికుల నుంచి వ్యతిరేకత, మరోవైపు ప్రభుత్వం నుంచి వచ్చిన సూచనలతో ఎల్ అండ్ టీ అధికారులు సవరించిన రేట్లపై 10 శాతం రాయితీని ప్రకటించారు.

భూ భారతి చట్టం.. రైతుల ఇంటి చుట్టం

- భూముల గట్టు పంచాయితీలకు త్వరలో పరిష్కారం..
- ఆగస్టు 15 లోపు జటిలమైన భూసమస్యలు పరిష్కరిస్తాం
- 27న రాష్ట్రవ్యాప్తంగా 6వేల మంది సర్వేయర్ల ఎంపిక: మంత్రి పొంగులేటి



పెద్దపల్లి జిల్లా ముప్పిరితోటలో భూ సమస్యను పరిష్కరించిన పత్రాలను అందజేస్తున్న మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

హుస్నాబాద్/మంచిర్యాల/పెద్దపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): 'భూ భారతి చట్టం.. రైతుల ఇంటి చుట్టం' అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతులు తమ భూ వివాదాల పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ తిరగకుండా ఉండేందుకే భూ భారతి చట్టాన్ని తెచ్చామని తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న జటిలమైన భూ సమస్యలను ఈ చట్టం ద్వారా వచ్చే ఆగస్టు 15లోపు పరిష్కరిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులే రైతుల ఇళ్ల వద్దకు వచ్చి వారికి దరఖాస్తు ఫారం అందజేస్తారని పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోట, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఘనపూర్ గ్రామాల్లో, మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పలుచోట్ల నెలకొన్న ప్రభుత్వ, అటవీ, ప్రైవేటు భూముల గట్టు పంచాయితీలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. గతంలో ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, ఆ భూములను సాగు చేసుకుంటున్న వారసుల్లో అర్హులకు సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో పట్టాలు పంపిణీ చేస్తారని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఎలిగేడు మండలంలో వచ్చిన 1054 భూ సమస్య దరఖాస్తుల్లో కొన్నింటిని పరిష్కరించామని, మిగతా వాటిని జూన్ 2 లోపు పరిష్కరిస్తామని అన్నారు. 2020లో నాటి సర్కారు తెచ్చిన ధరణి చట్టంలో సాదా బైనామాలకు పరిష్కారం చూపకుండానే 9.20 లక్షల దరఖాస్తులను స్వీకరించారని, ఈ అంశం ప్రస్తుతం కోర్టుల్లో ఉందని చెప్పారు.

భూములకు భూధార్ కార్డులు..

ఆధార్ లాగా, భూములకు భూధార్ కార్డు ఇస్తామని, ఈ నంబర్‌తో ఆన్‌లైన్‌లో రైతులు తమ భూముల వివరాలు చూసుకోవచ్చని మంత్రి పొంగులేటి అన్నారు. సర్వే చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసి ఆ మ్యాపులను పాస్ బుక్‌లో జోడిస్తామన్నారు. ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా 6వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఎంపిక చేసి, వారికి మూడు నెలల శిక్షణ ఇస్తామని, ప్రతి మండలానికి 8 మందికి తగ్గకుండా నియమిస్తామని చెప్పారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తికమక అవుతూ సర్కారును బదనాం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అంతకుముందు హుస్నాబాద్ మినీ స్టేడియంలోని హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ దిగిన సందర్భంగా మంత్రి రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2 నుంచి అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూభారతి చట్టం అమలుకు తహసీల్దార్ స్థాయి సదస్సులు జరుగుతాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఈ నెలాఖరులోపు మొదటి దశలో 4.50 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.